


వైసీపీ సరికొత్త నాటకం

రాజ్యసభ ఓట్ల కోసం ఎమ్మెల్యేలను మభ్యపెడుతున్న వైనం

అధికార వైసీపీలో సరికొత్త జగన్నాటకం ఆరంభమైంది. ఎడాపెడా ఎమ్మెల్యేలను తొలగించి కొత్త ఇన్‌చార్జిలను నియమించడంతోపాటు కావాలనుకున్న శాసనసభ్యులను వారికి ఇష్టం ఉన్నా లేకున్నా వేరే నియోజకవర్గాలకు బదిలీ చేసిన అధిష్ఠానం తాజాగా ఆ అంశాలలో వెనకడుగు వేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలు పలువురు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడం, కొన్నిచోట్ల ప్రతిపక్ష టీడీపీలో చేరడం జరుగుతోంది. జిల్లాలోనూ ఎంపీ మాగుంటతోపాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా టీడీపీతో టచ్‌లో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఈనేపథ్యంలో అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను మీకు ఇంకా అవకాశం ఉందంటూ వైసీపీ రాష్ట్రస్థాయి ముఖ్యనేతలు మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

- పోటీ చేయం, స్థానం మారం అన్నా ఒప్పించడంలో అదే లక్ష్యం
- నూతన ఇన్‌చార్జిలను నియమించిన చోటా ఎమ్మెల్యేలకు సరికొత్త ఆశలు
- కొత్తగా వచ్చిన వారు ఉండొచ్చు.. మారొచ్చు అని సంకేతాలు
- సర్వేల ప్రకారం నిర్ణయమంటూ ప్రచారం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రం నుంచి ముగ్గురిని రాజ్యసభ సభ్యులుగా ఎన్నుకునేందుకు ఈనెల 27న ఎన్నిక జరగనుంది. ఎమ్మెల్యేలే వారిని ఎన్నుకోవాల్సి ఉంది. ప్రతిపక్ష టీడీపీకి ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారమైతే మూడు రాజ్యసభ స్థానాలనూ వైసీపీ సులువుగా చేజిక్కించుకుంటుంది. కానీ గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవం ఆపార్టీని వెంటాడుతోంది. మరోవైపు టీడీపీలోకి ఇప్పటికే కొన్ని జిల్లాలలో ఎమ్మెల్యేలు చేరిపోవడంతోపాటు మరికొందరు ఆపార్టీకి టచ్‌లో ఉన్నారు. మన జిల్లాలో కూడా అలాంటి పరిస్థితే ఉంది. ఈనేపథ్యంలో రాజ్యసభ ఎన్నికల నాటికి వైసీపీ ఎమ్మెల్యేలు చేజారితే కనీసం ఒక స్థానం నుంచైనా ఆపార్టీ అభ్యర్థి ఓడిపోయే ప్రమాదం ఉంది. ఇంకోవైపు టీడీపీ కూడా మారిన పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థులను రంగంలోకి దించనుంది. ఈనేపథ్యంలో జిల్లాలో టికెట్లు లేవు పొమ్మన్న ఆపార్టీ ఎమ్మెల్యేలను, వారికి ఇష్టం లేకుండా నియోజకవర్గాలు మార్చిన వారిని మైమరిపించే ప్రయత్నాన్ని వైసీపీ అధిష్ఠానం చేస్తోంది.

ఇటు, అటు మార్పుల్లో ఆంతర్యం అదే

గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తాను పోటీచేయనని ప్రకటించినా అవకాశం ఇవ్వడంలోని ఆంతర్యం కూడా ఇదేనని భావిస్తున్నారు. ఆయన ప్రకటన చేసిన కొద్దిరోజులకే పిలిచి మాట్లాడినప్పుడు నిర్ణయంపై పునరాలోచించుకోవాలని జగన్ సూచించలేదన్న విషయం రాంబాబు అనుచరులే బహిరంగంగా చెప్పుకున్నారు. మార్కాపురం నుంచి జంకెను పిలిచి పోటీకి సిద్ధం కావాలని చెప్పిన అధిష్ఠానం.. రాజ్యసభ ఓట్ల భయంతో వెనక్కు తగ్గి నాలుగు రోజుల్లోనే ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని పిలిచి మీరే అభ్యర్థి అని చెప్పింది. మరో నాలుగురోజులకే అదే నాగార్జునరెడ్డిని పిలిచి గిద్దలూరు వెళ్లాలని సూచించింది. ఆయన ససేమిరా అనడంతో సీఎం నేరుగా రంగంలోకి వచ్చి అసలు ఎన్నికల్లో పోటీచేయనన్న రాంబాబును మార్కాపురంనకు, నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు ఒప్పించినట్లు సమాచారం. ఆ ఇద్దరినీ ఖాళీగా ఉంచితే రాజ్యసభ ఎన్నికల పోలింగ్ నాటికి ఎలా ఉంటుందోనన్న అనుమానంతోనే అలా చేశారని ప్రచారం జరుగుతోంది.

ఇంకా అవకాశం ఉందంటూ సంకేతాలు

ప్రధానంగా వైసీపీ ఎమ్మెల్యేల స్థానంలో వేరేవారిని ఇన్‌చార్జిలుగా నియమించిన నియోజకవర్గాల్లో తిరిగి మీకే అవకాశం రావచ్చంటూ ఆఎమ్మెల్యేలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కాదూ కూడదంటే వేరేస్థానం అయినా ఇస్తాం అని చెప్తున్నారు. ఇప్పటికే సంతనూతలపాడు, కనిగిరి, దర్శి ఎమ్మెల్యేలు సుధాకర్‌బాబు, మధుసూదన్, వేణుగోపాల్‌లను తప్పించి అక్కడ వేరే వారిని ఇన్‌చార్జిలుగా నియమించారు. ప్రస్తుతం ఆ ముగ్గురికీ వివిధ రకాల ఆశలు చూపిస్తున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు విషయంలో మాత్రం కొంత కఠినంగా ఉన్నప్పటికీ మీకు చాలా భవిష్యత్తు ఉంది. రాష్ట్ర పార్టీలో మీకు పదవులు రావచ్చని ఆశ పెట్టినట్లు తెలిసింది. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను అయితే ఒంగోలు లేక పర్చూరు ఎమ్మెల్యేగా పోటీచేయాలని సూచిస్తున్నారు. ఇక అన్ని అవకాశాలూ సన్న గిల్లాయనుకున్న నేపథ్యంలో ఆయన్ను మంగళవారం మరోసారి పిలిపించుకుని మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే. మీరు పర్చూరు నుంచి పోటీచేయండని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ విషయంలోనూ ఆశ చూపగా ఆయన ససేమిరా అనడంతో తాజా సర్వే ఫలితం కొత్త ఇన్‌చార్జికి సానుకూలంగా రాకపోతే తిరిగి మీకే అవకాశం రావచ్చంటూ ఆశపెట్టి నిలబెట్టినట్లు తెలుస్తోంది. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి విషయంలోనూ వైసీపీ అధిష్ఠానం అదేరకమైన తంతును నడుపుతోంది. ఇదే తంతు నడుస్తోంది. రోజుమార్చి రోజు సీఎంవోలోని అధికారులు లేక అధిష్ఠానంలోని కొందరు నాయకులు ఆయన్ను పిలిపించి మాట్లాడుతున్నారు. కందుకూరు నియోజకవర్గానికి వెళ్తే బాగుంటుందని

చీరాలలోనూ అదే తంతు

పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ చీరాలలో అనుయాయులతో సమావేశమై వైసీపీ అభ్యర్థిగా ప్రకటించిన కరణం వెంకటేష్‌కు మద్దతివ్వాల్సిన అవసరం లేదని స్పష్టంచేయడంతోపాటు తానే రంగంలోకి రావచ్చన్న సంకేతం ఇచ్చారు. కాకుంటే 2014లో మాదిరి స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలోకి దిగుతానన్న సంకేతాన్ని పంపారు. మామూలుగా అయితే అలాంటి వారిపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకునే జగన్ ఆయన్ను పిలిచి మాట్లాడారే తప్ప చర్యల జోలికి వెళ్లలేదు.

బాలినేని విషయంలోనూ మౌనం

పార్టీ సీనియర్ నాయకుడైన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా ఎంపీ అభ్యర్థి విషయంలో తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు. తనను కలిసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో దురుసుగా కూడా మాట్లాడారు. అయినా జగన్ నుంచి మౌనమే సమాధానమైంది. వీటన్నింటికీ జగన్ రాజ్యసభ ఎన్నికల తర్వాతే తనదైన శైలిలో బదులిస్తారని అప్పటి వరకు ఆ మైమరపు వ్యవహారాలు కొనసాగుతాయనేది తలపండిన రాజకీయ విశ్లేషకుల అంచనా.



బాలోత్సవ్‌లో నాట్యం చేస్తున్న విద్యార్థినులు

సృజనాత్మకత పెంచేందుకే బాలోత్సవ్

- జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 9: విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందిస్తే వారు జీవితంలో మంచి ఫలితాలు సాధిస్తారని, అందుకోసమే బాలోత్సవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన బాలోత్సవ్‌ను ఆమె కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వెంకాయమ్మ మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తి, మత సామరస్యాన్ని పెంపొందించడమే



లక్ష్యంగా బాలోత్సవ్‌ను రూపొందించారన్నారు. నేటి విద్యావిధానంలో పిల్లలు ఎదుర్కొంటున్న ఒత్తిడిని అధిగమించేందుకు వారిలో మానసిక స్థైర్యాన్ని, నైతిక విలువలను పెంచేవిధంగా జడ్పీ నిధులు రూ.4.5లక్షలు కార్యక్రమానికి మంజూరు చేశామన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి ప్రోత్సహించేలా ప్రకాశం బాలోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఒంగోలు నగరంలో బాలోత్సవ్ నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ 32 అకడమిక్, 15 కల్చరల్ ఈవెంట్స్‌ను 5 వేదికలలో శుక్ర, శనివారాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, ఉప విద్యాశాఖాధికారి అనితారాణి, పీవీఆర్ స్కూల్ హెచ్ఎం మువ్వ రాధిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ట్రెజరీలో ఆంక్షలు

- జీతాలు మినహా అన్ని రకాల బిల్లులు నిలిపివేత
- అప్‌లోడ్ చేసేందుకే పరిమితం



ఒంగోలులోని సబ్ ట్రెజరీ కార్యాలయం

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 9 : జిల్లాలో అన్ని రకాల బిల్లులపై ఆంక్షలు వచ్చిపడ్డాయి. మార్చి రాకముందే ప్రభుత్వం ట్రెజరీల్లో బిల్లుల మంజూరు చేయకుండా ఆపేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ట్రెజరీల ద్వారా ఉద్యోగుల జీతాలు, అద్దె వాహనాల బిల్లులు మినహా ఇతర అన్నిరకాల చెల్లింపులపై ప్రభుత్వం ఆంక్షలు విధించినట్లు సమాచారం. కొన్నిరకాల బిల్లులు ట్రెజరీ నుంచి అప్‌లోడ్ అవుతున్నా బ్యాంకుల్లో నగదు మాత్రం జమ కావడం లేదు. నాలుగైదు రోజుల నుంచి ఉద్యోగుల జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, అద్దె వాహనాల బడ్జెట్ మినహా ఇతర అన్ని రకాల బిల్లులు మొత్తం నిలుపుదల చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ బిల్లులు మొత్తం ఆపేసినట్లు సమాచారం. సాధారణంగా ప్రతినెలా రెండోవారం నుంచి కార్యాలయాలకు సంబంధించిన మెయింటినెన్స్ బిల్లులు ట్రెజరీ ఆఫీసులకు వెళ్తుంటాయి. అయితే ఈసారి 5వతేదీ నుంచే ఆ బిల్లులపై ఆంక్షలు రావడంతో ఒక్కటి కూడా అప్‌లోడ్ చేయడం లేదు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి విద్యుత్, టెలిఫోన్, నెట్, కార్యాలయాలకు అవసరమైన వైట్‌పేపర్లు, ఇతర సామగ్రి తదితర అన్నిరకాల బిల్లులను నిలిపేశారు. సాధారణంగా మార్చి ఆఖరులో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆంక్షలను ప్రభుత్వం ప్రతి ఏటా పెడుతుంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి మొదటివారంలోనే ట్రెజరీకి తాళాలు వేయడంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనన్న ఆందోళన అందరిలోనూ వ్యక్తమవుతోంది.



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, కారు, ద్విచక్రవాహనం

మేమింతే.. మారమంతే..!

రెచ్చిపోతున్న మద్యం మాఫియా

- సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లే సూత్రధారులు
- కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినా మారని తీరు
- మద్యం తరలిస్తూ పట్టుబడ్డ పెదఇర్లపాడు సూపర్‌వైజర్

పీసీపల్లి, ఫిబ్రవరి 9 : మండలంలో మద్యం మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బందే ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొందరు బాటిళ్లు కొనుగోలు చేసి గ్రామాలకు తరలించి బెల్టుషాపులు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు సంపూర్ణంగా సహకరిస్తున్నారు. ఒక్కో బాటిల్‌కు ఎమ్మార్పీపై రూ.10 నుంచి రూ.15 అదనంగా తీసుకుని అడిగిన మేరకు ఇస్తూ అక్రమ మార్గంలో భారీగా పోగేసుకుంటున్నారు. ఫిర్యాదులు వచ్చిన సమయంలో ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి పట్టుకుని కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది తీరులో ఎటువంటి మార్పు రావడం లేదు. కారణం దుకాణాల్లో పనిచేసేందుకు తమకు సిఫారసు చేసిన అధికార పార్టీకి చెందిన నాయకులు అండగా ఉన్నారనే ధీమానే. వారు రిమాండ్‌కు పోయివచ్చినా నిస్సిగ్గుగా తిరిగి మద్యం దుకాణాల్లో పనిచేస్తూ ఎస్ఈబీ అధికారులకు సవాల్ విసురుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 2023 డిసెంబరులో మండల కేంద్రమైన పీసీపల్లిలో మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్న ఓ యువకుడిని అప్పటి ఎస్ఈబీ సీఐ అబ్దుల్‌జలీల్ పట్టుకున్నారు. అతడిని విచారించగా కనిగిరి మండలం వేమవరంలోని బెల్టుషాపులో విక్రయించేందుకు పీసీపల్లి ప్రభుత్వ మద్యం దుకాణంలో ఒక్కో బాటిల్‌పై రూ.10 అదనంగా చెల్లించి కొన్నట్లు అధికారులకు చెప్పాడు. దీంతో అతని వద్ద 100కుపైగా ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు సూపర్‌వైజర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. తాజాగా మండలంలోని పెదయిర్లపాడు మద్యం దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్న 143 మద్యం బాటిళ్లను మంగళవారం రాత్రి ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందుకు బాధ్యులైన షాపు సూపర్‌వైజర్ సాయికృష్ణారెడ్డి, సేల్స్‌మన్ వినోద్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కారు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

పీసీపల్లి సూపర్‌వైజర్‌ను తొలగించి ఉంటే?

డిసెంబరులో పీసీపల్లి సూపర్‌వైజర్‌పై కేసు నమోదు చేసిన ఎస్ఈబీ అధికారులు అదనంగా నగదు వసూలు చేసి నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే ఆ కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చిన ఆ సూపర్‌వైజర్ తిరిగి పీసీపల్లి మద్యం దుకాణంలోనే విధులు నిర్వహిస్తున్నాడు. ఆధారాలతో దొరికి రిమాండ్‌కు వెళ్లి వచ్చినా అతన్ని విధుల నుంచి తొలగించకపోవడంతోనే మిగతా దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎక్కువ ధరలకు మద్యం బాటిళ్లు విక్రయించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మేయర్ డివిజన్‌లో భారీగా దొంగ ఓట్లు..!

- ఇళ్లు లేవు.. ఓటర్లు లేరు..!
- వైసీపీ బోగస్ బాగోతం
- అధికారుల పరిశీలనలో వెలుగులోకి..



వివరాలు మెయిన్‌లో..

మెప్మాలో మల్లగుల్లాలు..!

రుణ దోపిడీపై కొనసాగుతున్న విచారణ

- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అక్రమాలు
- ఓ సీవోకు స్కూటీని బహుమతిగా ఇచ్చిన ఆర్పీ
- తప్పించుకునే మార్గంలో వైసీపీ నాయకులు, ఆర్పీలు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 9 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో బోగస్ పొదుపు గ్రూపుల కుంభకోణంపై కలవరం మొదలైంది. ఈ వ్యవహారం నుంచి ఏ విధంగా బయటపడాలో అర్థం కాక అందరూ మల్లగుల్లాలు పడుతున్నారు. రుణాల రూపంలో కోట్లు దండుకుని దర్జాగా సొంతానికి వాడుకున్న వారిని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆర్పీల వారీగా వారి పరిధిలోని పొదుపు గ్రూపులు ఎన్ని? ఎన్ని లక్షల రుణాలు మంజూరుచేశారు? నెలవారీ చెల్లింపులు ఎలా ఉన్నాయి? వాస్తవ పొదుపు సంఘాలు ఎన్ని? అని ఆరా తీస్తున్నారు. గ్రూపుల వారీగా జాబితా సిద్ధం చేసి, పీడీతోపాటు సీఎంఎం, సీవోలు విచారణ చేపట్టారు. అయితే ఇప్పటికే మేయర్ గంగాడ సుజాత వెల్లడించినట్లు ప్రాథమికంగా రూ.12కోట్లు ఉన్నట్లు తెలుస్తుండగా, పూర్తిస్థాయి విచారణ జరిగితే మొత్తం రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు దోపిడీ లెక్కలు తేలే అవకాశం కనిపిస్తోంది.

గ్రూపులతో ఆర్పీల సమావేశాలు

రుణ కుంభకోణంలో భాగస్వాములైన కొందరు ద్వితీయశ్రేణి వైసీపీ నాయకులు, అలాగే అధికార పార్టీకి చెందిన ఆర్పీలు ఈ అవినీతి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో అడ్డదారులు వెతుకుతున్నట్లు సమాచారం. కొందరు ఆర్పీలు అయితే హడావుడిగా పొదుపు గ్రూపులతో సమావేశాలు ఏర్పాటు చేసి బతిమాలుకుంటున్నారు. ఎవరైనా అధికారులు విచారణకు వచ్చి అడిగితే సభ్యులమే తీసుకున్నామని చెప్పాలని వేడుకొంటున్నారు. మొత్తంగా ఆంధ్రజ్యోతి కథనంతో నాలుగు రోజులుగా మెప్మాలో అలజడి కనిపిస్తుండగా, అధికారులు, ఉద్యోగులు తమ పేర్లు బయటకు వస్తాయేమోనని వణికిపోతున్నారు. దీంతో రెండు రోజులుగా కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం మానేసిన సీవోలు, ఇతర ఉద్యోగులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ అవినీతిపై విచారణ చేస్తున్నారు.

రుణ దోపిడీలో పలువురి పాత్ర

ఇప్పటికే ఓ కార్పొరేటర్ భర్త రుణదోపిడీ స్కాంలో భాగస్వాముడిగా ఉన్నట్లు తెలుస్తోంది. నగర వైసీపీలో హడావుడిగా కనిపించే ఓ ద్వితీయశ్రేణి నాయకుడు, మహిళా కార్పొరేటర్ భర్త కూడా చేతివాటం చూపినట్లు వెలుగుచూసింది. అలాగే వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలు చూసే ఓ వ్యక్తి తన సిఫారసుతో ఒకరిని ఆర్పీగా నియమించగా, ఆమె పరిధిలో ఒక్క పొదుపు గ్రూపు కూడా లేదని సమాచారం. అయితే ఆమె నేటికీ ఆర్పీగా కొనసాగుతూ జీతం పొందడమే కాకుండా బోగస్ రుణాల వ్యవహారంలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అసలు గ్రూపుల్లో నుంచి ఇద్దరిద్దరి పేర్లు సేకరించి వేరుగా మరో నకిలీ గ్రూపు సృష్టించి లక్షలు దండుకున్న ఆర్పీలు, తమ పలుకుబడిని ఉపయోగించి తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు. అలాగే ఒకే పొదుపు గ్రూపు పేరుతో నాలుగైదు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఆర్పీలు ఆ మొత్తాలను పంచుకున్నట్లు తెలిసింది.

తప్పించుకునే ప్రయత్నంలో వైసీపీ నాయకులు

పొదుపు రుణాల పేరుతో బ్యాంకులను బురిడీ కొట్టించిన వైసీపీ నేతలు తమ పలుకుబడితో మరికొన్ని బ్యాంకుల్లో భారీగా రుణాలు పొందినట్లు సమాచారం. అయితే వీరు నేరుగా తీసుకోకుండా అధికార దర్పంతో మెప్మాలో ఉద్యోగుల పేరుతో దండుకున్నారు. మరికొందరు రెండు, మూడు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లు సమాచారం. వరుస కథనాలతో కలవరపడిన వైసీపీ నాయకులు ఉరుకులు పరుగులు పెడుతూ తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు.



అవినీతిలో సీవోలేమీ తక్కువ కాదు..!

బోగస్ రుణ దోపిడీ దందాలో కొందరు ఆర్పీలు మాత్రమే ఉన్నట్లు అందరూ అనుకున్నారు. అయితే తాజా విచారణలో కొందరు సీవోలు, ఇతర ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. నగర పరిధిలో 4,500లకుపైగా పొదుపు గ్రూపులు ఉండగా, వారిపై 175 మంది ఆర్పీలు, 11 మంది సీవోలు, ఒక సీఎంఎం, ఇతర ఉద్యోగులు ఉన్నారు. అయితే రుణాల పేరుతో భారీగా అవినీతికి పాల్పడిన వారిలో నలభై మంది వరకు ఆర్పీలు, నలుగురైదుగురు సీవోలు ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు ఆర్పీలు విచారణ జరుగుతుందని తెలియడంతో పొదుపు సభ్యులను బతిమలాడుకునే పనిలో ఉండగా, మరి కొందరు ఆ స్కాంలో తాను లేనని, తనను అనుమానించవద్దంటూ గ్రూపు సభ్యులకు మెసేజ్‌లు పెట్టడం విశేషం. అయితే కుంభకోణంలో కొందరు సీవోల భాగస్వామ్యం కూడా ఉందని, ఈ వ్యవహారమంతా వారికి తెలిసే జరిగిందని, ఇందులో వారి సంతకాలు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఇటీవల ఓ ఆర్పీ తనపై అధికారిగా ఉన్న సీవోకు కొత్త స్కూటీని కొనుగోలు చేసి బహుమతిగా ఇచ్చినట్లు సమాచారం. మొత్తంగా మెప్మాలో కొనసాగుతున్న విచారణతో అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

వెల్లంపల్లిలో గుర్తు తెలియని మృతదేహం




మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది

మద్దిపాడు, ఫిబ్రవరి 9: మద్దిపాడు మండలం వెల్లంపల్లిలోని గుండ్లకమ్మ వెంతన కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం వెలుగుచూసింది. స్థానిక ప్రజలు మృతదేహాన్ని గుర్తించి ఎస్సై శ్రీకాంత్‌కు సమాచారాన్ని అందజేశారు. దీంతో ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతుడి వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, హత్యా లేక ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలి

- ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మొక్కను నాటుతున్న హేమచంద్రారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9: పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని ఏపీ విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైన మూడు రోజుల జాతీయస్థాయి సెమినార్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఆయన మొక్కలు నాటారు. అనంతరం యూనివర్శిటీలో వీసీ మారెడ్డి అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఓజోన్ పొర దెబ్బతింటున్న నేపథ్యంలో మానవాళి మనుగడకు ఇబ్బందికరంగా మారిందని, ఈ పరిస్థితులను అధికమించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమోహన్, నిర్మలామణి, పాలకమండలి సభ్యులు కళ్యాణి, కొనిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కేవీఎస్.రాజు తదితరులు నాల్గొన్నారు.

14న నాగులుప్పలపాడు మండల సమావేశం

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి9: నాగులుప్పలపాడు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో మహాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షత వహిస్తారన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీ, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

జాషువా సేవలు అనిర్వచనీయం

- మంత్రులు నాగార్జున, సురేష్



జాషువా విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు నాగార్జున, సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 9: దళిత జాతి అభ్యున్నతి కోసం గుర్రం జాషువా చేసిన సేవలు అనిర్వచనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాకవి గుర్రం జాషువా కాంస్య విగ్రహాన్ని వారు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. దళితులు అభ్యున్నతి చెందినపుడే జాషువా ఆశయసాధన సాధ్యమవుతుందని, అందుకోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు. జిల్లాలో దళితులకు ఉద్దేశించిన పథకాలు బాగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి ఎండ్లూరి రవికుమార్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె.కనకారావు, లిడ్‌క్యాప్ చైర్మన్ కె.రాజశేఖర్, పాటిబండ్ల ఆనందరావు, జాషువా మనుమరాలు యామిని, డీవీఎంసీ సభ్యులు, జాషువా విగ్రహ కమిటీ కార్యవర్గం, వివిధ దళిత, గిరిజన సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సాహిత్యరంగంలో విశేష కృషి చేసిన శ్రీరామకవచం సాగర్, డాక్టర్ ఎజ్రాశాస్త్రి, డాక్టర్ నూకతోటి రవికుమార్, సింహాద్రి జ్యోతిర్మయిలను ఘనంగా సన్మానించారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



ఆల్బెండజోల్ టాబ్లెట్‌ను విద్యార్థితో మింగిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9 : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపైనా శ్రద్ధవహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలోని పిల్లలకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చేతిగోళ్ళను చిన్నగా శుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పుడు శుభ్రమైన నీరు తాగడం, కూరగాయాలు, పళ్ళను శుభ్రమైన నీటితో కటగడం వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. 19ఏళ్ళలోపు 5,96,751 మంది పిల్లలు జిల్లాలో ఉండగా, అంగన్‌వాడీలు, పాఠశాలలు, కాలేజీల్లోని పిల్లలతో పాటు ఇతరులకు వీటిని పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ రోజు మాత్రలు పొందలేని వారి కోసం ఈనెల 16తేదీన ప్రత్యేక యాప్-ఆప్ కార్యక్రమం చేపట్టి ట్యాబ్లెట్లను పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, డీఐవో పద్మజ, డీఈవో సుభద్ర, నోడల్ అధికారి భగీరథదేవి, డీసీఎం వాణిశ్రీ, ప్రిన్సిపాల్ రామిరెడ్డి, సీడీపీవో రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: నులి పురుగుల నివారణ ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని డాక్టర్ ఆనంద్ మోహన్ పేర్కొన్నారు. మద్దిపాడులోని కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. అనంతరం డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ టాబ్లెట్‌ను తప్పకుండా మింగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వీ.సుబ్బారావు, కె.బాలకోటయ్య, సుభాషిని, సీతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



మద్దిపాడులో విద్యార్థినితో మాత్రను మింగిస్తున్న వైద్య సిబ్బంది

పీవీకి భారతరత్న ప్రకటన అభినందనీయం



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమితి కార్యవర్గ సభ్యులుత

ఒంగోలు(కల్చరల్),ఫిబ్రవరి 9: దివంగత మాజీ ప్రధాని పీవీ.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం భారతరత్న బిరుదును ప్రకటించటం పట్ల పలు సంఘాల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న బ్రాహ్మణ సేవాసమితి భవనంలో సమితి కార్యవర్గ సభ్యులు పీవీ.నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమితి అధ్యక్షుడు సీవీఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి అపర చాణుక్యునిగా పేరు సాధించి ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తెచ్చిన ఘనత పీవీ.నరసింహారావుదని, అటువంటి వ్యక్తికి భారతరత్న ప్రకటించటం ఎంతో ఆనందదాయకమని చెప్పారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి వెంకటశేషయ్య, కార్యదర్శి గంజాం శ్రీరంగనాథ్, సముద్రాల భీమశంకర శాస్త్రి, పింగళి పూర్ణచంద్రరావు, మద్దులూరి హరిప్రేమ్‌నాథ్, ఫైనంపాటి సాయికుమార్, ముక్తినూతలపాటి వాసు తదితరులు పాల్గొన్నారు.

అలాగే పీవీకి భారతరత్న ప్రకటించటంపై తెలుగుదేశం బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు టీవీ.శ్రీరామమూర్తి, పొన్నలూరి శ్రీనివాస ఫణి, కామరాజుగడ్డ కుసుమకుమారి, ఎస్ఏటీ.రాజేష్, ఆర్ఎస్.శాస్త్రి, పొన్నలూరి కిరణ్‌కుమార్, మల్లిఖార్జునశర్మలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఒంగోలులో పీవీ.నరసింహారావు విగ్రహ ఏర్పాటుకు కృషిచేస్తామని చెప్పారు.

బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామరాజు మల్లిఖార్జునరావు ఒక ప్రకటనలో పీవీ.నరసింహారావుకు భారతరత్న ప్రకటించటం యావత్ తెలుగుజాతికి, అదేవిధంగా బ్రాహ్మణులకు దక్కిన గౌరవమని అభివర్ణించారు. ఇంకా శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్‌బాబు, అన్నమయ్య సేవా సమితి అధ్యక్షుడు ఇనమనమెళ్లూరి మురళీకృష్ణ, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు పొన్నూరి వేంకటశ్రీనివాసులు తదితరులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

వారంలో ధాన్యం స్టాక్ వివరాలను వెల్లడించాలి

- డీఎస్‌వో ఉదయభాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వో ఉదయభాస్కర్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని బియ్యం ట్రేడర్స్, హోల్‌సెల్లర్స్, రిటైలర్స్, మిల్లర్లు తమ దగ్గర ఉన్న ధాన్యం, బియ్యం స్టాక్ వివరాలను నిర్దేశిత పోర్టల్‌లో వారం రోజుల్లో నమోదు చేయాలని డీఎస్‌వో ఉదయభాస్కర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం సంబంధిత ట్రేడర్ల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం, ధాన్యం నిల్వల స్థితిని బ్రోకెన్ రైస్, నాన్ బాస్మతి బియ్యం, పారా బాయిల్డ్ బియ్యం, బాస్మతి రైస్, ధాన్యం వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయని పక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలపై అవగాహన పెంపొందించుకొని బియ్యం వ్యాపారులు అమ్మకం, నిల్వలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్టాక్ నమోదు లేనిపక్షంలో చర్యలు ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో క్షేత్ర స్థాయిలో విస్తృతంగా తనిఖీలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సహాయ పౌరసరఫరాల అధికారి పి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



పరీక్షల సామగ్రి అందజేసి మహబూబ్‌జాన్

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 9: పదో తరగతి విద్యార్థులు ఒక ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రకాశం జిల్లా ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్‌జాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సెయింట్ థెరస్సా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన పెన్నులు, అట్టలు, జామెంట్రీ బాక్స్ మొదలైన సామగ్రిని సంఘం తరపున పంపిణీ చేశారు. టెన్త్‌లో 500 మార్కులకు మించి సాధించిన ప్రతి విద్యార్థికి రూ.1116 పారితోషికాన్ని అందజేస్తానని ప్రకటించారు. ప్రధానోపాధ్యాయులు దొంతు ఆనందరావు, హుమయూన్‌బాషా, ప్రరసం అధ్యక్షులు పొన్నూరి వేంకటశ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

చీమకుర్తి, ఫిబ్రవరి 9: ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగపరచుకోవాలని మంత్రి మేరుగ నాగార్జున, జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చీమకుర్తిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన మంత్రి నాగార్జున, చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావుల చేతుల మీదుగా మహిళలకు చెక్కులను పంపిణీ చేసి ప్రసంగించారు. అనంతరం మెప్మా మహిళలు ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్లు యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, చైర్మన్ రాజ్యలక్ష్మి, పీడీ రవికుమార్, పమిడి వెంకటేశ్వర్లు, క్రిస్టిపాటి శేఖరరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ ష్యూరిటీ పత్రాలు దాఖలు చేసిన వారిపై కేసు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 9: కోర్టులో నకిలీ ష్యూరిటీ పత్రాలు దాఖలు చేసిన వారు 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ శుక్రవారం రాత్రి తెలిపారు. తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నాలుగు కేసుల్లో నిందుతుల బెయిల్ కోసం 8మంది నకిలీ పత్రాలు కోర్టులో దాఖలు చేసినట్లు గుర్తించారు. ఈమేరకు కోర్టు నుంచి వచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇలా నకిలీ పత్రాలు దాఖలు చేసినవారంతా గుంటూరు జిల్లా వారు కావడం గమనార్హం.

ఏపీ జేఏసీ అమరావతి జిల్లా మహిళా కార్యవర్గం



కలెక్టర్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9 : ఏపీ జేఏసీ అమరావతి జిల్లా మహిళా నూతన కార్యవరాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్ ఆర్‌వీఎస్.కృష్ణమోహన్, సెక్రటరీ కె.వెంకటేశ్వరరెడ్డి, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకొలు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో ఈ కమిటీ ఎన్నిక జరిగింది. కాగా జిల్లా చైర్‌పర్సన్‌గా ఎన్.విజయలక్ష్మి, అసోసియేట్ చైర్‌పర్సన్‌గా పి.ఉమాదేవి, కో చైర్‌పర్సన్స్‌గా ఎస్‌కే.అన్వర్‌జాన్, ఎస్‌కే.కరీమున్‌నిషాబేగం, వి.శివకుమారి, బి.రజిని, జనరల్ సెక్రటరీలుగా సీహెచ్.శ్రీదేవి, ఎస్‌కే.సాబిరూన్, ఎస్.రమాదేవి, టి.రాధ, ఎం.తిరుపతమ్మ, కోశాధికారిగా శాంతిప్రియలను ఎన్నుకున్నారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువతో సత్కరించారు. నూతన కార్యవర్గ సభ్యులను కలెక్టర్‌కు జిల్లా చైర్మన్ కృష్ణమోహన్ పరిచయం చేశారు.

అవీ..ఇవీ..

ఆదర్శనీయుల ఆశయాలను నెరవేర్చాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9: ఆదర్శనీయుల ఆశయాలను కొనసాగించడం ద్వారానే వారికి తగిన గౌరవం లభిస్తుందని, కేవలం ఉత్తమ పురస్కారాల పేరుతో బిరుదులు ఇవ్వడం ద్వారా ఒరిగేదేవి లేదని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాలు మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్, మాజీ ప్రధాని పీవీ.నరసింహారావులకు ఇవ్వడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. అయితే అదేస్థాయిలో వారి ఆశయాలను ప్రభుత్వాలు అమలు చేయడం ద్వారానే వారికి ప్రజల్లో తగిన గుర్తింపు గౌరవం దక్కుతుందన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో చట్టబద్ధత చేయాలని, అప్పుడే మహనీయులకు తగిన గౌరవం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు

కారుమంచిలో అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న జానకిరామ్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 9: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కారుమంచి గ్రామంలో ఎపికల్చర్, సెరికల్చర్ అనే అంశంపై నిరుద్యోగ యువతకు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా వీఐసీ ఇన్నోవేషన్ అంబాసిడర్ ఎం.జానకిరామ్ పరిశ్రమలు, వాటి ఆవశ్యకత, నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ ఎం.మల్లికార్జునరావు ఎపికల్చర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ఆర్.వీరాంజనేయులు, ఏవీ.రమణబాబు పాల్గొన్నారు.

విద్యాశాఖకు మంచిపేరు తేవాలి : డీఈవో

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 9: విద్యాశాఖ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాలో మంచి పేరు తేవాలని డీఈవో డి.సుభద్ర కోరారు. ఒంగోలులోని స్పందనహాలులో శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయ, సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయాల్లోని పనితీరును పరిశీలించారు. సిబ్బందిని పేరుపేరున పిలిచి వారి పనితీరును సమీక్షించారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే ప్రతి అర్జీని 24 గంటల్లో సంబంధిత గుమస్తాకు చేరాలన్నారు. కోర్టు కేసులపై వెంటన కౌంటర్లు వేయాలని, పెండింగ్ పెట్టడం తగదన్నారు. నెలాఖరులోపు కార్యాలయాల సిబ్బంది అందరూ కచ్చితంగా పర్సనల్ రిజిస్టర్‌ను నిర్వహించాలని చెప్పారు. సమగ్ర శిక్షలో సెక్టోరల్ అధికారి వారీగా పనిచేసే కార్యక్రమాలను సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. 3.60 లక్షల మంది విద్యార్థుల యూడైస్ పూర్తి చేసినందుకు సమగ్ర శిక్ష ఏఎస్‌ఓ అంజిరెడ్డిని అభినందించారు. నాడు-నేడు పనులను సత్వరమే పూర్తి చేయాలని డీఈవో ఆదేశించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ, జడ్పీటీసీ

సంతనూతలపాడు, ఫిబ్రవరి 9: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదవర్గానికి భరోసా కలుగుతుందని ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం సంతనూతలపాడు జడ్పీ హైస్కూలులో జగనన్నఆరోగ్యసురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం డాక్టర్ పమిడి హరిణి శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.నాగమణి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

సంతనూతలపాడు, ఫిబ్రవరి 9: సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన సర్వసభ్యసమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీవో ఎం.శ్రీహరి తెలిపారు. ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే సమావేశానికి హాజరవడంతో సమావేశం వాయిదా పడింది. సమావేశం ఎప్పుడు జరుగుతుందో త్వరలో తెలియస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, ఇద్దరు ఎంపీటీసీలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఒంగోలులో టీడీపీ బీసీ భరోసా బాట

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 9 : ఒంగోలులోని తెలుగుదేశ పార్టీ కార్యాలయంలో ఈనెల 11వ తేదీన టీడీపీ బీసీ భరోసా బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సాధికార సమితి నాయకులు కోరారు. శుక్రవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు హయాంలోనే బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీసీల భవిష్యత్ బాగుండాలంటే టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా బీసీ భరోసా బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పొదిలి శ్రీనివాసరావు, భీమవరపు యలమంద, పాదర్తి సుజాత, పూర్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో శ్రవణా నక్షత్ర పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 9: ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి ఆస్థానం నిర్వహించి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ, ఆధాత్మిక సంకీర్తనల ఆలాపన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదిత్య హోమం, శ్రీవారికి సూర్యప్రభవాహన సేవ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలారామారావు, ధర్మకర్తలు వేంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాటిమీదపాలెంలో పంటకోత ప్రయోగం



ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చీమకుర్తి, ఫిబ్రవరి 9: చీమకుర్తి మండలం పాటిమీదపాలెంలో శుక్రవారం వ్యవసాయశాఖాధికారులు పంటకోత ప్రయోగంను నిర్వహించారు. సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంపై అధికారులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో వెంకటశేషమ్మ, భాస్కర్, శృతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం : టీడీపీ

మద్దిపాడు, ఫిబ్రవరి 9: వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు విమర్శించారు. శుక్రవారం మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లిలో నిర్వహించిన మన ఊరు-మన తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికలలో అందరినీ కలుపుకుని పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తు కు గ్యారంటీపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థినులకు అభినందన



బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం బ్రహ్మయ్య

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 9: ఒంగోలులోని పీవీఆర్ హైస్కూల్లో జరుగుతున్న బాలోత్సవాల్లో త్రోవగుంట జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు పాల్గొన్నట్లు హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థినులు బాలోత్సవాల్లో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారని చెప్పారు. అనంతరం వారిని అభినందించారు.

రైలు కింద పడి యువతి ఆత్మహత్య

సింగరాయకొండ, ఫిబ్రవరి 9 : రైలు కింద పడి యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడుకు చెందిన పోకూరి కుసుమ (31) శుక్రవారం సింగరాయకొండ వచ్చారు. నేరుగా రైల్వే స్టేషన్‌కు చేరుకొని ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై ప్రయాణికులతో కలిసి ఉన్నారు. కావలి వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే గూడ్స్ రైలు వస్తుండగా పట్టాలపైకి ఒక్క ఉదుటన దూకారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆర్పీఎఫ్ ఏఎస్సై, జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ మురళి, కానిస్టేబుల్ శ్రీను సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం శవపరీక్ష నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

గోపాలపురంలో పట్టపగలే చోరీ

అద్దంకి, ఫిబ్రవరి 9 : పట్టపగలే తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గోపాలపురంలో యర్రా కోటేశ్వరరావు కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న సుమారు 8 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణకు గురయ్యాయి. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

మృతదేహానికి పోస్టుమార్టం

మార్టూరు, ఫిబ్రవరి 9 : మండలంలోని బొల్లాపల్లి బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన ఎస్కే నాగూర్‌వలి మృతదేహానికి శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని బాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అతని స్వగ్రామమైన జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి పంపించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చోరీకి యత్నం

పర్చూరు, ఫిబ్రవరి 9 : పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో చోరీ యత్నానికి ప్రయత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన దొడ్డా మహేష్ దంపతులు ఆరు నెలల క్రితం అమెరికాలో ఉంటున్న కుమారుల వద్దకు వెళ్లారు. ఇంటి తాళాలను చీరాలలో ఉంటున్న తమ అత్తమామలకు అప్పగించటంతో నెలకు ఒకటి రెండు రోజులు అన్నంబొట్లవారిపాలెం వచ్చి ఇంటిని పరిశీలించి వెళుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో మహేష్ ఇంటి తలుపులు తెరచి ఉండటంతో అనుమానం వచ్చి సమీప నివాసం వారు బంధువులకు సమాచారం అందించారు. వారువచ్చి చూడగా ఇంటి తలుపులు పగులకొట్టి, సామనులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎలాంటి విలువైన వస్తువులు దొంగలు ఎత్తుకెళ్లకపోవడంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

'ఎమర్జెన్సీ రన్‌వే'ను పరిశీలించిన అధికారులు

మేదరమెట్ల , ఫిబ్రవరి 9 : కొరిశపాడు నుంచి జె.పంగులూరు మండలం రేణంగివరం వరకు విమానాలు అత్యవసరంగా దిగేందుకు జాతీయ రహదారిపై ఎమర్జెన్సీ రన్‌వేను నిర్మించారు. కొరిశపాడు సమీపంలో ఎయిర్‌ఫోర్స్ కార్యాలయాన్ని నిర్మించేందుకు గతంలో కొంత స్థలాన్ని సేకరించారు. ఆ ప్రదేశాన్ని ఎయిర్‌ఫోర్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. త్వరలో నూతన కార్యాలయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎయిర్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. రన్‌వే సమీప గ్రామాలల్లోని స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుశీల, మండల సర్వేయర్ మహేష్‌బాబు, వీఆర్‌వో నారాయణ, ఎయిర్‌ఫోర్స్ నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.


టంగుటూరు వేలం కేంద్రంలో 12 క్లస్టర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

టంగుటూరు, ఫిబ్రవరి 9 : టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రం పరిధిలో 12 క్లస్టర్‌లను నిర్ణయించారు. త్వరలో వేలం ప్రారంభంకానున్న నేపథ్యంలో తేదీ ఖరారు, క్లస్టర్లను తేల్చేందుకు శుక్రవారం స్థానిక వేలం కేంద్రం ఆవరణలో సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేలం కేంద్రం పరిధిలోని పొగాకు రైతులు హాజరయ్యారు. ఈసందర్భంగా లాటరీ పద్ధతిలో క్లస్టర్‌లను నిర్ణయించారు. అనంతరం వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అనధికారికంగా పొగాకు కొనుగోలు, అమ్మకాలు చేయ కూడదన్నారు. పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోల్డ్ స్టోరేజీలో పొగాకు బేళ్లు నిల్వ చేసుకోవాలన్నా, బయటకు తీయాలన్నా విధిగా బోర్డు అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పొగాకు రైతులు, రైతు నాయకులు, ఫ్లోర్ కమిటీ సభ్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పక్కన ఏపీవో, ఈసీ

టంగుటూరు, ఫిబ్రవరి 9 : ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం ఆయన కొణిజేడు, కందులూరు, వల్లూరు, సూరారెడ్డిపాలెం, కాకుటూరిపాలెంలలో పర్యటించారు. అన్ని గ్రామాల్లోనూ కూలీలతో సమావేశమయ్యారు. ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలి రూ.272 వరకూ లభిస్తుందని తెలిపారు. ప్రస్తుతం పొగాకు పనులు జోరుగా సాగుతున్నాయని, మరో నెల వరకూ ఇవే పనులుంటాయన్న కూలీలు ఆతర్వాత ఉపాధి పనులకు వస్తామని చెప్పారు. పొగాకు పనికి వెళ్లని వారు ఉపాధి పనులకు రావాలని ఎంపీడీవో కోరారు. ఏపీవో సుభాషిణి, ఈసీ దివి కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, క్షేత్ర సిబ్బంది ఉన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీల అభ్యున్నతి

కొండపి ఎమ్మెల్యే స్వామి

పొన్నలూరులో జయహో బీసీ సదస్సు... భారీ ర్యాలీ

పొన్నలూరు (కొండపి), ఫిబ్రవరి 9 : టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలు అన్ని విధాలా అభివృద్ధి చెందారని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. వారి సంక్షేమానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేశారని చెప్పారు. పొన్నలూరులోని బొమ్మల సెంటర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన జయహో బీసీ సభలో స్వామి పాల్గొని మాట్లాడారు. బీసీలకు రాజకీయంగా పదవులిచ్చి వారి ఎదుగుదలకు టీడీపీ తోడ్పాటునందించిందన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన ఒరవడిని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారన్నారు. బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి పార్టీ కృషి చేసిందన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ పార్టీ బీసీల రక్షణకు చట్టం తీసుకువస్తుందన్నారు. ఆమేరకు చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. బీసీలకు రుణాలు, పనిముట్లు అందించడంతో పాటు వారిని ఆర్థికంగా పైకి తీసుకువచ్చిన పార్టీ టీడీపీయేనన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు మాట్లాడుతూ బీసీలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈప్రభుత్వంలో బీసీలపై దాడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి, బీసీసెల్ మండల అధ్యక్షుడు కుర్రా మాల్యాద్రి, పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు మండవప్రసాద్, కర్నా కోటిరెడ్డి, పిల్లి వెంకటనారాయణరెడ్డి, ఆముదాలపల్లి గంగాధర్ పాల్గొన్నారు. తొలుత పొన్నలూరులో భారీ ర్యాలీ నిర్వహించారు.



బొమ్మల సెంటర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి, సత్య నాయకులు

తెలుగుదేశంలోకి జోరుగా వలసలు

వైసీపీని వీడిన 55 కుటుంబాలు

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీలో చేరిక

శానంపూడి ఎస్సీ కాలనీలో అధికార పార్టీకి ఎదురుదెబ్బ

సింగరాయకొండ, జనవరి 31 : మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం జోరుగా సాగుతోంది. నెల నుంచి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం శానంపూడి ఎస్సీ కాలనీ అయిన అరుంధతి నగర్‌లో వైసీపీకు చెందిన 30కుటుంబాలు, మిట్టమీద ఎస్సీ కాలనీకు చెందిన 15 కుటుంబాలు, సోమరాజుపల్లి పంచాయతీ పరిధి టీపీనగర్‌కు చెందిన 10 కుటుంబాలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే స్వామి గృహానికి వెళ్లి ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. వారికి స్వామి పార్టీకండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలనలో తట్టెడు మట్టి కూడా పోయలేదన్నారు. ఈ ఐదేళ్లలో దళితులపై హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల బనాయింపు కోకొల్లలుగా జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను జగన్‌రెడ్డి దారిమళ్లించి దళితులను పాతాళానికి తొక్కేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌ను సైతం నిర్వీర్యం చేసి దళితులను దగా చేసిన మోసకారి జగన్ అని మండిపడ్డారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. పార్టీలో చేరిన వారిలో శానంపూడి పంచాయతీ 8 వార్డు సభ్యుడు రావినూతల ప్రసాద్, ఆపార్టీ కార్యకర్తలు రావినూతల చినకొండయ్య, తగరం మోషె, గురిజాల తిరుపాలు, జైపాల్, కట్టా రాములు, సాపాటి సతీష్, మన్నం కర్ణ, కుమార్, భాస్కర్ బుర్రి సురేష్, పొనుగోటి పవన్, నవీన్, టీపీ నగర్‌కు చెందిన జగన్నాథం శివ, వినోద్‌కుమార్, బల్లికురవ హరిబాబు, బొడ్డు చంద్ర తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పొనుగోటి కొండయ్య, పులవర్తి లక్ష్మీనారాయణ, కాకు రాంబాబు, శీలం చంటి పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి



గత ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య

పొన్నలూరు (కొండపి), ఫిబ్రవరి 9 : గ్రామాల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు టీడీపీకే ఉందన్నారు. మన గ్రామానికి మన సత్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మేకపాడు, ఓరుగంటివారిపాలెం, కోటపాడు, బాలిరెడ్డిపాలెం, కల్లూరివారిపాలెం, చెన్నిపాడు, మంగినంపాడు, ఎదురువారిపాలెం, చెరుకూరు, పెరికపాలెం, పైరెడ్డిపాలెం, లింగోరుగుంట, నాగిరెడ్డిపాలెం, పొన్నలూరుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సత్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు అనేక కార్యక్రమాలు అమలు చేశారన్నారు. తన తాత దామచర్ల ఆంజనేయులు మంత్రిగా ఉన్నపుడు మండలంలోని మారుమూల గ్రామాలకు సైతం లింకురోడ్లు వేశారన్నారు. తర్వాత తిరిగి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఎమ్మెల్యేగా గ్రామాలకు తారురోడ్లు వేశారన్నారు. మళ్లీ స్వామిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, మండవ ప్రసాద్, కర్నా కోటిరెడ్డి పాల్గొన్నారు.

మూడేళ్లలో 19 మంది పంచాయతీ కార్యదర్శులు

కాకుటూరివారిపాలెంలో పదేపదే మార్పు

టీడీపీకి చెందిన సర్పంచ్‌ను అడ్డుకోవడమే ప్రధాన ఉద్దేశం

వైసీపీ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు

కాకుటూరివారిపాలెం (టంగుటూరు), ఫిబ్రవరి 9 : అధికార దుర్వినియోగం, వైసీపీ నాయకుల కక్ష సాధింపు చర్యలకు పరాకాష్టగా మండలంలోని కాకుటూరివారిపాలెం నిలుస్తోంది. టీడీపీకి చెందిన సర్పంచ్‌ను అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా అధికార పార్టీ నేతలు ముందుకు సాగుతున్నారు. కీలకమైన పంచాయతీ కార్యదర్శులను పదేపదే మారుస్తున్నారు. మూడేళ్లలో గ్రామంలో 19 మంది పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగింది. వీరిలో ఇద్దరు మినహా అంతా ఇన్‌చార్జిలే కావడం గమనార్హం. 19వ పంచాయతీ కార్యదర్శిని సైతం తప్పించి తాము సూచించిన వ్యక్తికే బాధ్యతలు అప్పగించాలని పట్టుబట్టారు. వారికి వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి సురేష్ కూడా వత్తాసు పలికారు. ఒత్తిళ్లకు తలొగ్గిన ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శి స్థానంలో మరొకరి పేరు సూచిస్తూ డీపీవోకు లేఖ రాసినట్లు తెలిసింది. కాకుటూరివారిపాలెం సర్పంచ్‌గా టీడీపీకి చెందిన కొమ్మినేని రమణమ్మ బాధ్యతలు చేపట్టి శుక్రవారం నాటికి కచ్చితంగా మూడేళ్లు అయింది. అయితే ఆమెకు చెక్ పవర్ ఇచ్చేందుకు అధికారులు నాలుగు నెలల సమయం తీసుకున్నారు. దీంతో రమణమ్మ పదవీకాలం 2 ఏళ్ల 8నెలలనే సర్పంచ్‌లంతా భావిస్తుంటారు. ఈస్వల్ప కాలంలోనే 19 మంది పంచాయతీ కార్యదర్శులను మార్చారు. ఒక కార్యదర్శి రావడం.. అధికార పార్టీ వారు తాము సూచించిన పనులు చేసి, సర్పంచ్ పనులు నిలిపివేయాలని అతనిపై ఒత్తిడి తీసుకురావడం, అతను వినకపోవడం.. వెంటనే మార్చివేయడం ఈ మూడేళ్లుగా కొనసాగుతూనే ఉంది. 19వ పంచాయతీ కార్యదర్శిగా సూరారెడ్డిపాలెంలో పనిచేస్తున్న జాన్‌బాషాకు ఇటీవల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఆయన్ను తొలగించి ఆస్థానంలో ఆలకూరపాడు పంచాయతీ కార్యదర్శి సాంబయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. అయితే గ్రామాభివృద్ధికి సంపూర్ణ సహకారం ఇస్తున్న జాన్‌బాషానే కొనసాగించాలని ప్రజలందరూ కోరుతున్నారు.

సీహెచ్‌సీలో అదనపు గదులు ప్రారంభం



అదనపు గదులను ప్రారంభిస్తున్న మంత్రి సురేష్, డీసీహెచ్ఎస్ మూర్తి

కొండపి, ఫిబ్రవరి 9 : కొండపి సీహెచ్‌సీలో దాదాపు రూ.1.30 కోట్లతో నిర్మించిన 10 అదనపు గదులను రాష్ట్రమంత్రి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్, డీసీహెచ్ఎస్ మూర్తి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కొండపి జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణకుమారి, సీహెచ్‌సీ వైద్యులు ఎస్.వరలక్ష్మి, ఫైరోజ్, నిఖిల్‌దీప్, కీర్తి, పరిమళ, ఎం.మహతికుమార్ రాజు, హెడ్ నర్సు వేదవాణి, వైసీపీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగయ్య, నాయకులు ఢాకా పిచ్చిరెడ్డి, గొట్టిపాటి మురళి పాల్గొన్నారు.

మహీధర్ రిటర్న్ గిఫ్ట్

ఆగిపోయిన పోర్టు పనులు

నిన్న నిర్వాసితులతో కలిసి ధర్నా..

సోమవారం నుంచి దీక్షలకు నిర్ణయం

వైసీపీ అధిష్ఠానంలో కలకలం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కొన్ని గంటల వ్యవధిలోనే రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వటం లేదని చెప్పిన వెంటనే ఆయన ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరుకు దిగారు. అంతేకాక ఎంపీ విజయసాయిరెడ్డి సమీప బంధువుల సంస్థ చేస్తున్న పోర్టు పనులను అడ్డుకున్నారు. అంతటితో ఆగక ప్రజల పక్షాన సోమవారం నుంచి దీక్షలు చేస్తానని కూడా ప్రకటించారు. దీంతో యావత్తు యంత్రాంగం హడలిపోగా ఆ పార్టీ అధిష్ఠానంలో కలకలం మొదలైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు ఎమ్మెల్యేగా ఉన్న మహీధర్‌రెడ్డిని తప్పించి తిరుపతి జిల్లాకు చెందిన బీసీ మహిళకు అవకాశం ఇచ్చారు. గురువారం మధ్యాహ్నం ఆ విషయం సీఎం చెప్పగా సాయంత్రం ఆరు గంటలకల్లా నియోజకవర్గంలోని రామాయపట్నం వద్ద జరుగుతున్న పోర్టు నిర్మాణ పనుల వద్దకు మహీధర్‌రెడ్డి చేరారు. అక్కడ నిర్వాసిత గ్రామాల ప్రజల ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అంతేకాక పోర్టు నిర్మాణ పనులు నిర్వహిస్తున్న అరబిందో ఇన్‌ఫ్రా ప్రతినిధులను బయటకు పంపి కార్యాలయానికి తాళాలు వేయించారు. తిరిగి శుక్రవారం సాయంత్రం ఆయన అక్కడకు వెళ్లగా చాటుమాటుగా పనులు నిర్వహిస్తున్నారని స్థానికులు చెప్పారు. 'సముద్రం లోపల పనులు చేస్తున్న వారికి ఆహార పానీయాలు అందకుండా అడ్డుకుంటే వాళ్లే తిరిగి వస్తారు. రేపు ఆ పని చేయండి మీకు ఎవరైనా ఇబ్బంది కల్గిస్తే నేనున్నా' అంటూ ఆందోళన చేస్తున్న నిర్వాసిత గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. అంతేకాక ఆందోళన తీవ్రతలో భాగంగా అనుకున్న ప్రకారం నిరాహార దీక్షలు ప్రారంభించాలని సూచించారు. సమస్యను పరిష్కరించకపోతే సోమవారం తాను దీక్షలో కూర్చుని మద్దతు ఇస్తానని వెల్లడించారు. దీంతో అక్కడ ప్రజలు చేస్తున్న ఆందోళనకు బలం పెరగ్గా పోర్టు నిర్మాణ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. నిర్వాసిత గ్రామాల్లో కర్లపాలెం గ్రామస్థుల నివాసాలకు ప్రత్యామ్నాయ స్థల సేకరణ జరగకపోగా వారికిచ్చే నష్టపరిహారం అంచనా వేయలేదు. ఇతర గ్రామాల్లోను కొన్ని సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలపై స్థానికులు అనేక సందర్భాల్లో తమ నిరసన వ్యక్తం చేశారు. కర్లపాలెం గ్రామస్థులు అయితే గత నాలుగు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. వారి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేగా మహీధర్‌రెడ్డి ప్రయత్నించారే తప్పా బహిరంగంగా ఏనాడు ఆందోళనకు మద్దతు ఇవ్వలేదు. గురువారం సీఎం జగన్‌టికెట్ లేదని చెప్పటం ఆ తర్వాత కొన్నిగంటలకే పోర్టు నిర్వాసితుల ఆందోళనలో పాల్గొని సీరియస్‌గా వ్యవహారం నడపటం విశేషం. అందుకే సీఎంకి ఈ రూపంలో వెంటనే రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారంటూ రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా మహీధర్‌రెడ్డి వ్యవహారం వైసీపీ అధినాయకులో కలకలం సృష్టిస్తోంది. ఒకవైపు ఉమ్మడి జిల్లాలోని అద్దంకిలో జగన్ నిర్ణయించిన ఇన్‌చార్జి హనిమిరెడ్డితో కలిసి తిరగలేదనే సాకుతో మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య క్వారీని తనిఖీల పేరుతో మూసివేయించారు. ఇటుచూస్తే మహీధర్‌రెడ్డిపై పనులు అడ్డగించారనే పేరుతో కేసులు నమోదు చేయవచ్చనే ప్రచారం ఉంది. కాగా ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత జగన్ రియాక్షన్ ఎలా ఉంటుందనే అంశం చర్చనీయాంశమైంది.

సామాజిక స్పృహతో సేవలు అందించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 9: గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది సామాజిక స్పృహతో సేవలు అందించాలని కలెక్టర్ రంజిత్‌బాషా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామదర్శిని కార్యక్రమాన్ని జిల్లా పరిధిలోని 70 గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కలెక్టర్ చీరాల మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో ఆయన విస్తృత పర్యటన చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గ్రామీణ ఆరోగ్యకేంద్రం, రైతు భరోసా కేంద్రం, జగనన్న కాలనీ, గ్రామ సచివాలయాలను పరిశీలించారు. విద్య, వైద్యం, స్థిర నివాసం, తాగునీరు వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామంలో అర్థంతరంగా నిలిచిన తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో వంట గది లేకపోవడంతో బయట ఏజెన్సీల నుంచి విద్యార్థులకు ఆహారం తీసుకురావడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి, ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చిరంజీవిలకు చార్జ్ మెమోలు ఇవ్వాలని ఎంఈవో సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. సచివాలయంలో కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వో రాజేష్‌కు చార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు. ముగ్గురు సచివాలయ సిబ్బంది సెలవుపై ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాల సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యకేంద్రంలో ఏడాదిన్నరగా ఆరోగ్య కార్యకర్త లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, తదితరులు ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా



జయహో బీసీ సభలో ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న బీసీ నేతలు

టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం

- ఆ పార్టీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు
- పుల్లలచెరువులో 'జయహో బీసీ' సభ

పుల్లలచెరువు, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసి బీసీలకు రాజ్యాధికారం కల్పించిన పార్టీ టీడీపీ అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక పుల్లలచెరువులో బీసీలతో సమావేశం నిర్వహించారు. ముందుగా నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., రాష్టంలోని బీసీలు వైసీపీ పాలనలో అణచివేతకు గురయ్యారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు లోన్లు, సంక్షేమ పథకాలు అందించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ పరిరక్షణ చట్టం అమలులోకి తెస్తామని అన్నారు. వైసీపీ చేస్తున్న అక్రమలపై టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో మంత్రి వున్న నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా వున్నాయని టీడీపీ అధికారంలో వున్నప్పుడు వేసిన రోడ్లు తప్ప ఎక్కడ కొత్త రోడ్లు లేవని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు శనగా నారాయణ రెడ్డి, కాకర్ల కోటయ్య, గజ్జెల్లి భాస్కర్, మేడికొండ లక్ష్మినారాయణ, కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పెద్దారవీడు మండలం రేగుమానిపల్లి గ్రామంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం శుక్రవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మినిమేనిఫెస్టోలోని హామీలను వివరించారు. ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటువేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దారవీడు మండల టీడీపీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, గుమ్మ గంగరాజు, జెడ్డా రవి, గ్రామ జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : రాష్ట్రంలో దురాగతాల ప్రభుత్వం త్వరలోనే అంతం అవుతుందని టీడీపీ నాయకుడు, కందుల నారాయణ రెడ్డి కుమారుడు విఘ్నేష్ రెడ్డి అన్నారు. మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. నలభై సంవత్సరాలు చంద్రబాబు నాయుడు విలువలతో కూడిన రాజకీయం చేశారన్నారు. ఆయన్ను అక్రమంగా కేసులో ఇరికించి ఇబ్బంది పెట్టిన ఈ ప్రభుత్వం త్వరలోనే అంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజుల రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కాకార్ల శ్రీనివాసులు, దూదేకుల మస్తాన్, జంకె రమణారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తూర్పుపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో విఘ్నేష్‌రెడ్డి

అభివృద్ధి అంటేనే టీడీపీ

మార్కాపురం వన్‌టౌన్: రాష్ట్రంలో అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మీ అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో శుక్రవారం రాత్రి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మీ మాట్లాడుతూ.. ప్రతి స్కీమ్‌లో ఒక స్కామ్ ఉందన్నారు. రాష్ట్రంలో పన్నులభారం తప్ప ప్రజాసంక్షేమం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ వక్కలగడ్డ రాధిక, టీడీపీ రాష్ట వాణిజ్య విభాగం కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, టీడీపీ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించరూ..!

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 9 : నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.శ్రీనివాసులు శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలో తాగునీటి ట్యాంకర్లును ఏర్పాటు చేసిన యజమానులు అదనంగా ట్రిప్పులు నమోదు చేసుకొని బిల్లులు పొందుతున్నారని ప్రభుత్వం ట్యాంకర్లను నిలిపివేసిందన్నారు. పర్యవేక్షణలోపం వల్ల అదనంగా ట్యాంకర్లుకు బిల్లులు పొందిన విషయం వాస్తవం అయినప్పటికీ, ఇటీవల గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రం అయ్యిందన్నారు. ఈ పరిస్థితులలో ట్యాంకర్లు నిలిపివేయడం దారుణమన్నారు. ట్యాంకర్లను పునరుద్ధరించి ట్యాంకర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. వేసవి ముంగిట ప్రజలకు నీటిసరఫరా నిలిపివేస్తే ఎలా అని ప్రశ్నించారు. నీటి సమస్య పరిష్కరించకుంటే ధర్నా చేస్తామన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కార్యవర్గసభ్యులు కేవీ.కిష్టగౌడ్, మండల కార్యదర్శి బి రామయ్యలు ఆయన వెంట ఉన్నారు.

ముగ్గురికి గాయాలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 9 : ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని కొత్తపల్లి సమీపంలో శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ఘటనలో తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రామయ్య, రోశయ్య, తిమ్మాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 9 : నాయీబ్రాహ్మణుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం ముత్తుముల అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయిబ్రాహ్మణ సాధికారసమితి కరపత్రాలను ఆవిష్కరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నాయిబ్రాహ్మణుల అభివృద్ధికి చేపట్టిన పథకాల గురించి అశోక్‌రెడ్డి వివరించారు. నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తొండమల్ల బ్రహ్మయ్య, సాధికార సమితి కన్వీనర్లు శివరామ్‌ప్రసాద్, నాగరాజు, సంఘ ప్రతినిధులు కె.ప్రసాద్, బోగోలు నారాయణ, దేవగుడి రామయ్య, కాకర్ల రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అశోక్‌రెడ్డి

టీడీపీలో చెంచు కుటుంబాల చేరిక

గిద్దలూరు టౌన్ : నియోజకవర్గంలో టీడీపీలోని నిత్యం వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా అర్ధవీడు మండలం గన్నేపల్లి పంచాయతీలోని చెంచు కాలనీకి చెందిన 15 చెంచు కుటుంబాలు టీడీపీలో చేరాయి. గిద్ద లూరులోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తు ముల అశోక్‌రెడ్డి సమక్షంలో వీరు టీడీపీలో చేరారు. అశోక్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ లో చేరిన వారిలో కుడుముల వెంకటేశ్వ ర్లు, మండ్ల భైరెడ్డి, చిన్నగురువయ్య, బయ్యన్న, పెద్దన్న, వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో అర్ధవీడు మండల టీడీపీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్, టీడీపీ నాయకులు దూదేకుల కాశయ్య, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, చిరంజీవి, దూదేకుల భాషా ఉన్నారు.

బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలి

- సబ్‌కలెక్టర్ రాహుల్ మీనన్



సైకిళ్లను అందజేస్తున్న సబ్ కలెక్టర్

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 9: ప్రభుత్వం, సంస్థలు అందిస్తోన్న ప్రోత్సాహన్ని సద్వినియోగపర్చుకుని బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రదానోపాధ్యాయులు నాగమూర్తి ఆధ్వర్యంలో ప్రకాశం ఈకేఏఎం, పీజీఎస్ఎఫ్ ఆర్థిక సహకారంతో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 75 సైకిళ్లను బాలికలకు అందజేశారు. తహసీల్దారు వేణుగోపాలరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ సైకిళ్లు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మోహన్‌రావు, కే సుధాకర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పొత్తుధర్మానికి కట్టుబడి ఉంటాం

- కాపు సంఘం నాయకుల తీర్మానం

గిద్దలూరు, ఫిబ్రవరి 9 : రానున్న ఎన్నికల్లో జనసేన- టీడీపీ పొత్తు ధర్మానికి కట్టుబడి ఉంటామని కాపు సంఘం నాయకులు తీర్మానించారు. స్థానిక బలిజ సేవాసంఘ భవనంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలకు చెందిన కాపు నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. జిల్లాలోఅత్యధికంగా కాపు ఓటర్లు కలిగిన నియోజకవర్గం గిద్దలూరు అని అన్నారు. ప్రజారాజ్యం అభ్యర్థిని గెలిపించి చిరంజీవికి కానుకగా ఇచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుతం జనసేన పార్టీ అభ్యర్థిని ప్రకటిస్తే గెలిపించి పవన్‌కళ్యాణ్‌కు కానుకగా ఇస్తామన్నారు. ఏదిఏమైనా టీడీపీ, జనసేన పొత్తు ధర్మానికి కట్టుబడి ఉంటామన్నారు. బలిజ సేవాసంఘం అధ్యక్షులు యగటీల సుబ్బరంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసులు, కాపు జేఏసీ రాష్ట్ర నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, కంభం బలిజ సంఘం అధ్యక్షులు కాసుల పాండు, రాచర్ల జనసేన అధ్యక్షులు పుట్టా బాలకృష్ణ, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ యోగానంద్, పాల్గొన్నారు.



సమావేశమైన కాపు సంఘ నేతలు

వందరోజుల పనిదినాలు కల్పించాలి

- డ్వామా పీడీ శీనారెడ్డి

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 9 : ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పనిదినాలు కచ్చితంగా కల్పించాలని డ్వామా పీడీ శీనారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రాయవరం పంచాయితీలోని క్లస్టర్ కార్యాలయంలో దోర్నాల, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచుగూడేలలో ఉండే ప్రతి ఒక్క కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని, మిగిలిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలన్ని కూడా ఉపాధి హామీ ద్వారా వందరోజుల పని పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, అదనపు జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, మార్కాపురం క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి, మూడు మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, టీఏలు, జూనియర్ టీఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ శీనారెడ్డి

గిద్దలూరు నుంచి పోటీ చేసేందుకు సిద్ధం

- ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 9: రానున్న ఎన్నికలలో గిద్దలూరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని చెన్నకేశవనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో మార్కాపురం వైసీపీ ఎమ్మెల్యే గెలిపించి ఇప్పటివరకు అన్నివిధాల అండగా ఉన్న నియోజకవర్గ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు, పార్టీ నాయకులకు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బాల మురళీకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ మీర్జా షంషీర్ అలీబేగ్, జడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, సూరెడ్డి భూలక్ష్మీ సుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గోలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ ఇస్మాయల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

ఆశావర్కర్ల నిరసన ర్యాలీ

గిద్దలూరు, ఫిబ్రవరి 9 : విజయవాడలో ధర్నాకు అనుమతి ఇచ్చి అక్కడికి వెళ్లకుండా ఎక్కడికక్కడ ఆశాలను అరెస్టులు చేసి నిర్బంధించడంపై ఆశా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ధర్నాకు అనుమతి ఇచ్చి ధర్నాకు పోని వ్వకుడా ఎక్కడిక్కడ అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురి చేసిందన్నారు.

మా అబ్బాయిని ఆశీర్వదించండి

- మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 9 : ఎర్రగొండపాలెం నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా తన కుమారుడు పోటీ చేస్తున్నాడని ఆశీర్వదించాలని మాజీ శాసనసభ్యులు పాలపర్తి డేవిడ్‌రాజు కోరారు. దోర్నాలలో శుక్రవారం సాయంత్రం పాలపర్తి డేవిడ్ రాజు, ఆయన తనయుడు విజేష్‌రాజు పర్యటించారు. స్థానిక నటరాజ్ కూడలిలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం తనను బాగా ఆదరించిందని తన కుమారున్ని కూడా ఆదరించాలని ఆయన అభ్యర్థించారు.

విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 9: చింతల ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల మందును శుక్రవారం పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి పిల్లలకు ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించారు. మొత్తం 9681 మంది పిల్లలకు గాను 9342 మంది విద్యార్థులకు మాత్రలు మింగించినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాయి ప్రశాంతి, యగ్నిక్, శంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : రక్తహీనత, పౌష్టికాహారలోపాన్ని, శారీరక, మానసిక అభివృద్ధికి నులిపురుగులు ఆటంకం కలిగిస్తాయని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలచారి తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : నులిపురుగుల నివారణకు అందరూ సహకారం అందించాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పందివానిపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి విద్యార్థులతో మింగించారు. అనంతరం విద్యార్థులకు హ్యాండ్‌వాష్ కార్యక్రమంలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పాఠశాలలలో నులిపురుగుల నివారణకు డివార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దోర్నాలలో మాత్రలు మింగిస్తున్న డాక్టర్ పద్మావతి, కంభంలో మాత్రల పంపిణీ

అవీ..ఇవీ..

కార్మిక, కర్షక పక్షపాతి పుల్లయ్య



పుల్లయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 9: కార్మిక, కర్షక, పేదల పక్షపాతి ఏనుగుల పుల్లయ్య అని విశ్రాంత పోస్ట్‌మాస్టర్ సయ్యద్ సుభానీ అన్నారు. స్థానిక హెడ్ పోస్టాఫీస్ ఎదురు ఏనుగుల పుల్లయ్య విగ్రహం వద్ద ఆయన వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. పుల్లయ్య అన్ని వర్గాల సంక్షేమ కోసం పాటు పడ్డారని, పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించటం, కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉండేవారన్నారు. కార్యక్రమంలో ఐజేయూ నాయకులు ఎస్‌వీ.రమణ, సీపీఎం నాయకులు డి.సోమయ్య, బాలనాగయ్య, పాస్ అధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి, ఆప్ అధ్యక్షుడు సుదర్శన్, సీపీఎం నాయకులు రఫీ, సురేష్, రూబెన్, యువ, జేవీవీ నాయకులు వై.రవికుమార్ పాల్గొన్నారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్ల పరిశీలన

కంభం, ఫిబ్రవరి 9 : కంభం, బేస్తవారిపేట మండలాల్లోని సచివాలయాల్లో జరుగుతున్న పక్కాగృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా రిజిస్ట్రార్ డీఐజీ పుష్పలత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంభం మండలంలోని కంభం-1, కందులాపురం, చిన్నకంభం, తురిమెళ్ల, బేస్తవారపేట మండలంలో పూసలపాడు సచివాలయాల్లో జరుగుతున్న పక్కాగృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో కంభం సబ్‌రిజిస్ట్రార్ చింపిరయ్యబాబు, కంభం కార్యదర్శి బ్రహ్మయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ డీఐజీ పుష్పలత

రేపు ఆత్మార్పణ దినోత్సవం

గిద్దలూరు, ఫిబ్రవరి 9 : పట్టణంలోని అమ్మవారిశాలలో ఈ నెల 11న ఆదివారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మల పెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య పతాకావిష్కరణ, సామూహిక లలిత సహస్రనామ పారాయణం, మూలవిగ్రహానికి సామూహిక అభిషేకం, దేవీహోమం, సాయంత్రం 6గటలకు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కుంకుమార్చనకు వచ్చే మహిళలు పూజాసామాగ్రి వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

కిట్స్‌ను సందర్శించిన విద్యార్థులు

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 9: స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలను గణపవరం ఏపీఆర్ స్కూల్ 9వ తరగతి విద్యార్థులు సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇండస్ట్రీయల్ విజిట్‌లో భాగంగా ప్రస్తుత కంప్యూటర్‌యుగంలో ఎలా ప్రవర్తించాలి, కంప్యూటర్లపై అవగాహన, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ ఏ విధంగా పనిచేస్తాయి అనే అంశంపై అవగాహన కల్పించినట్లు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వీకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కళాశాలను సందర్శిస్తున్న విద్యార్థులు

మిరపపైరుపై అవగాహన

గిద్దలూరు, ఫిబ్రవరి 9 : ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మిర్చి పైరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట మండలాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బందికి జిల్లా ఉద్యానవనశాఖాధికారి గోపీచంద్ అవగాహన కల్పించారు. మిరప నాణ్యత పరీక్ష కేంద్రాల్లో పరిశీలించుకొని ఫలితాల ఆధారంగా పంటను అమ్మడం ద్వారా గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉందన్నారు. డిజిటల్ గ్రీన్ జిల్లా కోఆర్డినేటర్ కమలాకర్ మాట్లాడుతూ టెక్నాలజీ సహాయంతో మిరపలో నాణ్యత పరిమాణాలు, దిగుబడులను పెంచడం ఎలా అంశాల గురించి వివరించారు. ఈ-మిర్చి 2.0 ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. పురుగులు, తెగుళ్ల నివారణ గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ, వ్యవసాయాధికారులు భాస్కర్‌రెడ్డి, రఫి, సాంకేతిక వ్యవసాయాధికారి బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానాధికారి గోపీచంద్

ఈ-పంట నమోదుకు అవకాశం

బేస్తవారపేట, ఫిబ్రవరి 9 : రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పైర్లకు ఈనెల 15వ తేదీ లోపు ఈ-పంటలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జక్కం మెర్సి అన్నారు. శుక్రవారం బేస్తవారపేట ఆర్‌బీకేలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ సీజన్‌లో సాగైన పైర్లకు రైతులు సంబంధిత సిబ్బందిని సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఈ నెల రెండోవారంలో రైతులకు నగదు జమవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఎ.కోటారెడ్డి, ఉద్యానశాఖాధికారి శేషగిరిరావు, పట్టుపరిశ్రమాధికారి శివరాములు, ఎన్.వెంకటరమణ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీకి శంకుస్థాపన


మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని 27వ వార్డులో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్‌కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.10లక్షల వ్యయంతో వీటిని నిర్మించనున్నట్లు నగేష్ తెలిపారు. కార్యక్రమంలో బండారు శ్రీనివాసులు, డీ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, ఫిబ్రవరి 9 : కిసాన్ మోర్చ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కిసాన్‌మోర్చ గిద్దలూరు నియోజకవర్గ కన్వీనర్‌గా యడవల్లి గురుస్వామి, రూరల్, మండల అధ్యక్షులుగా కోటిరెడ్డి, గిద్దలూరు పట్టణశాఖ అధ్యక్షులుగా బాదం జయప్రకాశ్‌లు ఏకగ్రీవమయ్యారు. వారికి రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చ, ఓబీసీమోర్చ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల పోలింగ్ కేంద్రాల తనిఖీ

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 9: పట్టణంలోని ఎన్నికల పోలింగ్ బూత్‌లను సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్ఐ అబ్దుల్ రెహమాన్‌లు కలిసి శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని సుమారు 30 పోలింగ్‌బూత్‌లను పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీ లించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎటువంటి ఆటంకం కలగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునే విధంగా బూత్‌లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు.



పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ


పెద ఉల్లగల్లులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుబాబు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి

● తహసీల్దార్ మధుబాబు

ముండ్లమూరు, ఫిబ్రవరి 9 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకొనే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ జే మధుబాబు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కెల్లంపల్లి, పెద ఉల్లగల్లు, పసుపుగల్లు గ్రామాల్లో 181, 182, 183, 188, 189, 190, 191, 194, 195, 196 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం బీఎల్‌వోలు, వీఆర్‌వోలతో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ర్యాంపు, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, తాగు నీరు లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. భవనాలకు కిటికీలు, తలుపులు అసంపూర్తిగా ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఈనెల 15వ తేదీ కల్లా సౌకర్యాలన్నీ మెరుగు పరచాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే బీఎల్‌వోలు తమ దృష్టికి తీసుకు వచ్చి సవరణ చేయాలన్నారు. ప్రధానంగా ఒకే డోర్‌లో ఒకే పేరుతో ఎక్కువ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు ఎం. పెద్దన్న, వై. సుశీల రాణి, రమణ, కంప్యూటర్ ఆపరేటర్ జీ దేవకాంత్, బీఎల్‌వో శ్రావణి తదితరులు ఉన్నారు.


సెయింట్ జోసఫ్ స్కూలు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఆర్టీసీ డీఎం శ్రీమన్నారాయణ, చైర్మన్ గఫార్

అతివేగం ప్రాణాలకు ముప్పు..!

● డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ

కనిగిరి, ఫిబ్రవరి 9: అతి వేగంతో వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారని ఆర్టీసీ డీఎం శ్రీమన్నారాయణ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సెయింట్ జోసఫ్ స్కూల్‌లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళ వద్ద కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారన్న విషయాన్ని మరువరాదన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం స్కూలు ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, కౌన్సిలర్ దేవరాజ్, ప్రిన్సిపాల్ పెరయినయగమేరీ, సిస్టర్ ఎలిజిబెత్ రాణి, సిస్టర్ రాణీని, డిపో అసిస్టెంట్ మేనేజర్లు, ప్రజారవాణా ఉద్యోగులు, గుడ్‌హెల్ప్ రమేష్, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ అల్పాన్, సిబ్బంది

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలి

దర్శి, ఫిబ్రవరి 9 : విద్యుత్ అక్రమ వాడకాన్ని అరికట్టేందుకు అధికారులు, సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆశాఖ ఎస్ఈ ఏ అల్పాన్ సూచించారు. దర్శి పట్టణంలో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది 42 బృందాలుగా ఏర్పడి ఆకస్మిక దాడులు నిర్వహించారు. మొత్తం 3,802 గృహాలు, వ్యాపార సంస్థలను తనిఖీలు చేయగా 64 సర్వీసులు అదనపు లోడు వాడుతున్నట్లు గుర్తించారు. 45 సర్వీసులు మీటర్లు లేకుండా అక్రమ కరెంట్ వాడుతున్నట్లు గుర్తించారు. ఓవర్‌లోడ్ వాడుతున్న వినియోగదారులకు రూ.1.58 లక్షలు, మీటర్లు లేకుండా విద్యుత్ వాడుతున్న వారికి రూ.7.72 లక్షలు జరిమానా విధించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అక్రమ విద్యుత్ వాడకాన్ని నివారించకుండా నిర్లక్ష్యవైఖరి అవలంబించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు., నిరంతరం గ్రామాల్లో పర్యటించి విద్యుత్ వాడకాన్ని పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ కె. శ్రీనివాసులు, దర్శి ఈఈ ఎస్‌ఏ కరీం, ఏడీఈ కె. పిచ్చయ్య, పొదిలి ఏడీఈ కె. శ్రీనివాసులు, చీమకుర్తి ఏడీఈ డీవీ కృష్ణారెడ్డి, ఏఈ బి. వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలరాముడి దర్శనం కోసం అయోధ్య యాత్ర

పామూరు, ఫిబ్రవరి 9 : నూతనంగా నిర్మించిన రామమందిరంలోని బాలరాముడు దర్శనం కోసం పామూరు పట్టణం నుంచి పలువురు భక్తులు అయోధ్యకు యాత్ర చేపట్టారు. ప్రత్యేక రైల్వేలో ప్రయాణం చేసి శుక్రవారం అయోధ్యకు చేరుకున్నట్లు తెలిపారు. వారిలో బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు, బైరెడ్డి జయరామిరెడ్డి, జె. చిన సుబ్బయ్య, కె. హరగోపాల్, పోకూరి గుప్త, రాము, పి. యోగేశ్వరరెడ్డి, అవులూరి వేణు, మహిళలు ఉన్నారు.

స్పందనలో రెవెన్యూ సమస్యలే అధికం

అక్రమంగా పేర్లు మార్పు, భూముల సర్వేపై ఫిర్యాదులు

అన్నం పెట్టడం లేదని ఓ తల్లి ఫిర్యాదు

కురిచేడు, ఫిబ్రవరి 9: కురిచేడులో జరిగిన స్పందనలో అధికారులకు రెవెన్యూ పరమైన సమస్యలు అధికంగా వచ్చాయి. స్థానిక కల్యాణ మండపంలో శుక్రవారం తహసీల్దార్ ఏవీ సుధాకర్ అధ్యక్షతన ప్రత్యేక స్పందన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, కనిగిరి ఆర్డీవో జాజ్ ఎల్విస్‌లు మండల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూములు తమ పేరుమీద ఉన్నవి వేరొకరి పేరు మీద మార్చినట్లు ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. అలాగే పలు మార్లు దరఖాస్తు చేసుకున్నా సర్వే చేయడం లేదని మరికొందరు ఫిర్యాదు చేశారు. దేకనకొండ గ్రామంలో అసైన్‌మెంట్ భూములు అసలు వారివి కావని వేరొకరి పేరుమీద మార్చారని జేసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోమని తహసీల్దార్‌కు సూచించారు. తల్లికి అన్నం పెట్టకుండా ముగ్గురు కుమారులు రోడ్డున పడవేశారంటూ ఓ తల్లి జేసీకి ఫిర్యాదు చేసింది. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుని ఆమెకు న్యాయం చేయాలని కనిగిరి ఆర్డీవోకు సూచించారు. తమభూమిని ఆక్రమించారంటూ కురిచేడుకు చెందిన ఓ యువకుడు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. శ్మశానం భూమి ఆక్రమణకు గురి అయిందని, దానిని సర్వే చేసి హద్దురాళ్ళు ఏర్పాటు చేయాలని ఓ విశ్రాంత ఉద్యోగి అర్జీ ఇచ్చారు. కురిచేడులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేక విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్ళ వలసి వస్తున్నదని, వెంటనే జూనియర్ కాలేజి ఏర్పాటు చేయాలని కోరారు. రేషన్ కార్డు కావాలని ఐదుగురు దరఖాస్తు చేసుకోగా పింఛన్లు కావాలని మరో ఐదుగురు అర్జీలు ఇచ్చారు. నమశ్శివాయపురం గ్రామంలో మురుగుకాలువల్లో పూడిక తీయడం లేదని తామే తీసుకుంటున్నామంటూ ఓ వీడియోను గ్రామస్థులు జేసీకి చూపారు. వెంటనే కాలువల్లో మురుగు తొలగించాలని డీపీవోకు సూచించారు.


స్పందనలో జేసీకి దరఖాస్తులు అందిస్తున్న ప్రజలు

సమస్యలు అర్థం చేసుకుని పరిష్కరించాలి

అధికారులు సమస్యలు అర్థం చేసుకుని పరిష్కరించాలని జేసీ గోపాలకృష్ణ సూచించారు. కురిచేడులో ప్రత్యేక స్పందన కార్యక్రమానికి 130కి పైగా వివిధ శాఖలకు చెందిన అర్జీలు వచ్చాయన్నారు. అర్జీ దారుల సమస్యలను చట్టపరంగా, న్యాయపరంగా పరిష్కరిస్తామన్నారు. అర్జీలను ఆయా శాఖలకు పంపి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, జడ్పీటీసీ సభ్యుడు నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


కులగణన సర్వేను పరిశీలిస్తున్న డీపీవో నారాయణ రెడ్డి

కులగణన సర్వే కచ్చితత్వంతో చేయాలి

డీపీవో నారాయణ రెడ్డి

కురిచేడు, ఫిబ్రవరి 9: కులగణన సర్వే కచ్చితత్వంతో చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణ రెడ్డి అన్నారు. కురిచేడులో 1వ సచివాలయం పరిధిలో కుల గణన సర్వేను ఆయన పరిశీలించారు. కులగణన సర్వే చేసేటపుడు ప్రతి కుటుంబంలోని వ్యక్తుల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. వృత్తి, ఆదాయం , విద్యార్హతలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అలాగే బోదనంపాడు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు, రిజిస్టర్లు పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా జగనన్న స్వేచ్ఛా సంకల్పంలో భాగంగా ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్‌ను సందర్శించారు. ప్రతి ఇంటినుంచి సేకరించిన చెత్తను వీధుల వెంట, రోడ్డు పక్కన వేయకుండా చూడాలన్నారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త దిబ్బలను తొలగించి, చెత్తను ఎస్‌డబ్ల్యూ పీసీ దగ్గర వేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి తడి చెత్త నుంచి ఎరువులను తయారు చేయాలన్నారు. అలాగే పొడి చెత్త అమ్మి సంపద తయారు చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విడతల వారీగా జిల్లాలోని గ్రామాలన్నింటినీ చూడ చక్కటి పరి శుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీలు పూర్తి స్థాయిలో వాడుకలోకి వస్తేనే గ్రామాలన్నీ వ్యర్థ రహితంగా ఉంటాయన్నారు. అలా జరిగితేనే ప్రజలు ఆరోగ్య వంతంగా ఉంటారన్నారు. ఆయన వెంట జిల్లా, గ్రామ, వార్డు సచివాలయ అధికారిణి ఉషారాణి, మార్కాపురం డీఎల్‌పీవో సాయి కుమార్, త్రిపురాంతకం సీఐ సుబ్బారావు, ఎంపీడీవో సీతారామయ్య, ఈవోఆర్డీ ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

దొనకొండ అభివృద్ధికి కార్యాచరణ

దొనకొండ, ఫిబ్రవరి 9 : దొనకొండ ఎంతో వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా విద్యా, వైద్య, రవాణా సౌకర్యాలు ఎంతో అవసరమని, అవి అందించే విధంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపడతావని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. ఆపార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన దొనకొండలో పర్యటించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్‌పథకంలో భాగంగా దొనకొండ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, రైల్వే ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంఘం సెక్రెటరీ జయరాజ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని జయరాజ్‌తో పాటు పలువురు వినతి పత్రాల ద్వారా విన్నవించారు. దొనకొండలోని రైల్వేపరమైన సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా ప్రయత్నిస్తానని తెలిపారు.


బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దినకర్‌ను సన్మానిస్తున్న జయరాజ్

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామయ్య, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎం. నర్సింహులు, ఎన్. కోటిలింగం, చెంచు రామయ్య, వి. ఆశీర్వాదం, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ భూముల పరిశీలన

పామూరు, ఫిబ్రవరి 9 : మండలంలోని ఇనిమెర్ల గ్రామం వద్ద సేకరించిన నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు సంబంధించిన భూములను జేసీ గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. రైల్వేలైన్‌కు భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు, ఈ సందర్భంగా రైతులతో జేసీ మాట్లాడారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ ప్రకారం రైతులకు నష్టపరిహారం అందచేస్తామన్నారు. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకొంటామని తెలిపారు. అదేవిధంగా నిర్మాణంలో ఉన్న సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్, తహసీల్దార్ షాకీర్‌పాష, వీఆర్వో మండ్ల శ్రీను, సర్వేయర్ మానస పాల్గొన్నారు.


రైల్వేలైన్ రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు తీసుకోండి

●డీఎల్‌పీవో రాధా

ముండ్లమూరు, ఫిబ్రవరి 9 : గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలని ఒంగోలు డీఎల్‌పీవో రాధా అన్నారు. ఆమె శుక్రవారం మండలంలోని పులిపాడు తండాను సందర్శించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న మురుగు కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మండలానికి విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకే ఖర్చు చేయాలన్నారు. ప్రధానంగా తాగు నీరు, వీధి లైట్లు, పారిశుధ్యానికి ఖర్చు పెట్టాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగు నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు రాజ రాజేశ్వరిదేవి, అనిల్, సర్పంచ్ చిన్నా నాయక్ తదితరులు ఉన్నారు.


పులిపాడు తండాలో మురుగు కాలువల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాధా

మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

పామూరు, ఫిబ్రవరి 9 : విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభు త్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని, విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి, ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన కనిగిరి, పీసీపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు రమణారెడ్డి, ఖాశీంపీరా, స్థానిక ప్రిన్సిపాల్ జె, సురేష్‌లను లెక్చరర్ గుత్తి రమణయ్య పుష్ప గుచ్ఛం అందజేసి వేదిక మీదకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ రైడర్లకు పోలీసుల హెచ్చరికలు

కనిగిరి, ఫిబ్రవరి 9: కనిగిరి పట్టణంలో కొంతమంది యువత బైక్‌లపై ఇష్టానుసారంగా రైడింగ్ చేయటంపై సీఐ రామానాయక్ హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం పట్టణంలో బైక్ రైడింగ్ చేస్తున్న కొంతమం ది యువకులను అదుపులోకి తీసుకున్నారు .వారికి సీఐ హెచ్చరికలతో పాటు జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ త్యాగరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎస్ఐ సైదుబాబుకు సన్మానం

పామూరు, ఫిబ్రవరి 9 :పామూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సైదుబాబును టీడీపీకి చెందిన పలువురు ఆర్యవైశ్యులు శుక్రవారం మర్యాద పూర్వంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు తడికమళ్ల సుబ్బారావు, టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు పందిటి హరీష్, మెంటా నరసింహారావు, పెసల నరసింహారావు, సోమిశెట్టి నరసింహారావు, మోగళ్లూరి మధు ఉన్నారు.

పీసీపల్లి ఎస్సైగా రమేష్‌బాబు

పీసీపల్లి,ఫిబ్రవరి9: పీసీపల్లి ఎస్సైగా నియమితులైన టి.రమేష్‌బాబు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు .ఒంగోలులో వీఆర్‌లో ఉన్న ఆయనను పీసీపల్లి ఎస్సైగా నియమించిన ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఎస్సై కోటయ్యను వీఆర్‌కు పిలిచారు.

నులిపురుగులతో అనారోగ్యం..!

డీఎంహెచ్‌వో సృజన

కనిగిరి, ఫిబ్రవరి 9: నులిపురుగుల కారణంగా చిన్నారులు అనారోగ్యం పాలౌతారని డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన అన్నారు. పట్టణంలోని 9వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు నులి పురుగులు మందులు వేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది, కార్యకర్తలకు నులిపురుగుల వలన కలిగే అనర్థాలను వివరించారు. ఏడాది నిండిన ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ గుళికలు చిన్నారులకు మింగించాలన్నారు. అదేవిధంగా చిన్నారులకు పరిశుభ్రమైన నీటిని తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త బింగి సుశీల, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలి

కనిగిరి, ఫిబ్రవరి 9: వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని సీఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఎస్ఐ త్యాగరాజుతో కలసి పరిశీలించా రు. ఈ సందర్భంగా దిరిశవంచ గ్రామంలోని పోలింగ్ బూత్ సందర్శించిన సీఐ ఆయా గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామాల్లో అందరూ స్నేహ భావంతో మెలగాలన్నారు. అదేవిధం సీఎస్‌పురం మండలంలోని పెదరాజుపాలెం, సీఎస్‌పురం, ఆర్‌.కే.పల్లి, చింతపూడి గ్రామాల్లోకి పోలింగ్ బూత్‌లను పామూరు సీఐ రామానాయక్ పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల పరిసరాలను పరిశీలించి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్పిస్తే చర్యలు

పామూరు, ఫిబ్రవరి 9 : పట్టణంలో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే తగిన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ సైదుబాబు హెచ్చరించారు, పట్టణంలో శుక్రవారం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు, ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ దాటి ఎవరైనా తోపుడు బండ్లు, వాహనాలను అడ్డంగా పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టణంలో కందుకూరురోడ్, మెయిన్‌బజారు, సీఎస్‌పురం రోడ్, కనిగిరి రోడ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించి వ్యాపారులకు, ఆటోవాలాలకు తగు సూచనలు చేశారు.

ప్రతి కుటుంబానికి 100 రోజల పని

పామూరు, ఫిబ్రవరి 9 : ఉపాధిహామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిదినాలు కల్పిస్తున్నట్లు ఏపీవో మాల్యాద్రి తెలిపారు. ప్రస్తుతం 80 నుంచి 99 రోజులు పనిచేసిన కూలీలకు 100 రోజులు పనికల్పిస్తున్నామన్నారు. మండలంలో రైతువారికుంటలు, సరిహద్దు కందకాలు, పనులు చేపడతామని తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ముండ్లమూరు, ఫిబ్రవరి 9 : మండలంలోని ముండ్లమూరు, మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారులు మణిశంకర్, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరెడ్డి, జాస్మిన్, సిబ్బంది ఉన్నారు.

ఆల్బెండజోల్‌తో అనారోగ్య సమస్యలు మాయం

పీసీపల్లి, ఫిబ్రవరి9: ఆల్బెండజోల్ మాత్రలను మింగించడం ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని పీసీపల్లి వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.యషిత అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. అక్కడ ఆయా పాఠశాలల్లో 1నుంచి 19 సంవత్సరాలలోపు వయసు గల విద్యార్థినీ విద్యార్థులకు నులిపురుగు నివారణా మందులను మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగులు సంక్రమించిన వారిలో రక్తహీనత సమస్యలు తలెత్తడంతో పాటు చదువు పట్ల అనాసక్తి,చురుకుదనం లోపిస్తాయని అన్నారు. మట్టి ద్వారా సంక్రమించే పరాన్నజీవి పురుగుల నిర్మూలనకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మందును ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. భోజనానికి ముందు, తరువాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని ఆమె అన్నారు. మండలంలో 1539 మంది అంగన్‌వాడీ పిల్లలకు, పాఠశాలలు, కళాశాలల్లోని 4,018మంది విద్యార్థినీ విద్యార్థులకు ఈ మందును మింగించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణారెడ్డి, ఎంఈవోలు సంజీవి, శ్రీనివాస్‌లు, కమ్యూనిటీ హెల్త్ అధికారిణి కెఎల్.సుజాత, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రను మింగిస్తున్న డాక్టర్ యషిత


బీసీల భరోసా బాట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పువ్వాడి

రేపు ఒంగోలులో బీసీల భరోసా బాట

పామూరు, ఫిబ్రవరి 9 : టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం ఒంగోలులో రజక సాధికార కమిటీ ఆధ్వర్యంలో బీసీల భరోసా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సాధికార కమిటీ కన్వీనర్ ఆరె కొండా హరిప్రసాద్ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీ భరోసా బాటకు సంబంధించిన కరపత్రాలను టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లుతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి పాటు పడతానని జగన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు పరచకుండా నమ్మక ద్రోహం చేశాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ముబినా మౌలాలి, చినహజరత్, పత్తు మస్తాన్‌తోపాటు రజక సంఘం నాయకులు తాడికొండ చంద్రశేఖర్, దేవరాజుగట్టు అనిల్, పొదిలి హరిబాబు, చీమలదిన్నె రవీంద్ర, గువ్వలంపాటి ప్రసాద్, ఏ.నారాయణ, కర్నకుంట పుల్లయ్య, దేవరకొండ బాలయ్య, పాల్గొన్నారు.



కనిగిరిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా నాయకులు కేశవరావు

కనిగిరి, ఫిబ్రవరి 9: ఆశా వర్కర్‌లకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ సాధనకై పోరాటం చేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమన్నారు. చలో విజయవాడ ధర్నాలో పాల్గొన్న ఆశా వర్కర్లపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి వారిపై పోలీసులుతో దాడులు చేయించిందని ఆరోపించారు. వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఆశా వర్కర్‌లు నినదించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్‌ల యూనియన్ నాయకులు పద్మ, సుకన్య, రమాదేవి, అచ్చమ్మ, సుజాత, హర్ష, రెబ్బమ్మ, దినాభి, ఉషా, డీవైఎఫ్ఐ నాయకులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సాయం అపూర్వం

- సాగుబడి రుణం తీర్చుకుంటున్న పూర్వ విద్యార్థులు
- వ్యవసాయ కళాశాల అభివృద్ధికి తమ వంతు సాయం
- హలధారులకు ఇతోధిక తోడ్పాటు
- రేపు అతిథిగృహం ప్రారంభం, రైతు సేవాకేంద్రానికి శంకుస్థాపన

బాపట్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు మేలు చేయడమే లక్ష్యంగా దశాబ్దాల క్రితం బాపట్లలో పురుడుపోసుకున్న వ్యవసాయ కళాశాల ఎంతోమంది అగ్రగణ్యులను దేశానికి అందించింది. వేలమంది విద్యార్థులు బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి కోర్సు పూర్తి చేసుకుని బయటకొచ్చారు. రాజకీయ, సాంస్కృతిక, కళలతో పాటు శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, డాక్టర్లు ఇలా పలు రంగాల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల అందించిన సుగంధాలు పరిమళిస్తూనే ఉన్నాయి. ఎవరెక్కడ ఏరంగంలో స్థిరపడినా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన వ్యవసాయ కళాశాలను మరువకుండా దాని అభ్యున్నతికై తోడ్పాటు అందిస్తూనే ఉన్నారు.

దాదాపు రెండు కోట్ల ఖర్చుతో..

రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన అతిథి గృహ సముదాయాన్ని పూర్వ విద్యార్థులే అతిథులుగా ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ భవన నిర్మాణానికి అయ్యేఖర్చు మొత్తాన్ని వారే భరించారు. ఇందులో 1980 బ్యాచ్ విద్యార్థి నందూరి శ్రీనివాసరావు ఆయన సతీమణి జ్ఞాపకార్థం రూ.10.50 లక్షలను విరాళంగా అందించారు. ఆమె సైతం ఇదే కళాశాలలో విద్యనభ్యసించడం గమనార్హం. అదేవిధంగా రాజకీయాల్లో రాణిస్తున్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు రూ.10.10లక్షలను తమ వంతుగా ఆ భవన నిర్మాణానికి అందించారు. 1988 బ్యాచ్‌కు చెందిన సిరి సీడ్స్ అధినేతలు రూ.5లక్షలు అందించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు తనవంతుగా రూ.1,11,111 అందించడం విశేషం.

ప్రభుత్వం వైపు నుంచి తోడ్పాటు అందితే...

ఇంత పెద్దఎత్తున స్పందించి విరాళాలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వం వైపు నుంచి కనీస సాయం కొరవడడం ఆవేదన కలిగిస్తోందనే అభిప్రాయాన్ని పూర్వ విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. పైగా ఖ్యాతి గడించిన వ్యవసాయ కళాశాలలోకి సైతం రాజకీయ వాసనలు జొప్పిస్తూ ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన మార్గనిర్దేశకత్వం జరగడం లేదని బాధపడుతున్నారు. ఎంతో యశస్సు కలిగిన కళాశాల ప్రాచుర్యం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అటు యూనివర్సిటీ పెద్దలమీద, ఇటు ప్రభుత్వం పైన సమాన స్థాయిలో ఉందని పూర్వ విద్యార్థులు అంటున్నారు.



ఆదివారం ప్రారంభించే వ్యవసాయ కళాశాలలోని అతిథి గృహం ఇదే

రైతు సేవా కేంద్రం

1980 బ్యాచ్‌కు చెందిన సుంకు హరిప్రసాద్ ప్రస్తుతం పారిశ్రామికవేత్తగా రాణిస్తున్నారు. ఆయన ఒక్కరే అన్నదాతలకు ఉపయోగపడే రైతుసేవా కేంద్రం నిర్మాణం చేపట్టడానికి ముందుకొచ్చారు. దాదాపు రూ.50లక్షల వ్యయమయ్యే ఆ భవన నిర్మాణానికి భూమి పూజ కూడా ఆదివారమే జరగనుంది. వీరే కాకుండా వివిధ రంగాలలో రాణిస్తున్న వారు సైతం గతంలో ఇతోధికంగా కళాశాల అభ్యున్నతికి తోడ్పాటు అందించారు. వారిలో ముఖ్యంగా నాబార్డ్ ఛైర్మన్‌గా విశేష సేవలందించిన చింతల గోవిందరాజులు వ్యవసాయ కళాశాల విద్యార్థే. కళాశాలలోని ఓ భవన నిర్మాణం కోసం ఆయన గతంలోనే సాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు కళాశాలలో భవన నిర్మాణాలకు కావాల్సిన గ్రానైట్ సాయాన్ని అందిస్తూ వస్తున్నారు. 75 సంవత్సరాల సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను కూడా ఆయనే అందించారు. పోతన హాస్టల్ ఆధునికీకరణకు కూడా తన వంతుసాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చి ఉదారతను చాటుకున్నారు. అదేవిధంగా ఆలిండియా రేడియోలో పని చేసి ఇటీవలే రిటైర్డ్ అయిన వలేటి గోపిచంద్ కళాశాల పూర్వ విద్యార్థుల విజయగాథలతో అచ్చేసిన ప్రచురణలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నాయి. కళాశాల పూర్వ విద్యార్థులంతా అగ్రికల్చరల్ గ్రాడ్యుయేట్ ట్రస్ట్ ఫర్ కాలేజ్ డెవలప్‌మెంట్ అనే రిజిష్టర్ బాడీని ఏర్పాటు చేసుకున్నారు. దానికి ఛైర్మన్‌గా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వ్యవహరిస్తుండగా, ఇదే కళాశాలలో సేవలందిస్తున్న పూర్వ విద్యార్థులు బాడీలో వివిధ హోదాలలో ఉన్నారు. పూర్వ విద్యార్థులు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయి ఈ డెవలప్‌మెంట్ బాడీ ద్వారా నే ఖర్చు చేస్తూ జవాబుదారీగా వ్యవహరిస్తున్నారు.



ఆసరా.. అంతేనా?

- బటన్ నొక్కి రెండువారాలైనా ఊసేలేదు
- ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన
- రుణమాఫీ కోసం 7 లక్షల మంది ఎదురుచూపు
- ఈ నెల 15 తర్వాత అంటుండటంతో లబ్ధిదారుల్లో గుబులు

బటన్లు నొక్కుతున్నా.. లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులకు సంక్షేమ నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే వేస్తున్నా.. అని ప్రతీ వేదికపై నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రకటిస్తుంటారు. అయితే ఆయన బటన్లు నొక్కడం వరకే పరిమితమవుతున్నారు. ఆ బటన్లు నొక్కినా లబ్ధిదారులకు ఆయా పథకాల నగదు అందుతుందా లేదా అని చూడటంలేదు. లబ్ధిదారులు ఏమో ముఖ్యమంత్రి బటన్ నొక్కాడు ఇక తమ ఖాతాల్లో నగదు పడుతుందని ఎదురు చూసిచూసీ అలసిపోతున్నారు. బటన్లు నొక్కినా పనైపోయిందని ముఖ్యమంత్రి చేతులు దులుపు కుంటున్నారు. ఈ కోవలోకే ఆసరా పథకం చేరింది. నాలుగో విడత ఆసరా పథకం బటన్ నొక్కి ఇప్పటికి రెండు వారాలు అవుతున్నా ఇప్పటివరకూ లబ్ధిదారుల ఖాతాల్లో డ్వాక్రా రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. మరో రెండు, మూడు వారాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న వాతావరణం నెలకొన్న నేపథ్యంలో లబ్ధిదారులు తీవ్ర ఆందోళ నకు గురవుతున్నారు. ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా తాపీగా ఉండటంపై లబ్ధిదారులు మండి పడుతున్నారు. పేరుకు నాలుగో విడత ఆసరా పథకం బటన్ నొక్కినా, రుణమాఫీ మాత్రం అమలుకు నోచుకోలేదు.

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలు కోసం బటన్లు నొక్కుతున్నా అని చెప్తున్న ముఖ్యమంత్రి అవి పనిచేస్తున్నాయా? లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతున్నాయా? అనే విషయాన్ని మాత్రం చెప్పడం లేదు.. ఆ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో పడకపోవడంతో వారిలో తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. వాయిదాల పర్వంతో దాటవేత ధోరణి సంక్షేమ పథకాలను నీరుగార్చడంలో తలమునకలైన రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకాన్ని కూడా పలు రకాలుగా నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోంది. అమ్మఒడి, చేయూత, పింఛను పథకాల మాదిరిగా అంక్షల పేరుతో లబ్ధి దారుల్లో కోత పెట్టేందుకు వీలు లేక పోవడంతో వాయిదాల పద్ధతిలో పథకాన్ని నీరుగార్చేందుకు పూనుకుంది. ఫలితంగా ఎప్పుడో 2023 నాటికే పూర్తి స్థాయిలో అవ్వాల్సిన రుణమాఫీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకూ వాయిదా పడింది.

15నెలలు ఆలస్యంగా ప్రారంభం..

2019 ఏప్రిల్ 11లోపు డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని జగన్ 2019 ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అప్పటికే రుణాలు చెల్లించి ఉంటే వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచిన 15 నెలల వరకూ ప్రభుత్వం ఈ హామీ అమలుకు పూనుకోలేదు. 2019 మే చివర్లో అధికార పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి 2020 సెప్టెంబరు వరకూ పథకం ఊసే ఎత్తలేదు. 2020 సెప్టెంబరు 11న వైఎస్సార్ ఆసరా పేరుతో ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని ప్రారంభించి, ఉమ్మడి జిల్లాలో 74,640 గ్రూపులకు 74,169 గ్రూపులకు చెందిన 6.97 లక్షల మందిని అర్హులుగా గుర్తించింది. వారికి రూ.2,480 కోట్ల మేర రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. వాటితోపాటు బాపట్ల జిల్లాలో కలిసిన చీరాల డివిజన్లో మరో లక్ష మందికి మరో రూ.350 కోట్ల మేర రుణమాఫీ చేయాల్సి ఉంది. మొత్తంగా మూడు జిల్లాల్లో నాలుగు విడతల్లో దాదాపు 8 లక్షల మందికి దాదాపు 2,800 కోట్ల రూపాయల రుణమాఫీ చేయాలి. తొలివిడత జిల్లాలోని 7 లక్షల మందికి ఈ పథకం ద్వారా రూ.698 కోట్లు పంపిణీ చేశారు. తొలిసారి 15 నెలలు ఆలస్యంగా 'ఆసరా'ను ప్రారంభించిన ప్రభుత్వం రెండో విడత ఒక నెల ఆలస్యంగా 2021 అక్టోబరు 7న ప్రారంభించింది. లబ్ధిదారులకు రూ.696 కోట్లు పంపిణీ చేశారు. మూడో విడత రుణమాఫీని ఆరు నెలల ఆలస్యంగా ప్రారంభించారు. 2022 అక్టోబరు నుంచి అదిగో ఇదిగో అంటూ 2023 మార్చి చివరి వరకూ నెట్టుకొచ్చి మూడో విడత పథకాన్ని ప్రారంభించారు. అప్పుడు మరో 699 కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి బటన్ నొక్కినా లబ్ధిదారులకు నెల రోజుల వరకూ నగదు అందలేదు. ఏప్రిల్ చివర, మే తొలినాళ్ల వరకూ వారు ఎదురు చూడాల్సి వచ్చింది. తాజాగా నాలుగో విడత రుణమాఫీదీ అదే పరిస్థితి. ముఖ్యమంత్రి జనవరి 23న బటన్ నొక్కి పథకాన్ని ప్రారంభించినా లబ్ధిదారులకు మాత్రం రుణమాఫీ దక్కలేదు.

నాలుగో విడత ఇలా..

జిల్లా	సంఘాలు	లబ్ధిదారులు	జమ కావాల్సిన మొత్తం
గుంటూరు	29,322	2,86,000	రూ.246 కోట్లు
పల్నాడు	25,168	2,47,833	రూ.190 కోట్లు
బాపట్ల	30,604	3,00,000	రూ.263 కోట్లు

ఎన్నికల ప్రచారం..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ). పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) శాఖల పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో ఆసరా పథకం కింద నాలుగో విడత రు ణమాఫీ జరగాలి. కాగా ఆసరా పథకాన్ని ప్రభుత్వం ఎన్నికల ప్రచారానికి వాడుకోవాలని చూస్తోందన్న విమర్శలున్నాయి.ఆ విమర్శలకు బలం చేకూర్చేలా గ్రామగ్రామాన 'ఆసరా' వారోత్సవాల పేరుతో సమావేశాలు పెట్టి చెక్కులు అందజే స్తామని అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారులను పిలిపించుకుని ఆర్భాటంగా సభలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరై తమ ప్రభుత్వ గొప్పలు చెప్పుకుంటూ ఊక దంపుడు ఉపన్యాసాలతో ఆసరా సమావేశాలను ముగిస్తున్నారు. అయితే రోజులు గడుస్తున్నా ఆసరా నగదు జమ కావడంలేదు. దీంతో ఇదంతా వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగమని లబ్ధిదారులు భావిస్తున్నారు. మరో వైపు ఎన్నికల కోడ్ తరుముకు వస్తోంది. అలాంటి సమయంలో ఇలా నగదు జమ చేయకుండా జాప్యం చేస్తుండ డంపై లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మిర్చి ధరపై ఉత్కంఠ

- వచ్చే వారం మార్కెట్‌పై అందరి దృష్టి
- కొంచెం పెరిగితే బావుంటుందని రైతుల ఆశ
- తేజ రకం తప్ప మిగిలిన వాటి ధర అంతంతే
- వచ్చిందే ధర అన్నట్లుగా దూరప్రాంతాల రైతులు



గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే వారం మిర్చి మార్కెట్ ఎలా ఉండబోతుందోనన్న ఉత్కంఠ అటు రైతులు, ఇటు వ్యాపారవర్గాల్లో నెలకొన్నది. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కొంచెం అటు, ఇటుగా మిర్చి ధరలు కొనసాగుతున్నాయి. దీంతో రైతులు అంత సంతోషంగా లేరు. ఒక్క తేజ వెరైటీ మిర్చి రకానికి మాత్రమే క్వింటాల్ రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు ధర లభ్యమౌతున్నది. మిగతా రకాలన్నింటికి రూ.14 వేల నుంచి రూ.17 వేల మధ్యనే ధర వస్తున్నది. సీజన్ మొదట్లో ఉన్న ధరతో పోల్చితే ఇప్పుడు క్విం టాల్‌కు రూ.5 వేల వరకు వ్యత్యాసం కనిపిస్తున్నది. వారం క్రితం మరింత పడి పోయిన ధర ఈ వారంలో కాస్త నిలబడింది. ఈ నేపథ్యంలో వచ్చే వారం ధర పడి పోకుండా ఉంటే రాబోయే రోజుల్లో పెరగడమే తప్ప తగ్గదన్న భావన ప్రతీ ఒక్కరు వ్యక్తపరుస్తున్నారు. గత నవంబరులోనే మిర్చి సీజన్ గుంటూరు వ్యవసాయ మార్కెట్‌లో ప్రారంభమైంది. మొదట్లో రాయలసీమ జిల్లాల నుంచి ఎక్కువగా పంట వచ్చింది. ఇప్పుడు ప్రకాశం, గుంటూరు, పల్నా డు జిల్లాల నుంచి రైతులు సరుకు తీసుకొస్తున్నారు. గత డిసెంబరులో వచ్చిన తుపాను వల్ల ఇంకొల్లు మొదలు ప్రత్తి పాడు మండలం వరకు మిర్చి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దాంతో ఆయా ప్రాంతాల నుంచి సరుకు రావడం లేదు. ప్రస్తుతం రోజుకు సగటున లక్షా 10 వేలకు పైగా మిర్చి టిక్కీలను రైతులు తీసుకొస్తున్నారు. నాన్ ఏసీ వెరైటీలైన 334, నెంబరు. 5, 274, 341, 4884, సూపర్ 10లకు క్వింటాల్ ధర రూ.16 వేల మధ్యనే లభిస్తున్నది. తేజకి మాత్రమే రూ.20 వేల పైగా లభిస్తున్నది. బ్యాడిగి, దేవనూ రు డీలక్స్ రకాలకు రూ.18 వేల వరకు కొనుగోలుదారులు ధర పెడుతున్నారు. కాగా దూర ప్రాంతాల నుంచి సరుకు తీసుకొచ్చిన రైతులు వచ్చిందే దక్కుదల అన్నట్లుగా విక్రయిస్తు న్నారు. వెనక్కు తీసుకెళ్లి కోల్డ్‌స్టోరేజ్‌లో పెట్టినా ఛార్జీలు చెల్లించాలి. అలానే మార్కెట్ సీజన్ ముగిసి ఆగస్టు వస్తే తప్ప పెరగదు. ఈ నేపథ్యంలో తీసుకొన్న పంట రుణాలు చెల్లించడానికి తొలి కాపుని విక్రయిస్తున్నారు. ఈ వారంలో లభిస్తున్న ధర కాస్త పర్వాలేదని చెబుతున్నారు. ఈ దృష్ట్యా వచ్చే వారం అంతా ఇదే ధర కొనసాగితే సీజన్ ముగిసేవరకు ఇంతకుమించి తగ్గదన్న ఆశా భావంతో ఉన్నారు. ఇంకా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేయడం ప్రారంభం కాలేదని, అది కూడా ప్రారంభమైతే ధర పెరుగుతుందే తప్ప తగ్గదన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. ఈ దృష్ట్యా రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని మార్కెటింగ్ వర్గాలు చెబుతున్నాయి.



బీఈడీ.. బరితెగింపు

- ఏఎన్‌యూలో ఇష్టారాజ్యం
- బీఈడీ విద్యార్థుల్లో ఆందోళన
- వసూళ్లే లక్ష్యంగా పరీక్షల నిర్వహణ
- కోర్సు ప్రారంభమైన 18 రోజులకే పరీక్షలు
- ఇంటర్న్‌షిప్ లేకుండానే ఫైనల్ పరీక్షలు
- ప్రయోగ పరీక్షల పేరిట దళారుల దందా
- స్పాట్, యాజమాన్య కోటా సీట్ల పేరిట వసూళ్లు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 9: సాధారణంగా ఏదైనా కోర్సుకు సంబంధించి అకడమిక్ క్యాలండర్ ఉంటోంది. ఆ ప్రకారమే పరీక్షలు, తరగతులు, ఫీజులు తదితరాలు ఉంటాయి. కానీ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం(ఏఎన్‌యూ)లో బీఈడీ కోర్సు నిర్వహణలో ఇష్టారాజ్యంగా ఉంది. అక్రమాలతో వర్సిటీ అధికారులు బరితెగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అకడమిక్ క్యాలండర్‌కు తరగతులకు, పరీక్షలకు సంబంధం లేకుండా వసూళ్లే లక్ష్యంగా కోర్సు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో అయోమయం, ఆందోళన నెలకొంది. ఏఎన్‌యూ పరిధిలో దాదాపు 175పైగా బీఈడీ కళాశాలలు ఉన్నాయి. అయితే ముందస్తుగా భారీ స్థాయిలో వసూళ్లకే పరీక్షలు అన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇంటర్న్‌షిప్ లేకుండానే ఫైనల్ ప్రయోగ పరీక్షల ఫీజు, హాల్‌టిక్కెట్లు లేకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా చేపట్టడంలో ఆంతర్యం ఏమిటో వర్సిటీ అధికారులకే తెలియాలని కళాశాలల అధ్యాపకులు ఆరోపణలు చేస్తున్నారు. బీఈడీ 2022-24 నాలుగో సెమిస్టర్ తరగతులు ఈ ఏడాది జనవరి 29 నుంచి ప్రారంభమయ్యాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం మార్చిలో ఇంటర్న్‌షిప్, ఏప్రిల్‌లో ఫైనల్ ప్రయోగ పరీక్షలు నిర్వహించాలి. అయితే కోర్సు ప్రారంభమైన 18 రోజులకే అంటే ఫిబ్రవరి 16 నుంచి ప్రయోగ పరీక్షలను నిర్వహిస్తున్నారు. బీఈడీ 2022- 24 విద్యా సంవత్సరం ఫిబ్రవరి 28 2023న ప్రారంభిస్తే రెండేళ్ల కోర్సులో 11 నెలలకే ఫైనల్ పరీక్షల్ని ఏ ఇతర యూనివర్సిటీల్లో లేనివిధంగా ఎలా నిర్వహిస్తారో అధికారులకే తెలియాలన్న విమర్శలున్నాయి.

ఒకే రోజు.. రెండు పరీక్షలు

ఒకే రోజున టెట్... బీఈడీ ప్రయోగ పరీక్షలు తేదీలు విడుదల కావడంతో విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఏపీ టెట్ (2024) పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి 9 వరకు జరగను న్నాయి. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నిర్వహించే బీఈడీ (2022-24) ఫైనల్ ప్రయోగ పరీక్షలు కూడా ఈ నెల 26 నుంచి మార్చి 6 వరకు నిర్వహించనున్నారు. దీంతో అనేక మంది విద్యా ర్థులు ఒకే రోజు రెండు పరీక్షలకు హాజరుకావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

అధికారి పేరుతో వసూళ్లు..

వర్సిటీలో ఓ అధికారి అనుచరుడు, లెక్చరర్ అయిన ఓ వ్యక్తి బీఈడీ కోర్సులో అన్నీ తానై వ్యవహరిస్తున్నాడనే ఫిర్యాదులు న్నాయి. పరీక్షలు లేకుండా చూస్తానని అక్రమ వసూళ్లకు తెరలేపినట్లు ఆరోపణలున్నాయి. ప్రతి కళాశాల రూ.2.50 లక్షలు, తనిఖీ బృందాలకు రూ.30 వేలు చెల్లిస్తే విద్యార్థుల హాజరుతో సంబంధం లేకుండా, పరీక్షలు లేకుండా మార్కులు వేసి పంపుతానని లాబీయింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. 50 మంది విద్యార్థులు ఉంటే ఒకరేటు, 100 మంది అయితే మరో రేటు అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని అధ్యాపకుల నుంచే ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న బీఈడీ కౌన్సెలింగ్‌లో పూర్తి స్పాట్ సీట్లను, యాజమాన్య కోటా సీట్లను 20శాతం ఈడబ్ల్యూఎస్, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించేలా చూస్తానని, కొంతమంది మంత్రుల పేరుతో వసూళ్లకు దిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. 50 సీట్లు ఉంటే రూ.50 వేలు, 100 సీట్లు ఉంటే రూ.లక్ష చొప్పున దండుకుంటున్నట్లు సమాచారం.

అరెస్టుపై.. ఆశాల ఆందోళన

విధులు బహిష్కరించి రేపల్లెలో నిరసన


రేపల్లె, ఫిబ్రవరి 9: సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా పోరాటం చేస్తుంటే ఎక్కడకక్కడ నిర్బంధించి పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని ఆశాలు నిరసన తెలిపారు. అల్పెండోజోలమ్ మాత్రల పంపిణీ విధులకు గైర్హాజరయ్యారు. విధులు బహిష్కరించి రేపల్లె ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ఆశాలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తుంటే పోలీసులు అరెస్టు దారుణమన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఆశా వర్కర్ల చేత వెట్టిచాకిరి చేయిస్తూ వారికి కనీస వేతనం ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. తక్షణమే కనీస జీతం మంజూరు చెయ్యకుంటే రానున్న ఎన్నికల్లో జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పావని, కీర్తి, మల్లేశ్వరి, ఎస్తేరురాణి, జస్మిత, రజని పాల్గొన్నారు.



రూ.20 లక్షలతో చికిత్సలట!

- నివ్వెరపోతున్న ఆరోగ్య శ్రీ లబ్ధిదారులు
- చికిత్సలు చేయించుకోకున్నా యాప్‌లో డిస్‌ప్లే
- ఆరోగ్యశ్రీ యాప్‌లో ఫ్యామిలీ వివరాలు తప్పుల తడక
- యాప్‌లో సమస్యా లేదంటే ఇదేమైనా కుంభకోణమా?
- లబ్ధిదారుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్న అధికారులు

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆస్పతికి వెళ్లలేదు.. ఎటువంటి వైద్య చికిత్సలు చేయించుకోలేదు.. అయినా ఇప్పటికే రూ.20లక్షలు వినియోగించేశారు.. ఇక మీకు మిగిలింది రూ.5లక్షలే.. అని ఆరోగ్య శ్రీ యాప్‌లో చూపు తున్న వివరాలతో లబ్ధిదారులు విస్తుపోతున్నారు. అయితే అం దుకు సంబంధించి ఎలాంటి హెల్త్ రికార్డులను యాప్‌లో చూ పించడం లేదు. దీనిపై కింది స్థాయి సిబ్బందిని వాకబు చేస్తే మీరు ఆరోగ్యశ్రీ కార్డుని వినియోగించి వైద్యచికిత్స చేయించుకుని ఉంటారని చెబుతున్నారు. తాము ఒక్క రూపాయి వైద్యం కూడా ఆరోగ్యశ్రీ కింద చేయించుకో లేదని లబ్ధిదారులు చెబుతున్నా సిబ్బంది ఆ లకించడం లేదు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా అధికారులు కూడా దీనిపై సమాధానం చెప్పలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో యాప్‌లో సాంకేతిక సమస్య లేదంటే తమ పేరుతో జరిగిన పెద్ద కుంభకోణమా అన్న అనుమానాలు లబ్ధిదారుల నుంచి వస్తున్నాయి. గత కొద్ది రోజుల నుంచి ఏఎన్ఎంలు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి స్మార్ట్‌ఫోన్లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. అనంతరం తమ ఫోన్‌లో ఆరోగ్య శ్రీ యాప్ లాగిన్ అయి వివరాలు చూస్తూనే లబ్ధిదారులకు కళ్లు తిరిగినంత పని అవుతున్నది. ఇందుకు కారణం మొత్తం క్రెడిట్ రూ.25 లక్షల్లో రూ.20 లక్షలు ఇప్పటికే వినియోగించేసినట్లుగా చూపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలను పెంచడంతో పాటు ప్రతీ కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకునే సదుపాయాన్ని కల్పించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆరోగ్యశ్రీ కార్డులను వలం టీర్ల ద్వారా పంపిణీ చేయించారు. ఎవరికైతే కార్డుల పంపిణీ జరిగిందో వారి ఇళ్లకు వలం టీర్లు/ఏఎన్ఎంలు వెళ్లి మీ ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని ఆధార్ వినియోగించి లాగిన్ కావాల్సిందిగా కోరుతున్నారు. అయితే యాప్‌లో చూపుతున్న తమ కుటుంబ హెల్త్ రికార్డులు చూసుకుని విస్తుబోతున్నారు. ఇందుకు కారణం ఇప్పటికే వైద్యం కోసం రూ.20 లక్షలు వినియోగించేశారని, ఇక కేవలం రూ.5 లక్షల వరకు మాత్రమే వైద్య చికిత్సల కోసం క్రెడిట్ మీ అకౌంట్‌లో అందుబాటులో ఉందని డిస్‌ప్లే అవుతున్నది. దీనిపై ఏ ఒక్కరూ తగిన సమాధానం చెప్పడం లేదు. కొందరు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా అధికారులను సంప్రదించి ఈ విషయం వారి దృష్టికి తీసు కెళ్లగా సాంకేతిక సమస్య వల్ల అలా కనిపిస్తున్నది.. దీనిపై తాము కుస్తీ పడుతున్నామంటున్నారు. కాగా ఇప్పుడు ఆ కార్డు తీసుకుని ఎవరైనా రూ. 10 లక్షలకు పైగా వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి వెళితే సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు.



వైద్యానికి రూపాయి వినియోగించకపోయినా రూ.20 లక్షలు వినియోగించినట్లు చూపుతున్న ఆరోగ్యశ్రీ యాప్‌లోని హెల్త్ రికార్డు

ట్రెజరీలో ఆంక్షలు

జీతాలు మినహా అన్ని రకాల బిల్లులు నిలిపివేత

అప్‌లోడ్ చేసేందుకే పరిమితం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9 : జిల్లాలో అన్నిరకాల బిల్లులపై ఆంక్షలు వచ్చిపడ్డాయి. మార్చి నెల రాకముందే ప్రభుత్వం ట్రెజరీల్లో బిల్లులు మంజూరు చేయకుండా ఆపేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ట్రెజరీల ద్వారా ఉద్యోగుల జీతాలు, అద్దె వాహనాల బిల్లులు మినహా ఇతర అన్నిరకాల బిల్లులపై ప్రభుత్వం ఆంక్షలు విధించినట్లు సమాచారం. కొన్నిరకాల బిల్లులు ట్రెజరీ నుంచి అప్‌లోడ్ అవుతున్నా బ్యాంకుల్లో నగదు మాత్రం జమ కావడం లేదు. గత నాలుగైదు రోజుల నుంచి ఉద్యోగుల జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, అద్దె వాహనాల బడ్జెట్ మినహా ఇతర అన్ని రకాల బిల్లులు మొత్తం నిలుపుదల చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ బిల్లులు మొత్తం ఆపేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రతినెల రెండవ వారం నుంచి కార్యాలయాలకు సంబంధించిన మెయింటినెన్స్ బిల్లులు ట్రెజరీ ఆఫీసులకు వెళ్తుంటాయి. అయితే ఈసారి 5వతేదీ నుంచే ఆ బిల్లులపై ఆంక్షలు రావడంతో ఒక్కటి కూడా అప్‌లోడ్ చేయడం లేదు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి విద్యుత్, టెలిఫోన్, నెట్, కార్యాలయాలకు అవసరమైన వైట్‌పేపర్లు ఇతర సామగ్రి తదితర అన్నిరకాల బిల్లులను నిలిపివేశారు. సాధారణంగా మార్చి ఆఖరులో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆంక్షలను ప్రభుత్వం ప్రతి ఏటా పెడుతుంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి మొదటివారంలోనే ట్రెజరీకి తాళాలు వేయడంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

రికార్డులు, రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

చినగంజాం, ఫిబ్రవరి 9: ఫీల్డ్ అసిస్టెంట్‌లు రికార్డులు, రిజిస్టర్లు పక్కాగా నిర్వహించకపోతే తగు చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ బి.అర్జునరావు హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో 2022-2023 సంవత్సరంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో యాటి. వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పీడీ మాట్లాడుతూ మస్టర్లు తప్పులు లేకుండా ఉండాలని సూచించారు. జాబు కార్డులు సక్రమంగా నమోదు చేయకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినెల మూడవ బుధవారం రికార్డుల పరిశీలన చేయాలని ఎంపీడీవోకి సూచించారు. పలు గ్రామాల్లో సామాజిక తనిఖీలో గుర్తించిన పలు లోపాలైన కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించకపోవడం, సంతకాలు లేకుండా బిల్లు ఇవ్వడం తదితర విషయాలను డీఆర్‌పీలు సభలో చదివి వినిపించారు. చినగంజాం మండలంలో 1037 పనులకు రూ.10.11 కోట్లు ఖర్చు చేసినట్లు అర్జునరావు తెలిపారు. సామాజిక తనిఖీలో గుర్తించిన లోపాల ఆధారంగా అవకతవలకు పాల్పడిన వారిపై చర్యలు ఉంటామని పీడీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి, మోటుపల్లి ఎంపీటీసీ కె.గోవిందు, ఈవోపీఆర్డీ ఎన్‌వీ గోపాల కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, డీవీవో శోభన్‌బాబు, ఎస్ఆర్‌పీ విజయభాస్కర్, ఏపీవో గోలి లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

చినగంజాం, ఫిబ్రవరి 9: పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని గ్రామదర్శిని ప్రత్యేకాధికారి ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసరావు అన్నారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, సోపిరాల అంగన్‌వాడీ కేంద్రం, చినగంజాంలోని లేఅవుట్, రామకోటేశ్వర కాలనీలోని సబ్ సెంటర్, చిగనంజాం గ్రామ పంచాయతీ కార్యాలయం, కార్యాలయ ఆవరణలోని వాటర్ హెడ్ ట్యాంక్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. కేజీబీవీలోని మరుగుదొడ్లు, వంటగది, ల్యాబ్‌లను ప్రత్యేకాధికారి పరిశీలించారు. గణితం, ఇంగ్లీషులో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, సర్పంచ్ రాయని ఆత్మారావు, ఎంపీడీవో యాటి.వరప్రసాద్, ఎంఈవో అజయ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

భరతమాత ముద్దుబిడ్డలకు సముచిత గౌరవం

పర్చూరు, ఫిబ్రవరి 9: భరతమాత ముద్దుబిడ్డలు, మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చరణ్‌సింగ్, వ్యవసాయ రంగ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు సముచిత గౌవరం లభించిందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం వారికి భారతరత్న పురస్కారాలు ప్రకటించడం పట్ల ఏలూరి హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక సంస్కరణలతో పీవీ దేశానికి దశ, దిశ చూపారన్నారు. రైతుల సంక్షేమానికి కృషిచేసిన మహోన్నత వ్యక్తి చరణ్ సింగ్ అని అన్నారు. భూసంస్కరణలకు పాటుపడిన రైతు నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్వామినాథన్ సాగులో దిగుబడులు పెంచేందుకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వీరితోపాటు తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు నందమూరి తారక రామారావుకి భారతరత్న పురస్కారాన్ని అందించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు.

పురందరదాసుల ఆరాధన ఉత్సవాలు




పురందరదాసుల విగ్రహం వద్ద సాహితీసంస్థల ప్రతినిధులు

అద్దంకి, ఫిబ్రవరి 9: కన్నడ పద కవితా పితామహుడు పురందరదాసుల ఆరాధన కార్యక్రమాలు తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు, శ్రీదాస భారతీయ జానపద కళాక్షేత్రం ఆద్వర్యంలో శుక్రవారం అద్దంకిలో జరిగాయి. ఈసందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న పురందరదాసుల విగ్రహానికి పలు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌జేడీ దేవపాలన, శ్రీదాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, పలు సాహితీ సంస్థల ప్రతినిధులు వారణాసి రఘురామశర్మ, అన్నమనేని వెంకటరావు, మాదాల దానయ్య, గాడేపల్లి దివాకర్‌దత్, జ్యోతి రమేష్, అనంతారెడ్డి, జాష్టి వెంకటేశ్వర్లు, తాళ్ళూరి బాబురావు, చెన్నుపాటి రామాంజనేయులు, చప్పిడి శ్రీనివాసరావు, రమేష్, మస్తాన్‌రావు, అంజాద్‌బాషా, పూటుకూరు ఉమాఅన్నపూర్ణ, వరలక్ష్మి, చిన్ని సుజాత పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలి

● ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మొక్కలు నాటుతున్న హేమచంద్రారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9: పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని ఏపీ విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైన మూడు రోజుల జాతీయస్థాయి సెమినార్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఆయన మొక్కలు నాటారు. అనంతరం యూనివర్శిటీలో వీసీ మారెడ్డి అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఓజోన్ పొర దెబ్బతింటున్న నేపథ్యంలో మానవాళి మనుగడకు ఇబ్బందికరంగా మారిందని, ఈ పరిస్థితులను అధికమించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు ఎన్ఎస్ఎస్ విభాగం కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమోహన్, నిర్మలామణి, పాలకమండలి సభ్యులు కళ్యాణి, కొనిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కేవీఎస్.రాజు నాల్గొన్నారు.

వైసీపీ సరికొత్త నాటకం

రాజ్యసభ ఓట్ల కోసం ఎమ్మెల్యేలను మభ్యపెడుతున్న వైనం

పోటీ చేయం, స్థానం మారం అన్నా ఒప్పించడంలో అదే లక్ష్యం

నూతన ఇన్‌చార్జిలను నియమించిన చోటా ఎమ్మెల్యేలకు సరికొత్త ఆశలు

కొత్తగా వచ్చిన వారు ఉండొచ్చు.. మారొచ్చు అంటూ సంకేతాలు

సర్వేల ప్రకారం నిర్ణయమంటూ ప్రచారం



వైసీపీ జిల్లా కార్యాలయం

> అధికార వైసీపీలో సరికొత్త జగన్నాటకం ఆరంభమైంది. ఎడాపెడా ఎమ్మెల్యేలను తొలగించి కొత్త ఇన్‌చార్జిలను నియమించడం, కావాలనుకున్న ఎమ్మెల్యేలను వారికి ఇష్టం ఉన్నా లేకున్నా వేరే నియోజకవర్గాలకు బదిలీ చేయడాన్ని కొనసాగించిన ఆపార్టీ అధిష్ఠానం తాజాగా ఆ అంశాలలో వెనకడుగు వేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలు పలువురు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడం, కొన్నిచోట్ల ప్రతిపక్ష టీడీపీలో చేరడం జరుగుతోంది. జిల్లాలోనూ ఎంపీ మాగుంటతోపాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా టీడీపీకి టచ్‌లో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత నాలుగైదు రోజుల నుంచి అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను మీకు ఇంకా అవకాశం ఉందంటూ వైసీపీ రాష్ట్రస్థాయి ముఖ్యనేతలు మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రం నుంచి ముగ్గురిని రాజ్యసభ సభ్యులుగా ఎన్నుకునేందుకు ఈనెల 27న ఎన్నిక జరగనుంది. ఎమ్మెల్యేలే వారిని ఎన్నుకోవాల్సి ఉంది. ప్రతిపక్ష టీడీపీకి ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారమైతే మూడు రాజ్యసభ స్థానాలనూ వైసీపీ సులువుగా చేజిక్కించుకుంటుంది. కానీ గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవం ఆపార్టీని వెంటాడుతోంది. జిల్లాకు చెందిన వైవీ సుబ్బారెడ్డిని కూడా రాజ్యసభ ఎన్నికల బరిలోకి వైసీపీ దింపుతోంది. మరోవైపు టీడీపీలోకి ఇప్పటికే కొన్ని జిల్లాలలో ఎమ్మెల్యేలు చేరిపోవడంతోపాటు మరికొందరు ఆపార్టీకి టచ్‌లో ఉన్నారు. మన జిల్లాలో కూడా అలాంటి పరిస్థితే ఉంది. ఈనేపథ్యంలో రాజ్యసభ ఎన్నికల నాటికి వైసీపీ ఎమ్మెల్యేలు చేజారితే కనీసం ఒక స్థానం నుంచైనా ఆపార్టీ అభ్యర్థి ఓడిపోయే ప్రమాదం ఉంది. ఇంకోవైపు టీడీపీ కూడా మారిన పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థులను రంగంలోకి దించనుంది. ఈనేపథ్యంలో జిల్లాలో టికెట్లు లేవు పొమ్మన్న ఆపార్టీ ఎమ్మెల్యేలను, వారికి ఇష్టం లేకుండా నియోజకవర్గాలు మార్చిన వారిని మైమరిపించే ప్రయత్నాన్ని వైసీపీ అధిష్ఠానం చేస్తోంది.

ఇంకా అవకాశం ఉందంటూ సంకేతాలు

ప్రధానంగా వైసీపీ ఎమ్మెల్యేల స్థానంలో వేరేవారిని ఇన్‌ఛార్జిలుగా నియమించిన నియోజకవర్గాల్లో తిరిగి మీకే అవకాశం రావచ్చంటూ ఆ ఎమ్మెల్యేలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కాదు కూడదంటే వేరేస్థానం అయినా ఇస్తాం అని చెప్తున్నారు. ఇప్పటికే సంతనూతలపాడు, కనిగిరి, దర్శి ఎమ్మెల్యేలు సుధాకర్‌బాబు, మధుసూదన్, వేణుగోపాల్‌లు తప్పించి అక్కడ వేరే వారిని ఇన్‌చార్జిలుగా నియమించారు. ప్రస్తుతం ఆ ముగ్గురికీ వివిధ రకాల ఆశలు చూపిస్తున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు విషయంలో మాత్రం కొంత కఠినంగా ఉన్నప్పటికీ మీకు చాలా భవిష్యత్తు ఉంది. రాష్ట్ర పార్టీలో మీకు పదవులు రావచ్చని ఆశ పెట్టినట్లు తెలిసింది. టీడీపీలో చేరే యోచనలో ఉన్న ఎంపీ మాగుంటను కలిసిన తర్వాత సుధాకర్‌బాబుకు అధిష్ఠానంలోని కొందరు నాయకులు టచ్‌లోకి వచ్చినట్లు సమాచారం. ఇక దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను అయితే ఒంగోలు లేక పర్చూరు ఎమ్మెల్యేగా పోటీచేయాలని సూచిస్తున్నారు. ఇక అన్ని అవకాశాలూ సన్నగిల్లాయనుకున్న నేపథ్యంలో ఆయన్ను మంగళవారం మరోసారి పిలిపించుకుని మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే. మీరు పర్చూరు నుంచి పోటీచేయండని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ విషయంలోనూ ఇదే తంతు నడుస్తోంది. రోజు మార్చి రోజు సీఎంవోలోని అధికారులు లేక అధిష్ఠానంలోని కొందరు నాయకులు ఆయనన్ను పిలిపించి మాట్లాడుతున్నారు. కందుకూరు నియోజకవర్గం వెళ్తే బాగుంటుందని ఆశ చూపగా ఆయన ససేమిరా అనడంతో తాజా సర్వే ఫలితం కొత్త ఇన్‌చార్జికి సానుకూలంగా రాకపోతే తిరిగి మీకే అవకాశం రావచ్చంటూ ఆశపెట్టి నిలబెట్టినట్లు తెలుస్తోంది. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి విషయంలోనూ వైసీపీ అధిష్ఠానం అదేరకమైన తంతును నడుపుతోంది. ఆయనకు మీకు అవకాశం లేదని సూటిగా చెప్పనప్పటికీ బీసీ వర్గానికి అవకాశం ఇస్తామంటూ ఆవర్గం వారితో చర్చలు జరుపుతోంది. ప్రస్తుతం రాజ్యసభ ఓట్ల భయం పట్టుకోవడంతో అక్కడ అభ్యర్థి అంశాన్ని తేల్చకుండా పక్కనపెట్టినట్లు భావిస్తున్నారు.

ఇటు, అటు మార్పుల్లో ఆంతర్యం కూడా అదే

గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తాను పోటీచేయనని ప్రకటించినా అవకాశం ఇవ్వడంలోని ఆంతర్యం కూడా ఇదేనని భావిస్తున్నారు. ఆయన ప్రకటన చేసిన కొద్దిరోజులకే పిలిచి మాట్లాడినప్పుడు నిర్ణయంపై పునరాలోచించుకోవాలని జగన్ సూచించలేదన్న విషయం రాంబాబు అనుచరులే బహిరంగంగా చెప్పుకున్నారు. మార్కాపురం నుంచి జంకెను పిలిచి పోటీకి సిద్ధం కావాలని చెప్పిన అధిష్ఠానం.. రాజ్యసభ ఓట్ల భయంతో వెనక్కు తగ్గి నాలుగు రోజుల్లోనే ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని పిలిచి మీరే అభ్యర్థి అని చెప్పింది. మరో నాలుగురోజులకే అదే నాగార్జునరెడ్డిని పిలిచి గిద్దలూరు వెళ్లాలని సూచించింది. ఆయన ససేమిరా అనడంతో సీఎం నేరుగా రంగంలోకి వచ్చి అసలు ఎన్నికల్లో పోటీచేయనన్న రాంబాబును మార్కాపురంనకు, నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు ఒప్పించినట్లు సమాచారం. ఆ ఇద్దరినీ ఖాళీగా ఉంచితే రాజ్యసభ ఎన్నికల పోలింగ్ నాటికి ఎలా ఉంటుందోనన్న అనుమానంతోనే అలా చేశారని ప్రచారం జరుగుతోంది.

చీరాలలోనూ అదే తంతు

పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ చీరాలలో అనుయాయులతో సమావేశమై వైసీపీ అభ్యర్థిగా ప్రకటించిన కరణం వెంకటేష్‌కు మద్దతివ్వాల్సిన అవసరం లేదని స్పష్టంచేయటంతోపాటు తానే రంగంలోకి రావచ్చన్న సంకేతం ఇచ్చారు. కాకుంటే 2014లో మాదిరి స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలోకి దిగుతానన్న సంకేతాన్ని పంపారు. మామూలుగా అయితే అలాంటి వారిపై వెంటనే క్రమ శిక్షణ చర్యలు తీసుకునే జగన్ ఆయన్ను పిలిచి మాట్లాడారే తప్ప చర్యల జోలికి వెళ్లలేదు. అదేసమయంలో ఆమంచి ఇన్‌చార్జిగా ఉన్న పర్చూరు నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికోసం అన్వేషిస్తున్నారు. ఇదే రాజకీయ నేతల్లో చర్చనీయాంశమైంది.

బాలినేని విషయంలోనూ మౌనం

పార్టీ సీనియర్ నాయకుడైన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా ఎంపీ అభ్యర్థి విషయంలో తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు. తనను కలిసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో దురుసుగా కూడా మాట్లాడారు. అయినా జగన్ నుంచి మౌనమే సమాధానమైంది. వీటన్నింటికీ జగన్ రాజ్యసభ ఎన్నికల తర్వాతే తనదైన శైలిలో బదులిస్తారని అప్పటివరకు ఆ మైమరపు వ్యవహారాలు కొనసాగుతాయనేది తలపండిన రాజకీయ విశ్లేషకుల అంచనా.

మెప్మాలో మల్లగుల్లాలు..!

బోగస్ గ్రూపుల రుణ దోపిడీపై కొనసాగుతున్న విచారణ

ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అక్రమాలు

ఓ సీఓకు స్కూటీని బహుమతిగా ఇచ్చిన ఆర్పీ

తప్పించుకునే మార్గంలో వైసీపీ నాయకులు, ఆర్పీలు



మెప్మా కార్యాలయం

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 9 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో బోగస్ పొదుపు గ్రూపుల కుంభకోణంపై కలవరం మొదలైంది. ఈ వ్యవహారం నుంచి ఏ విధంగా బయటపడాలో అర్థం కాక అందరూ మల్లగుల్లాలు పెడుతున్నారు. కోట్లు దండుకుని దర్జాగా సొంతానికి వాడుకున్న వారిని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మూడు రోజులుగా ఆంధ్రజ్యోతి మెప్మాలో అవినీతిపై వరుస కథనాలు ప్రచురించగా, దీనిపై అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఆర్పీల వారీగా, వారి పరిధిలోని పొదుపు గ్రూపులు ఎన్ని? ఎన్ని లక్షల రుణాలు మంజూరు చేశారు, నెలవారీగా సక్రమంగా చెల్లింపులు ఏ విధంగా ఉన్నాయి, వాస్తవ పొదుపు సంఘాలు ఎన్ని? అని ఆరా తీస్తున్నారు. గ్రూపుల వారీగా జాబితా సిద్ధం చేసి, పీడీతోపాటు, సీఎంఎం, సీఓలు విచారణ చేపట్టారు. ఇప్పటికే మేయర్ గంగాడ సుజాత వెల్లడించినట్లుగా ప్రాథమికంగా రూ.12కోట్లు ఉన్నట్లు తెలుస్తుండగా, పూర్తిస్థాయి విచారణ జరిగితే మొత్తం రూ.30 కోట్లు నుంచి రూ.40 కోట్లు వరకు దోపిడీ లెక్కలు తేలే అవకాశం కనిపిస్తోంది.

దొరకకుండా ఉండేందుకు ప్రయత్నాలు

ఇదిలా ఉంచితే ఇందులో భాగస్వాములైన కొందరు ద్వితీయశ్రేణి వైసీపీ నాయకులు, అలాగే అధికార పార్టీకి చెందిన ఆర్పీలు ఈ అవినీతి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో అడ్డదారులు వెతుకుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా కొందరు ఆర్పీలు అయితే హడావుడిగా పొదుపు గ్రూపులతో సమావేశాలు ఏర్పాటు చేసి, తాము అవినీతికి పాల్పడ లేదని, కొన్ని కారణాలతో రుణాలు తీసుకున్నామని, అధికారులు ఎవరైనా విచారణకు వచ్చి అడిగితే సభ్యులు తామే తీసుకున్నామని బతిమలాడుకునే పనిలో ఉన్నారు. మొత్తంగా ఆంధ్రజ్యోతి కథనంతో నాలుగు రోజులుగా మెప్మాలో అలజడి కనిపిస్తుండగా, అధికారులు, ఉద్యోగులు తమ పేర్లు బయటకు వస్తాయేమో అని వణికిపోతున్నారు. దీంతో రెండు రోజులుగా కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం మానేసిన సీఓలు, ఇతర ఉద్యోగులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ అవినీతిపై విచారణ చేస్తున్నారు.

అక్రమాలు కోకొల్లలు

ఇప్పటికే ఓ కార్పొరేటర్ భర్త రుణదోపిడీ స్కాంలో భాగస్వాముడిగా ఉన్నట్లు తెలుస్తోంది. నగర వైసీపీలో హడావుడిగా కనిపించే ఓ ద్వితీయ శ్రేణి నాయకుడు, మహిళా కార్పొరేటర్ భర్త కూడా చేతివాటం చూపినట్లు వెలుగుచూసింది. అలాగే వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలు చూసే ఓ వ్యక్తి తన సిఫారసుతో ఒకరిని ఆర్పీగా నియమించగా, ఆమె పరిధిలో ఒక్క పొదుపు గ్రూపు కూడా లేదని సమాచారం. అయితే ఆమె నేటికీ ఆర్పీగా కొనసాగుతూ జీతం పొందడటమే కాకుండా బోగస్ రుణాల వ్యవహారంలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అసలు గ్రూపుల్లో నుంచి ఇద్దరిద్దరి పేర్లు సేకరించి వేరుగా మరో నకిలీ గ్రూపు సృష్టించి లక్షలు దండుకున్న ఆర్పీలు, తమ పలుకుబడిని ఉపయోగించి, తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు. అలాగే ఒకే పొదుపు గ్రూపు పేరుతో నాలుగైదు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఆర్పీలు పంచుకున్నట్లుగా తెలిసింది.

అవినీతిలో సీఓలేమి తక్కువ కాదు..!

బోగస్ రుణ దోపిడీ దందాలో కొందరు ఆర్పీలు మాత్రమే ఉన్నట్లు అందరూ అనుకున్నారు. అయితే తాజా విచారణలో కొందరు సీఓలు, ఇతర ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. నగర పరిధిలో 4,500లకు పైగా పొదుపు గ్రూపులు ఉండగా, వారిపై 175 మంది ఆర్పీలు, 11 మంది సీఓలు, ఒక సీఎంఎం, ఇతర ఉద్యోగులు ఉన్నారు. అయితే రుణాల పేరుతో భారీగా అవినీతికి పాల్పడిన వారిలో నలభై మంది వరకు ఆర్పీలు, నలుగురైదుగురు సీఓలు ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు ఆర్పీలు విచారణ జరుగుతుందని తెలియడంతో పొదుపు సభ్యులను బతిమలాడుకునే పనిలో ఉండగా, మరి కొందరు ఆ స్కాంలో తాను లేనని, తనను అనుమానించవద్దంటూ గ్రూపు సభ్యులకు మెస్సేజ్‌లు పెట్టడం విశేషం. అయితే కుంభకోణంలో కొందరు సీవోల భాగస్వామ్యం కూడా ఉందని, ఈ వ్యవహారమంతా వారికి తెలిసే జరిగిందని, ఇందులో వారి సంతకాలు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఇటీవల ఓ ఆర్పీ తనపై అధికారిగా ఉన్న సీఓకు కొత్త స్కూటీ కొనుగోలు చేసి బహుమతిగా అందించినట్లు సమాచారం. మొత్తంగా మెప్మాలో కొనసాగుతున్న విచారణలో అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

బ్యాంకుల వద్దకు వైసీపీ నాయకుల పరుగులు

పొదుపు రుణాల పేరుతో బ్యాంకులను బురిడీ కొట్టించిన వైసీపీ నేతలు తమ పలుకుబడితో మరికొన్ని బ్యాంకుల్లో భారీగా రుణాలు పొందినట్లు సమాచారం. వీరు నేరుగా తీసుకోకుండా అధికార దర్పంతో మెప్మాలో ఉద్యోగుల పేరుతో దండుకున్నారు. మరికొందరు రెండు, మూడు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లు సమాచారం. వరుస కథనాలతో కలవరపడిన కొందరు వైసీపీ నాయకులు ఉరుకులు పరుగులు పెడుతూ తమ తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. మొత్తంగా మెప్మాలో జరిగిన అవినీతి రోజురోజుకు పెరుగుతోంది.

మహీధర్ రిటర్న్ గిఫ్ట్

ఆగిపోయిన పోర్టు పనులు

నిన్న నిర్వాసితులతో కలిసి ధర్నా..

సోమవారం నుంచి దీక్షలకు నిర్ణయం

వైసీపీ అధిష్ఠానంలో కలకలం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కొన్ని గంటల వ్యవధిలోనే రిటర్న్ గిఫ్ట ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వటం లేదని చెప్పిన వెంటనే ఆయన ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరుకు దిగారు. అంతేకాక ఎంపీ విజయసాయిరెడ్డి సమీప బంధువుల సంస్థ చేస్తున్న పోర్టు పనులను అడ్డుకున్నారు. అంతటితో ఆగక ప్రజల పక్షాన సోమవారం నుంచి దీక్షలు చేస్తానని కూడా ప్రకటించారు. దీంతో యావత్తు యంత్రాంగం హడలిపోగా ఆ పార్టీ అధిష్ఠానంలో కలకలం మొదలైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు ఎమ్మెల్యేగా ఉన్న మహీధర్‌రెడ్డిని తప్పించి తిరుపతి జిల్లాకు చెందిన బీసీ మహిళకు అవకాశం ఇచ్చారు. గురువారం మధ్యాహ్నం ఆ విషయం సీఎం చెప్పగా సాయంత్రం ఆరు గంటలకల్లా నియోజకవర్గంలోని రామాయపట్నం వద్ద జరుగుతున్న పోర్టు నిర్మాణ పనుల వద్దకు మహీధర్‌రెడ్డి చేరారు. అక్కడ నిర్వాసిత గ్రామాల ప్రజల ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అంతేకాక పోర్టు నిర్మాణ పనులు నిర్వహిస్తున్న అరబిందో ఇన్‌ఫ్రా ప్రతినిధులను బయటకు పంపి కార్యాలయానికి తాళాలు వేయించారు. తిరిగి శుక్రవారం సాయంత్రం ఆయన అక్కడకు వెళ్లగా చాటుమాటుగా పనులు నిర్వహిస్తున్నారని స్థానికులు చెప్పారు. 'సముద్రం లోపల పనులు చేస్తున్న వారికి ఆహార పానీయాలు అందకుండా అడ్డుకుంటే వాళ్లే తిరిగి వస్తారు. రేపు ఆ పని చేయండి మీకు ఎవరైనా ఇబ్బంది కల్గిస్తే నేనున్నా' అంటూ ఆందోళన చేస్తున్న నిర్వాసిత గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. అంతేకాక ఆందోళన తీవ్రతలో భాగంగా అనుకున్న ప్రకారం నిరాహార దీక్షలు ప్రారంభించాలని సూచించారు. సమస్యను పరిష్కరించకపోతే సోమవారం తాను దీక్షలో కూర్చుని మద్దతు ఇస్తానని వెల్లడించారు. దీంతో అక్కడ ప్రజలు చేస్తున్న ఆందోళనకు బలం పెరగ్గా పోర్టు నిర్మాణ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. నిర్వాసిత గ్రామాల్లో కర్లపాలెం గ్రామస్థుల నివాసాలకు ప్రత్యామ్నాయ స్థల సేకరణ జరగకపోగా వారికిచ్చే నష్టపరిహారం అంచనా వేయలేదు. ఇతర గ్రామాల్లోను కొన్ని సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలపై స్థానికులు అనేక సందర్భాల్లో తమ నిరసన వ్యక్తం చేశారు. కర్లపాలెం గ్రామస్థులు అయితే గత నాలుగు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. వారి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేగా మహీధర్‌రెడ్డి ప్రయత్నించారే తప్పా బహిరంగంగా ఏనాడు ఆందోళనకు మద్దతు ఇవ్వలేదు. గురువారం సీఎం జగన్‌టికెట్ లేదని చెప్పటం ఆ తర్వాత కొన్నిగంటలకే పోర్టు నిర్వాసితుల ఆందోళనలో పాల్గొని సీరియస్‌గా వ్యవహారం నడపటం విశేషం. అందుకే సీఎంకి ఈ రూపంలో వెంటనే రిటర్న్ గిఫ్ట ఇచ్చారంటూ రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా మహీధర్‌రెడ్డి వ్యవహారం వైసీపీ అధినాయకులో కలకలం సృష్టిస్తోంది. ఒకవైపు ఉమ్మడి జిల్లాలోని అద్దంకిలో జగన్ నిర్ణయించిన ఇన్‌చార్జి హనిమిరెడ్డితో కలిసి తిరగలేదనే సాకుతో మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య క్వారీని తనిఖీల పేరుతో మూసివేయించారు. ఇటుచూస్తే మహీధర్‌రెడ్డిపై పనులు అడ్డగించారనే పేరుతో కేసులు నమోదు చేయవచ్చనే ప్రచారం ఉంది. కాగా ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత జగన్ రియాక్షన్ ఎలా ఉంటుందనే అంశం చర్చనీయాంశమైంది.

ధాన్యం, బియ్యం స్టాక్ వివరాలు వెల్లడించాలి

● డీఎస్‌వో ఉదయభాస్కర్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని బియ్యం ట్రేడర్స్, హోల్‌సెల్లర్స్, రిటైలర్స్, మిల్లర్లు తమ దగ్గర ఉన్న ధాన్యం, బియ్యం స్టాక్ వివరాలను నిర్దేశిత పోర్టల్‌లో వారం రోజుల్లో నమోదు చేయాలని డీఎస్‌వో ఉదయభాస్కర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం సంబంధిత ట్రేడర్ల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం, ధాన్యం నిల్వల స్థితిని బ్రోకెన్ రైస్, నాన్ బాస్మతి బియ్యం, పారాబాయిల్డ్ బియ్యం, బాస్మతి రైస్, ధాన్యం వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయని పక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలపై అవగాహన పెంపొందించుకొని బియ్యం వ్యాపారులు అమ్మకం, నిల్వలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్టాక్ నమోదు లేనిపక్షంలో చర్యలు ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో క్షేత్ర స్థాయిలో విస్తృతంగా తనిఖీలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సహాయ పౌరసరఫరాల అధికారి పి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండలో దశ సహస్ర కదళీఫలార్చన


ప్రసన్నాంజనేయస్వామికి అరటిపండ్లతో చేసిన పూజ

అద్దంకి, ఫిబ్రవరి 9: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం దశ సహస్ర కదళీఫలార్చన నిర్వహించారు. సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అభిషేకం నిర్వహించారు. 11 ఆవృత్తములుగా వేదపండితులు, అ ర్చకులు పదివేల అరటిపండ్లతో పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన శ్రీన్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించొద్దు!

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 9: పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే సౌకర్యాలు, వసతులు సక్రమంగా అందేలా చూడాలని జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ఇ.తమ్మాజీరావు అన్నారు. శుక్రవారం గ్రామ దర్శిని కార్యక్రమంలో భాగంగా మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తిని చూశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎంఈవో సుధాకరరావు, హెచ్ఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ పోటీలకు నాగరాజు ఎంపిక


సిల్వర్ మెడల్‌తో నాగరాజు

చీరాలటౌన్, ఫిబ్రవరి 9: బాపట్ల జిల్లా ఎస్పీ విభాగంలో పనిచేస్తున్న చీరాలకు చెందిన సీహెచ్ నాగరాజు హైదరాబాదులో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ జాతీయస్థాయి షాట్‌పుట్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. త్వరలో ఆస్ట్రేలియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఆయన ఎంపికయ్యారు.

యద్దనపూడి ఎంపీడీవోగా శివసుబ్రమణ్యం

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 9: ఎన్నికల బదిలీలలో భాగంగా యద్దనపూడి మండలానికి నూతనంగా నియమితులైన ఎంపీడీవో, తహసీల్దార్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన పి.శివసుబ్రమణ్యం పల్నాడు జిల్లా అచ్చంపేట నుంచి బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన వై.నాగరాజు నెల్లూరు నుంచి వచ్చారు.

పారిశుధ్యంపై సిబ్బందికి శిక్షణ తరగతులు

మార్టూరు, ఫిబ్రవరి 9: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పంచాయతీ సిబ్బందికి పారిశుధ్యంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో నితిన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న సెర్ప్ సీవో బుజ్జి సిబ్బందికి అవగాహన కలిగించారు. పంచాయతీ సిబ్బంది సక్రమంగా పనిచేసేవిధంగా పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుబ్బారావు, సంస్థ కోఆర్డినేటరు బొల్లయ్య, సీవోఎస్ సతీష్, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ రన్‌వే పనులను పరిశీలించిన అధికారులు


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎయిర్‌ఫోర్స్, రెవెన్యూ అధికారులు

మేదరమెట్ల, ఫిబ్రవరి 9: కొరిశపాడు నుంచి జె.పంగులూరు మండలం రేణంగివరం వరకు విమానాలు అత్యవసరంగా దిగేందుకు జాతీయ రహదారిపై ఎమర్జెన్సీ రన్‌వేను నిర్మించారు. కొరిశపాడు సమీపంలో ఎయిర్‌ఫోర్స్ కార్యాలయాన్ని నిర్మించేందుకు గతంలో కొంత స్థలాన్ని సేకరించారు. ఆ ప్రదేశాన్ని ఎయిర్‌ఫోర్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. త్వరలో నూతన కార్యాలయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎయిర్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. రన్‌వే సమీప గ్రామాలల్లోని స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుశీల, మండల సర్వేయర్ మహేష్‌బాబు, వీఆర్‌వో నారాయణ, ఎయిర్‌ఫోర్స్ నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

గోపాలపురంలో పట్టపగలే చోరీ

అద్దంకి, ఫిబ్రవరి 9: పట్టపగలే తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గోపాలపురంలో యర్రా కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం ఇంటికి తాళంవేసి పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న సుమారు 8 సవర్ల బంగారం ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణకు గురయ్యాయి. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పర్చూరు, ఫిబ్రవరి 9: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్లు ఆశాఖ ఏడీఈ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పర్చూరు, నాగులపాలెం, నూతలపాడు, యర్రంవారిపాలెం, చింతగుంటపాలెం, పెద్దివారిపాలెం, తదితర గ్రామాలకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

చీరాల, ఫిబ్రవరి 9: స్థానిక రామకృష్ణాపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ రూ.65వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారురాలు కర్రెద్దుల శివకుమారికి అందజేశారు.

మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు కౌన్సిలర్ సల్లూరి సత్యానందం ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌లను కలసి మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో సల్లూరి దస్తగిరి, నూనె నతానియేలు, సల్లూరి ఇస్మాయిల్, దాసరి వసంతరావు, రవికుమార్, ఆనంద్, దేవయ్య, దయానందం తదితరులు ఉన్నారు.

'29లోగా రెన్యువల్ చేయించుకోవాలి'

అద్దంకి, ఫిబ్రవరి 9: అద్దంకి సర్కిల్ పరిధిలోని అద్దంకి, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు, తాళ్ళూరు, దర్శి మండలాలలోని ప్రతి దుకాణం, సంస్థ, గోడౌన్ నిర్వాహకులు ఈనెల 29లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయించుకోవాలని సహాయ కార్మిక అధికారి టి.మధుబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టకుంటే చర్యలు

బల్లికురవ, ఫిబ్రవరి 9: గ్రామాలలో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టకుంటే చర్యలు తప్పవని చీరాల డీఎల్‌పీవో హనుమంత రావు హెచ్చరించారు. శుక్రవారం గ్రామ దర్శినిలో భాగంగా మండలంలోని కొప్పెరపాలెంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలు ఎలా అమలుచేస్తున్నది సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో సేవలు అందించాలి

» కలెక్టర్ రంజిత్ బాషా


సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 9: గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది సామాజిక స్పృహతో సేవలు అందించాలని కలెక్టర్ రంజిత్‌బాషా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామదర్శిని కార్యక్రమాన్ని జిల్లా పరిధిలోని 70 గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కలెక్టర్ చీరాల మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో ఆయన విస్తృత పర్యటన చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గ్రామీణ ఆరోగ్యకేంద్రం, రైతు భరోసా కేంద్రం, జగనన్న కాలనీ, గ్రామ సచివాలయాలను పరిశీలించారు. విద్య, వైద్యం, స్థిర నివాసం, తాగునీరు వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామంలో అర్ధంతరంగా నిలిచిన తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో వంట గది లేకపోవడంతో బయట ఏజెన్సీల నుంచి విద్యార్థులకు ఆహారం తీసుకురావడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి, ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చిరంజీవిలకు చార్జ్ మెమోలు ఇవ్వాలని ఎంఈవో సుబ్రహ్మణ్యంను ఆదేశించారు.

సచివాలయంలో కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వో రాజేష్‌కు చార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు. ముగ్గురు సచివాలయ సిబ్బంది సెలవుపై ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాల సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యకేంద్రంలో ఏడాదిన్నరగా ఆరోగ్య కార్యకర్త లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, తదితరులు ఉన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ

» భారతరత్న ప్రకటించడం తెలుగు వారికి గర్వకారణం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


జాగర్లమూడివారిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పంగులూరు, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని, రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగువారికి ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని జాగర్లమూడివారి పాలెం గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పీవీకి భారతరత్న రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ తన రాజకీయ ప్రస్థానంలో ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్రంలో హోం, విదేశాంగ, రక్షణ శాఖ మంత్రిగా రాణించి ఆ పదవులకే వన్నెతెచ్చిన మహనీయులని కొనియాడారు. తన రాజనీతిజ్ఞతతో అంతర్జాతీయంగా ప్రశంసలందుకున్నారని, క్లిష్ట సమయంలో ప్రధాని పదవిని చేపట్టి ఐదు సంవత్సరాలపాటు నిరాటంకంగా పాలన కొనసాగించారన్నారు. సంస్కరణలకు ఆద్యుడిగా పీవీ పేరుగడించారన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూసంస్కరణలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. పీవీకి భారతరత్న లభించడం తెలుగువారందరికి సంతోషకరమైన రోజుగా అభివర్ణించారు.

పలు కుటుంబాలను పరామర్శించిన గొట్టిపాటి

జాగర్లమూడివారిపాలెంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న జాగర్లమూడి రామాంజనేయులు, కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న చెరుకూరి వెంకటరావు, అనారోగ్యంతో బాధపడుతున్న వాయునందనరావును పరామర్శించారు ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన అద్దంకి చందరరావు, తెలగతోటి రమణ కుటుంబాలను పరామర్శించారు. ఆయనవెంట జాగర్లమూడి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పూర్ణ, తెలగతోటి రాధ, కుక్కపల్లి ఏడుకొండలు, బాలిన రామసుబ్బారావు, కేవీ సుబ్బారావు, కేతిన సత్యనారాయణ, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

» నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ

» డీఎంహెచ్‌వో విజయమ్మ


బల్లికురవ: ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

బల్లికురవ, ఫిబ్రవరి 9: విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రభుత్వం ఉచితంగా నులి పురుగుల మాత్రలను అందజేస్తుందని జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బల్లికురవ మండలంలో ఉన్న 9 వేల మంది విద్యార్థులకు ఈ మాత్రలను అందజేస్తున్నట్టు చెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగునిల్వ లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం గ్రామదర్శిని కార్యక్రమలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె తనిఖీచేశారు. కార్యక్రమంలో గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్: నులిపురుగులు నివారణ మాత్రల ద్వారా విద్యార్థులలో రక్త హీనతను నివారించవచ్చని డాక్టర్ నవ్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శంఖవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంఈవో బి.సుధాకరరావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో పరిపూర్ణమైన ఆరోగ్యం

పేరాల(చీరాలటౌన్), ఫిబ్రవరి 9: ఆహార పదార్థాలు సేవించే సమయంలో చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా జీవిస్తారని పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ 400 మాత్రలు మింగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరునెలలకు కచ్చితంగా డి వార్మింగ్ ప్రక్రియను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ కోఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి, గుంటూరు త్రివిక్రమ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

చినగంజాం, ఫిబ్రవరి 9: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కోట కీర్తిసరోజ్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని సంతరావూరు, చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలను శుక్రవారం వైద్యసిబ్బంది పంపిణీ చేశారు. చినగంజాం పీహెచ్‌సీ పరిధిలో 4890 మంది విద్యార్థులకు మాత్రలు మింగిచ్చినట్లు వైద్యాధికారి ఎస్.విజయ్‌భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక బలోపేతానికి 'ఆసరా' చేయూత

» ఎమ్మెల్యే కరణం బలరాం


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 9: ప్రభుత్వ స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న ఆసరా సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం నాల్గో విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న బలరాం, వెంకటేష్‌రూ.8,35,36,808 చెక్కును అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హతే ఆధారంగా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న చేయూతను లబ్ధిదారులు ఎప్పటికి మర్చిపోకూడదన్నారు. ముందుగా స్వయం సహాయక సంఘాల సభ్యులు నిర్వహించిన స్టాల్స్‌ను బలరాం, వెంకటేష్ పరిశీలించారు.

కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, లేళ్ల శ్రీధర్, కుందేటి రమణ, దంతం వెంకటసుబ్బారావు, పులి వెంకటేశ్వర్లు, నల్లబోతు రాజ్‌కుమార్, పల్లపోలు శ్రీనివాసరావు, చల్లా జనార్దనరావు, కట్టా గంగయ్య, జంగిలి రామారావు, అదె కృష్ణ, మద్దులూరి సీతామహాలక్ష్మి, ఏపీఎం శ్రీనివాస రావు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల ముక్కోణపు పార్కు సెంటర్లో నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్ర హావిష్కరణకు సంబంధించి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం బలరాం చెప్పారు. శుక్రవారం ఆయన మున్సిపల్ డీఈ ఏసయ్య, ఏఈ రవిలతో కలసి జరుగుతున్న పనులను పరిశీలించారు.కార్యక్రమంలో గుంటూరు మాధవరావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, కలవకూరి యానాదిరావు, సల్లూరి సత్యానందం, గుంటూరు ప్రభాకరరావు, షేక్ హుమాయూన్ కబీర్, కట్టా రాము తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీపై ఇంటింటి ప్రచారం

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 9: వేటపాలెంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు స్థానిక నాయకులు బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాశిక వీరభద్రయ్య, కావూరి దావీదు, సున్నపు సుబ్బారావు, కావూరి సుబ్బయ్య నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ కార్యాలయం ప్రారంభం

చీరాల, ఫిబ్రవరి 9: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వసుంధర కాంప్లెక్స్‌లో శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) కార్యాలయాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు ప్రసంగిస్తూ భవిష్యత్ కార్యాచరణపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీలు తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలి

చీరాల, ఫిబ్రవరి 9: పట్టణ పరిధిలో తమ పార్టీ తరఫున మూడుచోట్ల ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను ఎవరో తొలగించారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలకు సంబంధించి సంబంధిత హోర్డింగ్ యజమానుల నుంచి తాము అనుమతి పొందామని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారించి తగిన చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

మృతదేహానికి పోస్టుమార్టం

మార్టూరు, ఫిబ్రవరి 9: మండలంలోని బొల్లాపల్లి బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన ఎస్‌కే నాగూర్‌వలి మృతదేహానికి శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని బాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అతని స్వగ్రామమైన జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి పంపించారు. ప్రమాదానికి కారణమయిన కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మేలుజాతి దూడల పెంపకం లాభదాయకం

పంగులూరు, ఫిబ్రవరి 9: కృత్రిమ గర్భధారణద్వారా పుట్టిన మేలురకం ఆడ దూడల పెంపకం పశుపోషకులకు లాభదాయకమని జిల్లా పశుగణాభివృద్ధి శాఖ కార్యనిర్వహణాధికారి డాక్టర్ కాలేషా అన్నారు. మండలంలోని రామకూరు గ్రామంలో శుక్రవారం కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన మేలు రకం ఆడ దూడలను సంరక్షిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని రైతులకు సూచించారు. మూడు నెలల పాటు నెలకు ఒకసారి నట్టల నివారణ మందు తాగించడం వల్ల దూడలు ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు.. ఈ ప్రదర్శనలో పాల్గొన్న దూడల యజమానులకు అవసరమైన మందులతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ఎం.మురళీకృష్ణ, డీఎల్‌డీఏ పశువైద్యాధికారి డాక్టర్ కృపారావు, గోపాలమిత్రలు వెంకటరావు, బాజీబాబు, శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమలను ఆదుకుంటాం!

బల్లికురవ, ఫిబ్రవరి 9: గ్రానైట్ పరిశ్రమలను ఆదుకోనేందుకు కృషి చేస్తానని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వేమవరం వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఈ మధ్యకాలంలో అధికారుల దాడులు పెరిగాయని, దీంతో పరిశ్రమలు మూత పడుతున్నాయని యజమానులు హనిమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో వైసీపీ నాయకుడు కోట శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ యజమానుల సంఘ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, జూపల్లి రాఘవరావు, గోరంట్ల వెంకటేశ్వర్లు, లేమాటి వీరాంజనేయులు పాల్గొన్నారు.

నేడు అవగాహన తరగతులు

చినగంజాం, ఫిబ్రవరి 9: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 10గంటలకు మండల పరిధిలోని నిరుద్యోగులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ వారు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అజయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన స్త్రీ, పురుషులు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పాసైనా, ఫెయిల్ అయినవారు అవగాహన తరగతులలో పాల్గొనవచ్చునని ఎంఈవో తెలిపారు. మండల పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

తహసీల్దార్‌ని సన్మానించిన వీఆర్ఏలు

చినగంజాం, ఫిబ్రవరి 9: తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఫణీంద్ర బాబుని మండల పరిధిలోని గ్రామ రెవెన్యూ సహాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. అసోసియేషన్ అధ్యక్షుడు శీలం షాలేంరాజు ఆధ్వర్యంలో సభ్యులు తహసీల్దార్‌ని శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.పాల్‌సుధాకర్, కోశాధికారి మేడికొండ శ్రీనివాసరావు, లక్ష్మీభవాని, మాణిక్యం, సుభాని, దేవయ్య, లుదీయమ్మ, నాజర్‌వలి, బాబురావు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం


చినగంజాం, ఫిబ్రవరి 9: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యశాలలో వైద్య సేవలు అందించేడమే ఆరోగ్య సురక్ష పథకం లక్ష్యమని ఎంపీడీవో యూబీ వరప్రసాద్ అన్నారు. చినగంజాం గ్రామ సచివాలయం-2 ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్, డాక్టర్ షేక్‌సలీం 314 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీఎంవోవో ఎస్.సుధాకర్ పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతేకాధికారి ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసరావు వైద్య శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి, గ్రామ కార్యదర్శి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నంబొట్లవారిపాలెంలో చోరీకి యత్నం

పర్చూరు, ఫిబ్రవరి 9: పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో చోరీ యత్నాకి ప్రయత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన దొడ్డా మహేష్ దంపతులు ఆరునెలల క్రితం అమెరికాలో ఉంటున్న కుమారుల వద్దకు వెళ్లారు. ఇంటి తాళాలను చీరాలలో ఉంటున్న తమ అత్తమామలకు అప్పగించటంతో నెలకు ఒకటి రెండు రోజులు అన్నంబొట్లవారిపాలెం వచ్చి ఇంటిని పరిశీలించి వెళుతూ ఉండేవారు. ఈనేపథ్యంలో మహేష్ ఇంటి తలుపులు తెరచిఉండటంతో అనుమానం వచ్చి సమీప నివాసం వారు బంధువులకు సమాచారం అందించారు. వారువచ్చి చూడగా ఇంటి తలుపులు పగులకొట్టి, సామనులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎలాంటి విలువైన వస్తువులు దొంగల కంట పడకపోవటంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

రేపు వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం

చీరాల, ఫిబవరి 9: వేటపాలెం మండలం రామాపురంలోని పెర్ల రిసార్ట్‌లో ఆదివారం వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కళాశాల పూర్వవిద్యార్థుల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డ ప్రతిఒక్కరూ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నిర్వాహక ప్రతినిధులు మల్లి భాస్కరరావు, కట్ట చంద్ర, వీవీవీ సుబ్బారావు, బాబు జజానంద్ తదితరులు పాల్గొన్నారు.



13న జడ్పీ అత్యవసర సమావేశం

నెల్లూరు(జడ్పీ), ఫిబ్రవరి 9: జిల్లా పరిషత్ అత్యవసర సాధారణ సమావేశం ఈనెల 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సవరణ బడ్జెట్, 2024-25 సంవత్సరపు అంచనా బడ్జెట్‌ను ఆమోదించేందుకు నిర్వహించే ఈ సమావేశం జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని, సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

8 ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి



నారాయణ ఆసుపత్రి ప్రాంగణంలో మోహరించిన పోలీసులు

మాజీ మంత్రి, టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ నివాసంలో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు కలకలం రేపాయి. శుక్రవారం సాయంత్రం 4 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. అయితే, మందుల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి ఎటువంటి బిల్లులు, మందులు లేవని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. రాజకీయ కక్షలోభాగంగానే ఈ దాడులు నిర్వహించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'నారాయణ'లో కలకలం

టీడీపీ నేత ఇంట్లో సోదాలు ● డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు ● 4 గంటలపాటు హడావుడి

చివరకు ఏమీ లేదంటూ వెనక్కి..! ● మండిపడుతున్న టీడీపీ నాయకులు ● ఇది రాజకీయ కుట్రేనని ఆగ్రహం

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి/క్రైం/వైద్యం) : డ్రగ్ కంట్రోల్ డీజీ రఘురామిరెడ్డి ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ వీరకుమార్, కావలి, నెల్లూరు, గుంటూరుకు చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటకృష్ణ, కీర్తి పవిత్ర, విజయభాస్కర్‌తోపాటు ముగ్గురు వీఆర్వోలు నారాయణ ఇంట్లో సోదాలు నిర్వహించారు. వీరికి నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డితోపాటు నగరం రూరల్ పరిధిలోని సీఐలు, స్పెషల్ పార్టీల సిబ్బంది బందోబస్తు కల్పించారు. చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆసుపత్రి ప్రాంగణం మొత్తాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందుగా తనిఖీ అధికారులు నేరుగా ఆసుపత్రి ప్రాంగణంలోని నారాయణ నివాసంలోకి వెళ్లారు. అక్కడ నారాయణ సతీమణి రమాదేవి ఉండగా ఆమెకు తాము అధికారులమని, తనిఖీలకు వచ్చామని చెప్పారు. అయితే ఏ అధికారులు, ఎందుకు తనిఖీలకు వచ్చారన్న విషయాలను మాత్రం చెప్పలేదు. నివాసంలోని అన్ని గదులు, అల్మారాలను పరిశీలించారు. కొన్నింటికి తాళాలు లేకపోవడంతో వాటిని కార్పెంటర్ల ద్వారా పగలగొట్టి తనిఖీ చేశారు. నాలుగు గంటలపాటు తనిఖీ చేసిన అధికారుల బృందం రాత్రి 8 గంటల తర్వాత వెనుదిరిగింది. ఈ సందర్భంగా పంచనామాను తయారు చేసి నారాయణ సతీమణికి అందజేశారు. అందులో నారాయణ మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో అనధికారికంగా, నిబంధనలకు విరుద్ధంగా మందుల వ్యాపారం జరుగుతోందన్న సమాచారంతో తనిఖీకి వచ్చినట్లు పేర్కొన్నారు. ముందుగా నారాయణ నివాసంలో తనిఖీలు చేశామని అక్కడ మందుల కొనుగోలు అమ్మకాలకు సంబంధించి ఎటువంటి బిల్లులు, అలానే మందులు లేవని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత నివాసానికి ఎదురుగా ఉన్న కార్యాలయంలో కూడా తనిఖీలు చేయగా అక్కడా ఎటువంటి బిల్లులు లేవని గుర్తించామని పంచనామాలో పేర్కొన్నారు. మరి ఎటువంటివి దొరకనప్పుడు ఏ సమాచారంతో అధికారులు తనిఖీలకు వచ్చారన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా కనిపిస్తోంది.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్ బలగాలు

● ఏం జరుగుతుందోనని ఉద్రిక్తత

కాగా నారాయణ నివాసంలో తనిఖీలు చేస్తున్నారన్న విషయం జిల్లాలో కలకలం రేపింది. డ్రగ్ కంట్రోల్ అధికారులతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు కూడా పాల్గొన్నట్లు ప్రచారం జరిగింది. దీంతో పెద్ద ఎత్తున టీడీపీ నేతలు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వీరిని లోపలకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కళాశాల ప్రాంగణం లోపల, బయట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా లోపల తనిఖీలు జరుగుతున్నంతసేపూ ఆసుపత్రిలోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీంతో వైద్య విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ధైర్యంగా ఎదుర్కోలేకనే..



రాజకీయంగా నారాయణను ఎదుర్కోలేక, నారాయణ విద్యాసంస్థలను దెబ్బతీయడానికే ఔషధ నియంత్రణ పేరుతో ఇలాంటి దొంగసోదాలు చేపట్టారు. ఆసుపత్రిలో ఈ తనిఖీలు చేయాల్సి ఉన్నా నివాసంలో సైతం అక్రమంగా తనిఖీలు చేశారు. సోదాల నెపంతో తలుపులు, బీరువాలు పగలగొట్టే సంస్కృతి సరికాదు. నారాయణ ఎన్నికలలో పోటీ చేస్తున్నారన్న ఉద్దేశంతోనే ఇలాంటి సోదాలు చేయడం దారుణం. ఔషధ నియంత్రణ శాఖ అధికారులను అడిగితే వారు నీళ్లు నములుతున్నారు. ఇకనైనా ఇలాంటి చర్యలు మానుకుని నారాయణను ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.

- విజయభాస్కర్ రెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం

భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది



ప్రభుత్వం నారాయణపై రాజకీయంగా కక్ష సాధింపునకు దిగుతోంది. అందులో భాగంగానే అక్రమ తనిఖీలు చేస్తున్నారు. దీనిని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. రాబోది టీడీపీ ప్రభుత్వమే. దీనిని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తున్నాం.

- కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాజకీయ కక్షలో భాగంగానే..



రాజకీయ కక్షలో భాగంగానే నారాయణ నివాసంలోకి తనిఖీలకు వచ్చారు. మీరెవరని ప్రశ్నిస్తే అప్పుడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లమని చెప్పారు. తనిఖీలు చేయాల్సింది ఆసుపత్రిలో, మెడికల్ కాలేజీలో అయితే నివాసంలో ఎందుకు తనిఖీలు చేశారు. నెల్లూరులో ఒకటో కృష్ణుడు నరసరావుపేటకు వెళ్లారు. ఇప్పుడు రెండో కృష్ణుడిని దించారు. ఆయన కూడా ఉంటారో లేదో తెలియదు. నారాయణను ఎలాగైనా పోటీ నుంచి దూరం చేయాలని ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది.

- వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, టీడీపీ నాయకుడు

నిరాహారదీక్ష చేస్తా!

- పోర్టు అధికారులకు రెండు రోజులే గడువు
- ఈలోపు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి
- తేల్చి చెప్పిన కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు/గుడ్లూరు, ఫిబ్రవరి 9 : రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామాల సమస్యలను రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరించకుంటే నిర్వాసితులతో కలిసి తాను నిరాహార దీక్ష చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హెచ్చరించారు. రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామమైన కర్లపాలెం గ్రామస్థులకు పునరావాస కాలనీ నిర్మాణం కోసం ఇంతవరకు భూ సేకరణ ప్రక్రియ చేపట్టకపోవడం, ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ పోర్టు నిర్మాణ పనులను నిలిపివేసి ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం రాత్రి పోర్టు పరిపాలనా కార్యాలయానికి తాళం వేయించి ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తిరిగి పోర్టు వద్దకు చేరుకొని ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఒక్కరోజే అధికారులకు గడువు ఇస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నుంచి నిర్వాసితులు నిరాహార దీక్ష చేస్తారని, సోమవారం నుంచి తానూ దీక్షలో పాల్గొంటానని ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు కొందరు రాత్రివేళల్లో పోర్టు నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా నిర్మాణ ప్రాంతానికి ఆహారం, మంచినీరు వెళ్లకుండా దిగ్బంధించాలని ఆదేశించారు. నిర్మాణం పనులు కొనసాగించాలంటే అవసరమైన ఆయిల్ ట్యాంకర్లు కూడా వెళ్లకుండా అడ్డగించాలని సూచించారు.



నిర్వాసితులతో కలిసి ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

● కాంట్రాక్టర్ ప్రతినిధిపై ఆగ్రహం

ఈ సందర్భంగా పోర్టు కాంట్రాక్టర్ ప్రతినిధిని పిలిపించిన ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ పద్ధతిలో మీరు వెళితే మత్స్యకారుల పద్ధతి ఎలా ఉంటుందో కూడా మీరు చూడాల్సి వస్తుంది.' అంటూ హెచ్చరించారు. మత్స్యకారుల కన్నుగప్పి పనులు చేయాలని చూస్తే లోపల ఉన్న యంత్ర పరికరాలు లాగి బయటపడేయాల్సి వస్తుందని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. నిర్వాసితుల సమస్య పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మూడు గ్రామాల ప్రజలు తిరిగి వారి పాత నివాసాలకు చేరుకొని వారి భూములు వారు దున్నుకుంటారని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందని అవసరమైతే ఉద్యమాన్ని మరింత తీవ్రరూపం దాల్చుతామని పేర్కొన్నారు. కాగా, పోర్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఒక బెర్తును సీఎం జగన్‌తో ప్రారంభింపచేయడానికి సన్నాహాలు చేస్తున్న సమయంలో ఈ ఆందోళన ఎంతవరకు సమం జసము అన్న ఓ విలేకరి ప్రశ్నకు ఆయన బదులిస్తూ నిర్వాసితులకు పునరావాసం చూపించకుండా బెర్తులు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. అయినా ఆ ప్రయత్నం నిర్మాణ కాంట్రాక్టర్లు చేస్తున్నారేకానీ సీఎం ఎక్కడా చెప్పలేదన్నారు. బెర్తు ప్రారంభించాలంటే కస్టమ్స్ అధికారులు క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని నిర్వాసితుల సమస్య ఉండగా కస్టమ్స్ క్లియరెన్స్ రాదని ఆ విషయం కూడా పోర్టు అథారిటీ అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ ఆందోళనలో గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్, నిర్వాసిత గ్రామాల పెద్దలు చేపల రమణయ్య, మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

● తొలిగా లక్ష ఇప్పిస్తాం

- సబ్‌కలెక్టర్, పోర్టు ఎండీ



కాగా, ఉదయం దర్నా జరుగు తున్న శిబిరం వద్దకు కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, పోర్టు ఎండీ ఐవీ రెడ్డిలు చేరుకుని నిర్వాసితులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారంలో తొలివిడతగా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష ఇస్తామని చెప్పి ఆందోళన విరమించాలని కోరారు. అందుకు స్పందించిన మత్స్యకారులు ప్యాకేజీ రూ.9.91 లక్షలకు మూడు రెట్లు కలిపి పరిహారం ఇస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం దిగి వచ్చే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్, గంటెనపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోర్టులో పనులు నిలిపివేసి డ్రెడ్జింగ్ మిషన్లను సముద్రంలో లంగర్ వేసిన దృశ్యం



నెల్లూరులో శివలింగంపై ఉప్పు, మిరియాలు పోస్తున్న భక్తులు

వైభవంగా త్రై అమావాస్య

● వైద్య వీరరాఘవస్వామి సన్నిధిలో భక్తుల రద్దీ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 9 : నగరంలోని క్రాంతినగర్ వేమాలశెట్టిబావి వైద్య వీరరాఘవ స్వామి ఆలయంలో త్రై అమావాస్య తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఉదయం 8గంటలకే స్వామివారి దర్శనం కోసం తెలుగు, తమిళ భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవతోపాటు ఉప ఆలయాల్లో ఉత్సవర్లకు విశేష అలంకారాలు జరిగాయి. శివలింగంపై మిరియాలు, ఉప్పు పోసి పూజలు చేశారు. అనంతరం వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి కొబ్బరికాయలు కొట్టి ధూపదీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, తిరునాళ్ల నిర్వహణకు అనధికారికంగా ఏర్పడిన కమిటీ దాతల నుంచి భారీగా విరాళాలు సేకరించింది. అయినా రూ.50, 100 చొప్పున దర్శన టికెట్లు వసూలు చేశారు. రూ.100 టికెట్లు కొన్న భక్తులు స్వామివారి దర్శనం కోసం తొక్కిసలాటకు గురయ్యారు. అలాగే త్రై అమావాస్య సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

● రంగనాథుడికి గరుడ సేవ



త్రై అమావాస్య సందర్భంగా శుక్రవారం రాత్రి తల్పగిరి రంగనాథ స్వామి స్వర్ణ గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడికి తిరుమంజన సేవ, అనంతరం పూలంగి సేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ ఉత్సవాలను ధర్మకర్తల చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, మాజీ చైర్మన్ మంచికంటి సుధాకర్ రావు, ధర్మకర్తలు, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.



పూటకో మాటతో సరి!

● కృష్ణపట్నం పోర్టుపై మంత్రి కాకాణి వ్యాఖ్యలతో ప్రజలు విస్మయం

"కంటైనర్ టెర్మినల్‌ను మారుస్తున్నారన్న విషయం నెల రోజుల ముందే మా దృష్టికి వచ్చింది. దీనిపై పోర్టు యాజమాన్యంతో మాట్లాడాం. నెమ్మదిగా కంటైనర్లను విత్‌డ్రా చేయాలన్న ఆలోచన ఉందట. చెన్నైకు మార్చాలని ప్రయత్నిస్తున్నారట. దీనిపై దృష్టి పెట్టాలని యాజమాన్యానికి సూచించాం. అయితే మొత్తం ఒకసారి తీయడం లేదని, ఆపరేషన్‌కు ఇబ్బందిగా ఉన్న వెజల్స్‌ను మారుస్తున్నామని వారు చెప్పారు.

- జనవరి 21న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాటలివి.



కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ మూసివేస్తారన్న ప్రచారం అవాస్తవం. గత సంవత్సరం కార్గో ద్వారా రూ.72 కోట్లు పన్నుల రూపంలో వస్తే ఈ ఏడాది రూ.80 కోట్లు వచ్చింది. కంటైనర్ టెర్మినల్ తరలించినా, ఉద్యోగాలు తీసేసినా, పోర్టులో స్థానికులకు ప్రాధాన్యం లేకున్నా, పోర్టు అభివృద్ధి చేయకపోయినా నేను పోర్టు ముందు కూర్చొని నిరసన చేస్తా.

- జనవరి 25న మంత్రి కాకాణి మాటలు

కంటైనర్ టెర్మినల్ తరలింపుపై పోరాడాల్సిన విషయం. ప్రతిపక్షాలు ఎవరి పంథాలో వారు పోరాడాలి. ఎవరు వచ్చినా, ఎవరు రాకపోయినా మా ప్రయత్నం తీవ్రంగా ఉంటుంది. అటు కేంద్ర ప్రభుత్వం ద్వారా లేదా పోర్టు యాజమాన్యం ద్వారా కచ్చితంగా వెజల్ తెప్పిస్తాం. ఆ వెజల్ తెచ్చిన రోజు మీడియా అంతటిని తీసుకెళ్తా. ఎన్నూరు, కాటుపల్లి పోర్టుల్లో ఎక్కడైనా వ్యాపారం చేసుకోవచ్చని, కానీ బయట నుంచి వచ్చే వాటిల్లో కనీసం 20 శాతమైనా కృష్ణపట్నంలో లిఫ్ట్ చేయమని యాజమాన్యానికి చెప్పాం. కంటైనర్ టెర్మినల్ తరలింపుపై ఉద్యోగులు నన్ను కలవగానే జనవరి 24వ తేదీన నేను కేంద్ర మంత్రికి లేఖ రాశాను.

- ఫిబ్రవరి 9వ తేదీన మంత్రి కాకాణి మాటలు

ఇవీ కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ తరలింపు వ్యవహారంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాటలు. కంటైనర్ తరలింపు విషయాన్ని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జనవరి 20వ తేదీన వెలుగులోకి తెచ్చారు. అయితే అనుకున్నట్లుగానే ఇప్పుడు కృష్ణపట్నంలో కంటైనర్ ఆపరేషన్లు ఆగిపోయాయి. దీనిపై గురువారం అఖిలపక్ష పార్టీలన్నీ పోర్టులోకి వెళ్లి యాజమాన్యంతో చర్చించి అల్టిమేటం జారీ చేశాయి. ఈ క్రమంలో శుక్రవారం మంత్రి కాకాణి మీడియా సమావేశం ఏర్పాటు చేసి గతానికి భిన్నంగా మాట్లాడారు. అంతకముందు పోర్టు ద్వారా ఆదాయం పెరిగిందని చెప్పిన మంత్రి, ఇప్పుడు కంటైనర్ల సంఖ్య తగ్గిందని ఒప్పుకున్నారు. కంటైనర్ టెర్మినల్ ఉంటే ఏం లాభం.. కంటైనర్ల హ్యాండ్లింగ్ జరగాలి.. కదా అంటూ కొత్తరాగం అందుకున్నారు. వెజల్స్ (కంటైనర్లను తీసుకొచ్చే ఓడ)ను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని చెప్పారు. కంటైనర్ తరలింపు విషయాన్ని ఉద్యోగులు తన దృష్టికి తీసుకురాగానే జనవరి 24న కేంద్ర మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. మరి జనవరి 21వ తేదీకి నెల రోజుల ముందే కంటైనర్ టెర్మినల్ విషయం తమ దృష్టికి వచ్చిందని తొలుత చెప్పిన మంత్రి అప్పుడే ఎందుకు మేల్కోలేదు, లేఖ రాయలేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిని బట్టి చూస్తే కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టర్మినల్‌ను క్రమేనా మూసివేస్తున్నారన్న విషయం తెలిసి కూడా ప్రభుత్వం పట్టించుకోలేదా!? లేక ప్రభుత్వ తీరు మూలంగానే కంటైనర్ టెర్మినల్ తరలిపోతోందా.. అన్న అనుమానాలను ఉద్యోగులు, స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరుకు తీరని లోటు

కృష్ణపట్నం పోర్టు ఏర్పాటుకు నెల్లూరు జిల్లా ఎంతో త్యాగం చేసింది. వేల ఎకరాల భూములను ఇవ్వడమే కాకుండా పొల్యూషన్‌ను కూడా భరిస్తోంది. పోర్టు ఆధారంగా వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కులు వెలిశాయి. పోర్టులోని కంటైనర్ టెర్మినల్ ద్వారా నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, బెంగళూరు, శ్రీసిటీ ప్రాంతాల్లోని పరిశ్రమలు ముడి సరుకులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. దీనివల్ల రవాణా చార్జీలు తగ్గడంతో పాటు ట్రావెలింగ్ డ్యామేజీలు తక్కువగా ఉంటున్నాయి. పరిశ్రమలే కాకుండా రైతులకు కూడా కృష్ణపట్నంలోని కంటైనర్ టర్మినల్ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇప్పుడు కంటైనర్ టర్మినల్ ఆపరేషన్లు నిలిచిపోవడం మూలంగా అటు పరిశ్రమలపై, ఇటు రైతాంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది. గతేడాది ఖరీఫ్ సీజన్లో బియ్యం ఎగుమతులకు కృష్ణపట్నం పోర్టులో కంటైనర్లు ఇవ్వలేదు. దీంతో నెల్లూరు జిల్లా వ్యాపారులంతా కాకినాడ పోర్టు ద్వారా బియ్యాన్ని ఎగుమతి చేశారు. అప్పుడు నెల్లూరు నుంచి కాకినాడ పోర్టుకు పుట్టికి రూ.2 వేల వరకు రవాణా ఖర్చు అవ్వగా ఆ మొత్తాన్ని ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు తగ్గించారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

అమ్మో... బర్డ్‌ఫ్లూ!

- పొదలకూరులో భారీగా చనిపోతున్న కోళ్లు
- ఇటీవల 20 వేల వరకు మృత్యువాత
- శాంపిల్స్‌ను భోపాల్‌కు పంపిన వెటర్నరీ అధికారులు

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. కొన్నేళ్ల క్రితం కోళ్లు, పక్షులు, మనుషులపై తీవ్ర ప్రభావం చూపిన ఈ వైరస్ లక్షణాలు మళ్లీ జిల్లాలో కనిపిస్తున్నాయి. గడిచిన రెండు వారాలుగా పొదలకూరు మండలంలో భారీగా కోళ్లు చనిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకు 20 వేల కోళ్ల వరకు చనిపోయినట్లు సాగుదారులు చెబుతున్నారు. దీంతో పౌల్ట్రీ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొదలకూరు మండలం మహ్మదాపురంలో చిన్నయిరెడ్డి అనే రైతు 3500 కోళ్లు పెంచుతుండగా శుక్రవారానికి 20 కోళ్లు మాత్రమే మిగిలాయి. అలానే చాటగొట్ల గ్రామంలో చదలవాడ రమేష్ అనే రైతు 9 వేల కోళ్లతో ఫారం నిర్వహిస్తుండగా ఇప్పటికి 8800 కోళ్లు చనిపోయినట్లు చెబుతున్నారు. అదే గ్రామంలో మణిదీప్ అనే రైతుకు చెందిన 1500 కోళ్లు, రత్నగిరి గ్రామంలో మరో రైతు వెయ్యి కోళ్లు పెంచుతుండగా అన్నీ చనిపోయాయి. అంతుచిక్కని వైరస్‌తో ఫారాల్లోని కోళ్లు చనిపోతుండటంతో మరుపూరు, వెలికంటిపాలెంలోని రైతులు తమ వద్ద ఉన్న కోళ్లను వెంటనే విక్రయించేశారు. ఒక్క పొదలకూరు మండలంలోనే ఇటీవల 20 వేల వరకు కోళ్లు చనిపోయి ఉంటాయని అంచనా.



పొదలకూరు : మహ్మదాపురంలో శుక్రవారం చనిపోయిన కోళ్లు

● అధికారుల అప్రమత్తం

వెటర్నరీ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. పొదలకూరు మండలంలోని కోళ్ల ఫారాలకు వెళ్లి చనిపోయిన కోళ్ల కళేబరాల నుంచి శాంపిల్స్ సేకరించారు. విజయవాడలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు జిల్లాకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఒక్కసారి బర్డ్ ఫ్లూ పంజా విసిరితే కోళ్లు, బాతులు, పక్షులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒకవేళ నిజంగా బర్డ్ ఫ్లూ వైరస్‌తోనే ఈ కోళ్లన్నీ చనిపోతుంటే చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. వైరస్ విస్తరించకుండా ప్రోటోకాల్ పాటించాలని చెబుతున్నారు. అధికారులు ఎంత త్వరగా ఈ వైరస్‌ను నిర్ధారిస్తే అంత మంచిదని సూచిస్తున్నారు. పొదలకూరుతో పాటు మరికొన్ని మండలాల్లో కూడా పౌల్ట్రీ సాగు జరుగుతోంది. ఆ రైతులు కూడా నష్టపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కాగా దీనిపై పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడును సంప్రదించగా పొదలకూరు మండలంలో కోళ్లు చనిపోతుండడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. వెటర్నరీ బయోలాజికల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి శాస్త్రవేత్తలు వచ్చి శాంపిల్స్ సేకరించారని తెలిపారు. ఆ శాంపిల్స్‌ను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. అక్కడ ఏ వైరస్‌తో కోళ్లు చనిపోతున్నాయో నిర్ధారణ కాగానే అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పిల్లలకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేయాలి



ఆత్మకూరు : విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు, ఫిబ్రవరి 9: పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని జిల్లా బాల భవిత కేంద్రం (డీఈఐసీ) వైద్యాధికారి డాక్టర్ దినకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నులి పురుగులతో రక్తహీనతతో పాటు పలు రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హైమ, సోషల్ వర్కర్ రమణ, ల్యాబ్ టెక్నీషియన్ రహీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంగం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్ బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సుమారు 7274 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి మింగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలువాయి: మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు నులిపురుగుల మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దారు స్వర్ణ, ఎంఈవోలు బాలకృష్ణారెడ్డి, శేషగిరి, వైద్యాధికారి రమాకుమారి, ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నులిపురుగలతో కలిగే అనారోగ్య సమస్యలపై అధికారులు, వైద్యసిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో తాజ్‌మన్సూర్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు అల్ బెండాజోల్ మాత్రలను మింగించినట్లు మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పన తెలిపారు. పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, హెచ్ఈ కె.వెంకటసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పాఠశాలల్లోని విద్యార్థులకు అల్ బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ పాఠ శాల ప్రిన్సిపాల్ ఎస్‌కే. షాహిదా, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మజీద్, రియాజ్, హెల్త్ అసిస్టెంట్ తిరుపాల్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలంలో 4,270 మంది విద్యార్థులకుగాను 3,870 మందికి మాత్రలు మింగించినట్లు వైద్యులు అయూబ్‌అఫ్సర్, వనజ తెలిపారు. మండలంలోని నందిపాడు కస్తూర్బా గాంధీ పాఠశాలలో వైద్యులు విద్యార్థులకు మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిప్రసాద్, ఎంఈవో వెంగయ్య, ప్రిన్సిపాల్ అంజలీదేవి, సచివాలయాల కన్వీనర్ ఏ.వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్య దర్శులు నజీముల్లా, వెంగళరెడ్డి, వైద్యసిబ్బంది బీబీజాన్, ఖాజామొహిద్దీన్, ఓంకారయ్య, అస్మతుల్లా, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు కోవూరుపల్లి ఆరోగ్యకేంద్రం అధికారులు, సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను అందచేశారు. తిప్ప డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు కోవూరుపల్లి వైద్యులు జి హారిక, నిత్యప్రశాంతి మాత్రలను అందచేశారు. బోగోలు ఎంపీపీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు, స్థానిక జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలను అందచేశారు. ఈ కార్యక్రమాలో హెచ్ఈవో కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ విక్టోరియా, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ప్రిన్సిపాల్ పద్మావతి, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: మండలంలోని 16 పంచాయతీలలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 96.5 శాతం మంది విద్యార్లకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డా. పి రమేష్ చెప్పారు. మిగిలిన 3.5 శాతం మందికి 16వ తేదీన మాత్రలు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ జి శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కలిగిరి : వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రాకుండా చేసుకోవచ్చని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, ఎంఈఓ సురేష్, ఏఓ ఎన్‌వీవీ బ్రహ్మాచారి, ఉపాధ్యాయ, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి



శనగ పంటను పరిశీలిస్తున్న కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు అనసూయ

లింగసముద్రం, ఫిబ్రవరి 9: పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు అనసూయ సూచించారు. శుక్రవారం మండలంలోని రాళ్లపాడు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాం లింకన్‌తో కలిసి ఆమె శనగ పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధిక దిగుబడులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ-క్రాప్ సూపర్ చెక్ రికార్డులను తనిఖీ చేశారు. ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రేణుక, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెస్సార్‌లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెస్సార్ యాజమాన్యం

కావలిటౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్నై బేసడ్ కంప్యూటర్స్ ఈవీఎస్ గ్లోబ్‌వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో వివిధ కళాశాలల నుంచి 250మంది పాల్గొనగా 113మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ టీ ఉమ అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్ చౌదరి విద్యార్థులను అభినందించి ప్రిన్సిపాల్‌తో కలిసి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రాజేష్, మస్తాన్‌వలీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

కొండాపురం, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గత ఏడాది పబ్లిక్ పరిక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బొద్దుకూరు పిచ్చయ్యకు డాక్టరేట్

కావలిటౌన్, ఫిబ్రవరి 9: కావలి పట్టణ ముసునూరుకు చెందిన బొద్దుకూరు పిచ్చయ్యకు హోప్‌థోలాజికల్ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. సామాజిక కార్యకర్తగా హ్యూమన్ రైట్స్ సంఘాల్లో చురుగ్గా పాల్గొంటూ పిచ్చయ్య చేస్తున్న సేవలను గుర్తించిన యూనివర్శిటీ వారు పిచ్చయ్యకు డాక్టరేట్ పురస్కారమందించారు. పలువురు పట్టణ ప్రముఖులు పిచ్చయ్యకు అభినందనలు తెలిపారు.

కొండాపురం తహసీల్దార్‌గా మస్తాన్

కొండాపురం, ఫిబ్రవరి 9: మండల నూతన తహసీల్దార్‌గా టీ మస్తాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందలు తెలిపారు.

రోడ్డు స్థలం ఆక్రమణ

కావలి, ఫిబ్రవరి 9: కావలి పట్టణ పరిధిలోని రోడ్లు, కాలువలు, మున్సిపల్ బావుల స్థలాలు కబ్జాకు గురౌతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. 6వ వార్డు వెంగయ్యగారిపాలెం లోని పోలేరమ్మ గుడి ఎదురుగా ఉన్న పాత ఇంటిని ఓ వ్యక్తి కొనుగోలు చేసి మరమ్మతు పనులు చేస్తూ పక్కన ఉన్న కాలువ, రోడ్డు స్థలాన్ని సైతం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. దీంతో రోడ్డు కుచించుకుపోయిందని, మున్సిపల్ అధికారులు స్పదించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలు అని తేలితే చర్యలు : కమిషనర్

అనేక చోట్ల కాలువలు, రోడ్ల స్థలాలు ఆక్రమణలకు గురౌతున్నట్లు మా దృష్టికి వస్తున్నాయి. ఆయా స్థలాలను పరిశీలించి వారిపై చర్యలు తీసుకుంటాం.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : ఇంటూరి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 9 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కందుకూరు పట్టణంలోని 28వ వార్డు పంచాయతీరాజ్ కార్యాలయం, బలిజపాలెం ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ అప్పులు చేయడం, బటన్ నొక్కడం తప్పితే పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ, ఉపాధి కల్పించి రాష్ట్రానికి ఆదాయం సృష్టించడం చేతకాని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. రాష్ట్రంలోనైనా, నియోజకవర్గంలోనైనా అభివృద్ధి పరుగులు పెట్టాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని గెలిపించాలని, టీడీపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పాలంకి ప్రసాదు, నవిడిబోయిన వెంకటకృష్ణ, దారం విజయకుమార్, మేడా నరసింహరావు, ఆకుల మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవూరుపల్లి చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలి



చెరువు ఆక్రమణలపై అధికారులకు అర్జీ అందచేస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, ఫిబ్రవరి 9: బోగోలు మండలం కోవూపల్లి పంచాయతీ పరిధిలోని చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలని మండల టీడీపీ నేతలు శుక్రవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కోవూరుపల్లి గ్రామ చెరువులో లేఔట్ రూపంలో కొంత ఆక్రమణలకు గురైందని, అంతేకాకుండా ఇతరులు కొంత ఆక్రమించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అందువలన చెరువు విస్తరణ తగ్గిపోయి పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చెరువుపై ఆధారపడి ఉన్న ఆయకట్టు రైతులకు సాగునీరు కొరత ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈమేరకు తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ విజయకుమారికి వినతిపత్రం అందచేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా రైతు నాయకులు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, నాగులవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, మండల నాయకులు సుధీర్‌బాబు, ఎన్ రంగయ్య, ఎన్ భాస్కర్, క్రిష్ణయ్య తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ఉదయగిరి, ఫిబ్రవరి 9: ఉదయగిరి ప్రాంతంలో ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సెబ్ సీఐ రామిరెడ్డి వెంకటరమణమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ శకునాలపల్లి, సమీదుపల్లి, తిరుమలాపురం తదితర గ్రామాల చెరువులు, వాగులు, వంకల నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అలాగే పలు గ్రామాల్లో మద్యం షాపులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహిస్తామని తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు : మానుగుంట



విద్యార్థినులకు షీల్డు అందచేస్తున్న ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 9: క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీగాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా క్రమశిక్షణతో మెలిగి లక్ష్యాలు చేరుకోవాలని ఉద్బోధించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, షీల్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ, ప్రిన్సిపాల్స్ గీతా శ్రీనివాస్, ఉషాచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

అనర్హుల పేర్లు తొలగించాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 9: తమ అనుభవంలో ఉన్న పొలాలకు అనర్హులైన వారి పేర్లు నమోదు చేశారని, పరిశీలించి వాటిని తొలగించి న్యాయం చేయాలని శుక్రవారం మండలంలోని బండగానిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దారు నెహ్రూబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో భూముల రీ సర్వే జరిగిందన్నారు. ఆ సమయంలో రెవెన్యూ సిబ్బంది అనుభవంలో ఉన్న పలువురి రైతుల భూములకు సంబంధించి ఇతరుల పేర్లు నమోదు చేశారన్నారు. స్పందించిన తహసీల్దారు వీఆర్వోను పరిశీలన చేయాలని సూచించారు.

రైతులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



రైతులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి టౌన్, ఫిబ్రవరి 9: సొంత నిధులతో కావలి చెరువు కాలువ పనులు పూర్తిచేసి కాలువకు నీరు సమృద్ధిగా పారేవిధంగా చర్యలు తీసుకుని రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రైతులతో కలిసి కావలి పెద్ద చెరువు 2వ కాలువను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి చెరువు కాలువ పూడిపోవడంతో చివరి వరకు నీరు అందడంలేదని, వారం రోజుల్లో పనులు పూర్తిచేయించి రెండవ పంటకు నీరు అందేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. వెంటనే కాలువ పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు, ఫిబ్రవరి 9 : అల్లూరు సబ్‌స్టేషనులో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌కు వసతుల కల్పనలో వైసీపీ విఫలం

● మత్స్యకారులకు సేవచేయడం అదృష్టం : కావ్య



మత్స్యకార నేతలతో టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 9: గంగపుత్రులైన మత్స్యకారులకు సేవచేసుకునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం పాతబగారుపాలెం, అలిచర్లబంగారుపాలెం, పాతకరపాలెంకు చెందిన మత్స్యకార నేతలు, మత్స్యకారులు శుక్రవారం కావలి పట్టణం ముసునూరులోని ఇన్‌చార్జి కావ్యక్రిష్ణారెడ్డిని కలిసి తమ మద్దతు తెలిపారు. పాత కరపాలెంకు చెందిన వైసీపీ వార్డు మెంబరు కొండూరు మురళీ టీడీపీలో చేరగా కండువా కప్పి క్రిష్ణారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ పాలనలో జువ్వలదిన్నెకు మంజూరైన ఫిషింగ్ హార్బర్‌కు రూ.288 కోట్లు మంజూరుచేసి అప్పట్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారన్నారు. దానికి మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఫిషింగ్ హార్బర్ పూర్తయితే మత్స్యకారులకు ఎంతో మేలు కలుగుతుందని, రానున్న ఎన్నికలలో కావలిలో తనను గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేస్తే పూర్తిస్థాయిలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చంద్రబాబు పూర్తిచేయగలరన్నారు. ఈ కార్యక్రమంలో కావలి మండల టీడీపీ అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి సభ్యుడు సోమయ్యగారి రమణ, బోగోలు మండల బీసీ సెల్ నాయకుడు వావిల శ్రీనివాసులు, మత్స్యకార నేతలు కుర్రు కొండయ్య, కడియాల గోవింద్, చిన్నంగారి శేఖర్, ప్రళయకావేరి మస్తాన్, వావిల చినవెంకటేశ్వర్లు, కోడూరు రామారావు, చిన్నిబాబు, వావిల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి గెలుపునకు సమష్టి కృషి అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లు సాల్మన్ రాజు

అల్లూరు, ఫిబ్రవరి 9 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కావలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయనున్న పసుపులేటి సుధాకర్ గెలుపునకు సమిష్టి కృషి అవసరమని ఎల్లు సాల్మన్ రాజు అన్నారు. అల్లూరులోని పిఎస్ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారందరూ పసుపులేటికి మద్దతుగా నిలిచి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లి రమేష్, సత్యవోలు శేషారెడ్డి, గుమ్మడి రాజేష్‌బాబు, ఎల్లు సుబ్రహ్మణ్యం, కప్పల నవీన్ కుమార్, కావలి మల్లి, కాకాని రంగయ్య, కోవూరు బాబురావు, గోళ్ల హరికృష్ణ, డక్కా అక్షయ్ కుమార్ తదితరుల పాల్గొన్నారు.

మన్నేటికి ఘన సన్మానం



మన్నేటిని సన్మానిస్తున్న జనసేన పార్టీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో మన ఫౌండేషన్ అధినేత, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డిని శుక్రవారం కలిగిరి జనసేన పార్టీ మండల కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మన్నేటి తన ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలతో పాటు ఉదయగిరి, వింజమూరు పట్టణాల్లో అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్నా రన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కమతం శ్రీను, పొన్నం నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాసేన కోసం.. నావంతు కమిటీ సభ్యుడిగా భోగినేని

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 9: నా సేన కోసం.. నా వంతు కార్యక్రమం కమిటీ సభ్యుడిగా ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు భోగినేని కాశీరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనను నాసేన కోసం.. నావంతు కార్యక్రమం కమిటీ సభ్యుడిగా నియమించినందుకు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.


మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఏఎస్‌పీ అహ్మద్‌హుస్సేన్

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : తపాలా బీమా చేసుకుంటే ఆపద సమయంలో అండగా ఉంటుందని ఆత్మకూరు ఏఎస్‌పీ అహ్మద్‌హుస్సేన్ తెలిపారు. పోస్టాఫీసులో పోస్టల్ ఇన్సూరెన్స్ చేసుకుని ఇటీవల మృతి చెందిన బీ. సాయిఅనిల్‌కుమార్ కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ. 11 లక్షల బీమాను అందజేశారు. ఈ సందర్భంగా అహ్మద్‌హుస్సేన్ మాట్లాడుతూ సాయిఅనిల్‌రెడ్డి రెండు సంవత్సరాల క్రితం రూ 10 లక్షల తపాలా బీమా చేశారన్నారు. ఆయన మృతిచెందడంతో బోనస్‌తో కలిపి మొత్తం రూ.11 లక్షలు కుటుంబసభ్యులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం వెంకటరమణ, ఖాజావలి పాల్గొన్నారు.

విజయీభవ యాత్రలో ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకపాటి

మర్రిపాడు, ఫిబ్రవరి 9: డీసీపల్లి నుంచి ఆత్మకూరు మండలం వెన్నవాడకు రూ291.40లక్షలతో తారు రోడ్డు మంజూరైంది. దీంతో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం వెన్నవాడలో జరిగిన విజయీభవ యాత్రలో పాల్గొని, రైతుభరోసా, సచివాలయం, పాలవెల్లువ కేంద్రం, ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం, ఫిబ్రవరి 9: మార్చిలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ సెంటర్లను ఎంఈవో ఎస్‌కే. మస్తాన్‌వలి, మండల ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు గానూ, పరీక్షా కేంద్రాల్లో సదు పాయాలు, గదులు, సామాగ్రిని పరిశీలించామని, సీసీ కెమెరాలు సైతం ఉన్నాయా లేవా అనే విషయాన్ని ధ్రువీకరించి వివరాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం రెహమాన్, సీఆర్పి కులారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో దశల వారీగా యుద్ధప్రాతిపదికన పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లాలా తెలిపారు. ఆయన శుక్రవారం పలు ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్యం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9 : రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత - అందరి బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మోటారు వాహనాల తనిఖీ అధికారి రాములు మాట్లాడుతూ వ్యాస రచన పోటీల్లో విజేతలైన వారికి సోమవారం ఆర్టీసీ తరఫున బహుమతులు అందజేస్తామన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కరీమున్నీసా, ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపండి

అనంతసాగరం, ఫిబ్రవరి 9: మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై సిబ్బంది ప్రతేక శ్రద్ధ చూపాలని తహసీల్దారు నరసింహారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ జగనన్న గృహాల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలని, భూరీసర్వే కార్యక్రమంపై దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించండి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 9: పట్టణంలో ఇటీవల చోటు చేసుకుంటున్న అసాంఘీక కార్యకలాపాలపై అధికారులు దృష్టిసారించాలని జిల్లా వైసీపీ యూత్ కార్యదర్శి షేక్ గాజుల షర్ఫుద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత వెలుగు కార్యాలయంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం, సాయంత్రం సమయంలో అమ్మాయిలపై ఆకతాయిల బెడద అధికమైందన్నారు. అధికారులు ప్రత్యేక నిఘా ఉంచడడంతో పాటు ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

కలువాయి, ఫిబ్రవరి 9: మండలంలోని తెలుగురాయపురంలో ఇళ్ల ముందు వేసిన ప్లాట్‌ఫారంలను శుక్రవారం పంచాయతీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పైపులైన్ లీకేజీతో వీధులు అపరిశుభ్రంగా మారాయని, వీధులు కూడా ఆక్రమణలకు గురవడంతో వీటిపై చర్యలు తీసుకోవాలని జగనన్నకు చెబుదాం కార్యక్ర మంలో గ్రామస్థులు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి తెలిపారు. ఇళ్ల ముందు ప్లాట్‌ఫారంలు వేయడంతో మురికినీరు వెళ్లే మార్గం లేక వీధులు అపరిశుభ్రంగా మారాయని, దీంతో దోమలు కూడా అధికమయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో ప్లాట్‌ఫారంలను తొలగించినట్లు ఆమె తెలిపారు.

సొసైటీ సభ్యులు ధ్రువపత్రాలు సమర్పించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 9: మండలంలోని కమ్మవారిపల్లి సొసైటీలో రూ.300లు ఆపైన షేర్ల ధనం కలిగిన సొసైటీ సభ్యులు సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని ఉదయగిరి బ్రాంచ్ సూపర్‌వైజర్ బీ.సురేంద్రరెడ్డి, సొసైటీ సీఈవో లోక్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సొసైటీల రికార్డులు కంప్యూటరీకరణ చేసేందుకు నిర్ణయించారన్నారు. ఈనెల 15వ తేదీలోపు కార్యాలయంలో అందజేయాలని వారు కోరారు.

పంచాయతీ సమావేశం రసాభాస



కార్యదర్శిని నిలదీస్తున్న ఓ వర్గం వారు

వరికుంటపాడు, ఫిబ్రవరి 9: విరువూరులో శుక్రవారం పంచాయతీ సర్పంచ్ పాలకొల్లు ఉమామహేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన పంచాయతీ సమావేశం అధికారపార్టీకి చెందిన ఇరు వర్గీయుల నడుమ ఉద్రిక్తంగా మారడంతో అర్ధాంతరంగా ముగిసింది. వివరాల మేరకు పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతుండగా ఓ వర్గానికి చెందిన కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. కోరం లేకుండా ఆమోదిస్తున్న తీర్మాన పత్రాలను చూపించాలని పట్టుబట్టడంతో పాటు గతంలోనూ సక్రమంగా సమావేశాలు నిర్వహించలేదని నిలదీశారు. అలాగే పంచాయతీలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేసేలా తీర్మానం చేయాలని పట్టుబట్టారు. దీంతో రెవెన్యూ అధికారులకు సంబంధించిన అంశాన్ని పంచాయతీ తీర్మానంలో పొందుపరిచే అవకాశం లేదని కార్యదర్శి చెబుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈనేపథ్యంలో ఇరువర్గీయుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటీనా సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గీయులను సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

12న డయల్ యువర్ డీఎం

ఉదయగిరి, ఫిబ్రవరి 9: ఉదయగిరి ఆర్టీసీ డిపోలో ఈనెల 12వ తేదీన డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలోని అన్ని మండలాల ప్రయాణికులు తమ సూచనలను ఉదయం 11 నుంచి 12 గంటలలోపు 9959225095 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.